ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ fb.com/vaartha

PUBLISHED FROM MAHABUBNAGAR, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

19-1-2023 గురువారం సంపుటి : 28 సంచిక : 349, పేజీలు : 10+4 వెల : 6.50




కివీస్‌పై టీమిండియా విజయం

## కెసిఆర్ మాకు పెద్దన్న

-ఢిల్లీ సిఎం కేజ్రీవాల్

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** కేసీఆర్ తమకు పెద్దన్నలాంటి వారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కంటివెలుగు అద్భుతమైన కార్యక్రమం అని, కంటి వెలుగు నుంచి చాలా విషయాలు నేర్చుకున్నామన్నారు. ఢిల్లీ, పంజాబ్ లోనూ ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు. తెలంగాణలో కొత్త కలెక్టరేట్ల నిర్మాణం అద్భుతమని కొనియాడారు. దేశాన్ని అభివృద్ధి చేయడం ఎలా.. రైతులకు ఏం చేయాలి, కార్మికులకు ఏం చేయాలనే దానిపైనా ఇవాళ ముఖ్యనేతలందరూ కలిసి ≫2

## మోడీకి మిగిలింది 400 రోజులే

యుపి మాజీ సిఎం అఖిలేశ్

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఇంకా 400 రోజులే మిగిలి ఉన్నాయని యూపీ మాజీ సీఎం అఃలేశ్ యాదవ్ అన్నారు. కేంద్రం రోజులు లెక్కబెట్టుకుంటోందని, ఇవాల్టితో ఇంకా 399 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. రైతులను ఆదుకుంటామని మోడీ మాట తప్పారని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని మోసం చేశారని అన్నారు. దర్యాప్తు సంస్థలను చూపి ప్రతిపక్షాలను బీజేపీ భయపెట్టే ≫2

# ఇక బిజెపి ఇంటికి.. మేం ఢిల్లీకి



ఖమ్మంలో బుధవారం బిఆర్ఎస్ సభకు హాజరైన అశేష ప్రజానీకం



సభలో అభివాదం చేస్తున్న సిఎం కెసిఆర్, కేరళ సిఎం పినరయ్, పంజాబ్ సిఎం భగవంత్‌మాన్, యుపి మాజీ సిఎం అఖిలేష్, సిపిఐ నేత రాజా, ఢిల్లీ సిఎం కేజ్రీవాల్

### బిఆర్ఎస్ ఆవిర్భావ సభలో సిఎం కెసిఆర్

### మీది ప్రైవేటు బాట.. మాది జాతీయం బాట

### మీరు షావుకార్లకు ఇచ్చినవన్నీ వాపస్ తీసుకుంటాం.. 75 యేళ్ల స్వతంత్ర దేశంలో ఇంకా విషపు నీళ్లా?

### పిజ్జాలు, బర్గర్‌లు తినాల్సిన ఖర్మ ఎందుకు?

### రైతుబంధు, దళితబంధు, ఉచిత కరెంటు దేశవ్యాప్తంగా అమలు.. బిఆర్ఎస్ జాతీయ పాలసీ త్వరలో ప్రకటన

### పార్టీ ఆవిర్భావ సభలో ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** దేశంలో అపార జల సంపద ఉంది.. భూమి ఉంది.. యాపిల్‌తో పాటు మామిడి కూడా పండుతుంది. ప్రపంచానికి ఫుడ్ చైన్‌గా ఉండాల్సిన మన దేశం మెక్‌డోనాల్డ్ పిజ్జాలు, బర్గర్‌లు తినాల్సిన ఖర్మమేమిటి. కెనడా నుంచి కందిపప్పు దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొనడానికి లక్ష్యం లేని బీజేపీ పాలనే కారణమని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇంకా విషపు నీళ్లే తాగాల్సిన దౌర్భాగ్యానికి కారణం ఎవరని ఆయన ప్రశ్నించారు. ప్రయివేటీకరణ విధానంతో బీజేపీ దేశాన్ని తాకట్టు పెడుతుందని ఈ నేపథ్యంలోనే భారత జాతి విముక్తికే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భవించిందని అన్నారు. బుధవారం ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో కేంద్ర వైఫల్యాలను ఎండగట్టిన ఆయన బీఆర్ఎస్ విధానాలను ప్రజల ముందుంచారు. నష్టం వచ్చే సంస్థలను ప్రజల మీద రుద్దుతూ లాభాలలో ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం 2024లో ఇంటికి పోవడం తాము ఢిల్లీకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీది ప్రయివేటీకరణ బాటయితే.. తమది జాతీయం బాటని కేసీఆర్ స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో ప్రజల్లో చైతన్యం తేవడానికి మరో తెలంగాణ తరహా ఉద్యమానికి సన్నద్ధమవుతున్నామని అన్నారు. దేశంలో సహజ సంపద వివరాలు, బీఆర్ఎస్ వ్యవహరించబోయే విధానాల గురించి ఈ సభ ద్వారా ఆయన ≫2

# దేశానికి కంటి వెలుగు ఆదర్శం

### ఢిల్లీ, పంజాబ్, కేరళ రాష్ట్రాలలో అమలు చేస్తామని సిఎంలు వెల్లడి

### 2వ విడత కంటి వెలుగు ప్రారంభించిన జాతీయ నేతలు



బుధవారం ఖమ్మంలో 'కంటివెలుగు'ను ప్రారంభించిన సిఎం కెసిఆర్. చిత్రంలో పినరయ్, కేజ్రీవాల్, భగవంత్‌మాన్ తదితరులు

**ఖమ్మం, జనవరి 18, ప్రభాతవార్త:** రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు కేరళ, ఢిల్లీ పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవల్, భగవంత్‌సింగ్‌మాన్‌తో పాటు యూపీ మాజీ సీఎం అఃలేష్ యాదవ్ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు లబ్దిదారులు ధరావత్ పిచ్చమ్మ, మందా అన్నపూర్ణ, రామనాథం, కోలం జ్యోతి, వెంకటేశ్వర్లు, షేక్ గౌసియాబేగంకు నేతలు సీఎం పినరయ్ విజనయ్, అరవింద్ కేజ్రీవాల్ భగవంత్ మాన్, సీఎం కేసీఆర్, అఃలేష్ యాదవ్, డి రాజా కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కార్యక్రమం గురించి జాతీయ నేతలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హారీష్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తెలంగాణలో చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఢిల్లీ, కేరళ, పంజాబ్ రాష్ట్రలలో ప్రారంభిస్తామని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రి వెల్లడించడం విశేషం. ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్‌తో పాటు యూపీ మాజీ ముఖ్యమంత్రి సీపీఐ ≫2

## 3 రాష్ట్రాలకు వచ్చేనెల ఎన్నికలు

త్రిపుర- ఫిబ్రవరి 16న

మేఘాలయ, నాగాలాండ్- ఫిబ్రవరి 27

మార్చి 2న ఫలితాలు



**న్యూఢిల్లీ, జనవరి 18:** నూతన సంవత్సరం ఎన్నికల సందడి మొదలైంది. మార్చిలో గడువు ముగిసే మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. త్రిపురలో ఫిబ్రవరి 16న, మేఘాలయ, నాగాలాండ్‌లలో ఫిబ్రవరి27న ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ≫2



బుధవారం దావోస్‌లో మంత్రి కెటిఆర్‌తో సమావేశమైన హైపర్ స్కేల్ సంస్థ ప్రతినిధులు

# మరో 2 వేలకోట్ల భారీ పెట్టుబడులు

### హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్న ఎయిర్‌టెల్ గ్రూప్: దావోస్‌లో మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో డేటా స్టోరేజ్, విశ్లేషనతో అత్యాధునిక సాంకేతికతో కూడిన హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ఏర్పాటు కాబోతుంది. తన అనుబంధ సంస్థ అయిన నెక్స్‌ట్రా ద్వారా భారతీ ఏయిర్‌టెల్ ఈ డేటా సెంటర్‌ను నెలకొల్పుతుంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రెండువేల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఏయిర్‌టెల్ ప్రకటించింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలీయన్‌లో ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావుతో భారతీ ఏయిల్‌టెల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ సునీల్ భారతి మిట్టల్, వైస్ చైర్మన్, ఎండి రాజన్ భారత్ మిట్టల్‌ల సమావేశం తరువాత ఆ సంస్థ ఈ ప్రకటన చేసింది. 60మెగావాట్ల సామర్థ్యంతో ఈ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ≫2



## కెసిఆర్ మాకు పెద్దన్న

≫ చర్చించామని కేజ్రీవాల్ తెలిపారు. కేరళలో విద్యాసంస్థలు అద్భుతంగా ఉన్నాయని, అలాంటి పరిస్థితి దేశంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను బీజేపీ దుర్వినియోగం చేస్తుందన్నారు. తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ, కేరళలో గవర్నర్లు ఏం చేస్తున్నారో ప్రజలందరూ చూస్తున్నారని అన్నారు.
అభివృద్ధి పనులకు అడ్డుతగలడమే గవర్నర్ల పని అన్నట్లు ఉందని కేజ్రీవాల్ అన్నారు. గవర్నర్లు కేవలం కీలుబొమ్మలుగా మరారని ఆరోపించారు.

## మిగిలింది 400 రోజులే

≫ ప్రయత్నం చేస్తుందన్నారు. కేసుల పేరుతో ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. బీజేపీని ఢిల్లీ నుండి తరిమికొట్టే బాధ్యత ఈ నేల నుండే తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంత పెద్ద సభ ఇప్పటి వరకు తాను చూడలేదని ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.

# ఇక బిజెపి ఇంటికి.. మేం ఢిల్లీకి

≫ ప్రజలకు వివరించారు.

**అద్భుతమైన వాతావరణం ఉన్న దేశం మనది..**

కోటాను కోట్ల మందికి ఉద్యోగాలు కల్పించి బెస్ట్ ఫుడ్ చైన్ ఆఫ్ వరల్డ్‌గా ఉండాల్సినటువంటి భారత్ ఇవాళ కెనడా నుంచి కందిపప్పు దిగుమతి చేసుకుంటదా... లక్ష కోట్ల రూపాయల విలువైన ఫామాయిల్‌ను దిగుమతి చేసుకుంటదా.. ఇంత కన్న సిగ్గు చేటు ఉంటదా అని కేసీఆర్ ప్రశ్నించారు. భారతదేశం భూభాగం 83 కోట్ల ఎకరాలు కాగా ఇందులో సరాసరి 41 కోట్ల ఎకరాల భూమి వ్యవసాయానికి అనుకూలమని, దేశంలో లక్షా 40 వేల టీఎంసీల వర్షం కురుస్తుండగా 70 వేల టీఎంసీలు అవిరైతే 70-75 వేల టీఎంసీల నీరు ఉపయోగించుకునే అవకాశం ఉందని కేసీఆర్ వివరించారు. భూమి ఉంది. నీరు ఉంది. పంటలు పండటానికి అవస రమైన సూర్యరశ్మి అద్భుతంగా కలిగి ఉన్న దేశం మనదని, భారత దేశంలో యాపిల్ పండుతుంది. మామిడి కాయ కూడా పండుతుందని ఇతర దేశాల్లో ఇలాంటి వాతావరణం ఉండదని అన్నారు. కష్టించి పనిచేసే దేశంలో 130 కోట్ల జనభాలో మనం తినేది మెక్ డోనాల్డ్ పిజ్జాలు, మెక్‌డొనాల్డ్ బర్గర్లా అని ఆయన ప్రశ్నించారు.

**75 ఏళ్ల స్వాతంత్ర్య భారత్‌లో విషపు మంచినీళ్లా..**

75 ఏళ్ల స్వాతంత్ర్య భారత్‌లో ఇప్పటికీ చాలా చోట్ల విషపు మంచినీళ్లే ఉన్నాయన్నారు. దేశం లక్ష్యం కోల్పోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. నీళ్ల విషయంలో ట్రిబ్యునళ్ల ఏర్పాట్లపైనా కేసీఆర్ ఘాటుగా స్పందించారు. ఉలుకూ పలుకు లేని ట్రిబ్యునళ్లతో ప్రాజెక్టులు పూర్తయ్యేదెప్పుడు అని ప్రశ్నించారు. సాగుకు ఆమోదయోగ్యమైన భూమి ఉంది, నీరుంది వనరులు పుష్కలంగా ఉన్నాయి. కానీ వాడుకునే తెలివి కేంద్రంలోని ప్రభుత్వాలకు లేకపోయిందని విమర్శించారు కేసీఆర్.

**మోదీ 2024లో నువ్వు ఇంటికి.. మేం ఢిల్లీకి..**

బీజేపీ చెప్పే నీతి సోషలైజ్ ది లాసెస్.. ప్రైవేటైజ్‌ది ప్రాఫిట్ అని, దుర్మార్గమైన దోపిడిదారుల ప్రభుత్వం బీజేపీ అంటూ కేసీఆర్ విమర్శించారు. మోడీ పాలసీ ప్రైవేటైజేషన్ అయితే.. మా పాలసీ నేషనలైజేషన్ అని కేసీఆర్ అన్నారు. మోడీ ఎల్ఐసీ అమ్ముతా అని అంటున్నావ్.. అమ్మేయ్ పర్వాలేదు. 2024 తర్వాత నువ్వు ఇంటికి.. మేం ఢిల్లీకి.. గ్యారంటీగా ఎల్ఐసీ, పబ్లిక్ సెక్టార్లను వాపస్ తీసుకుంటాం. ఎల్ఐసీ సోదరులకు 42 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నయ్. లక్షలాది మంది ఏజెంట్లు , ఉద్యోగులు ఉన్నారు. భారతీయుల ఆత్మతోని, ప్రతి సామాన్యుడి కుటుంబంతోని పెనవేసుకొనిపోయిన పేగుబంధం ఉన్న సంస్థ ఎల్ఐసీ. అప్పనంగా, వడ్డీకి పావుపేరు ఇష్టం వచ్చిన షావుకార్లకు అమ్ముతామని ఉవ్విళ్లూరుతున్నవ్. మళ్లీ వాపస్ తీసుకుంటాం. ఎల్ఐసీ కార్మికులు, మిత్రులు సింహాంల్లా గర్జించండి. బీఆర్ఎస్‌ను బలపరచండి. ఎల్ఐసీని రక్షించుకుందాం అని కేసీఆర్ పిలుపునిచ్చారు.



హెలికాప్టర్‌లో అఖిలేష్, పినరయ్ తదితరులతో సిఎం కెసిఆర్

**బీఆర్ఎస్ పార్టీ పెట్టడానికి కారణం ఇదే**

జింబాబ్వే అనే దేశంలో 6,533 టీఎంసీల రిజర్వాయర్ జాంబేజ్ నది మీద ఉంది. రష్యాలో అంగారా నది మీద 5,968 టీఎంసీల ప్రాజెక్టు ఉంది. వోల్టా నది మీద ఘనా దేశంలో 5085 టీఎంసీల ప్రాజెక్టు, కెనడాలో మనీకూగాన్ నది మీద 4944 టీఎంసీల ప్రాజెక్టు, ఈజిప్టులో నైలు నది మీద 4500 టీఎంసీల ప్రాజెక్టు, చైనాలో యాంగ్జీ నది మీద 1400 టీఎంసీల ప్రాజెక్టు, అమెరికాలోని కొలరాడో నది మీద 1200 టీఎంసీల ప్రాజెక్టు ఉందని మరి మన దేశానికి ఏమైందని కేసీఆర్ ప్రశ్నించారు. 139 కోట్ల జనాభా, ప్రకృతి సంపద కలిగిన మనం కరువులు చూసినం, కాటకాలు చూసినం, వరదలు చూస్తున్నం, ఇలాంటి ప్రాజెక్టు ఒక్కటి కూడా వద్దా మన మొఖానికి అని ఆయన దుయ్యబట్టారు. ఇవి ప్రశ్నించడానికి.. ఈ చైతన్యం తేవడానికి... దీన్ని సాధించడానికి పుట్టిందే బీఆర్ఎస్ పార్టీ అని సీఎం స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే**

ప్రస్తుతం దేశమంతటా కరెంటు కష్టాలు ఉన్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. ఒక్క తెలంగాణ తప్ప అన్ని రాష్ట్రాల్లోనూ కోతలేనని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 2 ఏళ్లలోనే వెలుగు జిలుగుల భారతాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అలాగే రైతులకు కూడా ఉచిత కరెంటు ఇస్తామని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. కేంద్రం ఏటా 25 లక్షల మందికి దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి చేతకాక పోతే తమ ప్రభుత్వం వచ్చాక చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. త్వరలో బీఆర్ఎస్ విధివిధానాలను, పార్టీ వైఖరిని వెల్లడిస్తామని ఈ సందర్భంగా కేసీఆర్ తెలిపారు.

## వారం - వర్జ్యం

**19-1-2023 గురువారం**
శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం, పుష్య మాసం, కృష్ణ పక్షం, కార్తె ఉత్తరాషాఢ
ద్వాదశి ఉ.09-42; జ్యేష్ఠ మ.12-26
వర్జ్యం లేదు
రా.కా.మ.1-30 ల 3-00 వ
యమగండం ఉ.6-00 ల 7-30 వ
దుర్ముహూర్తం ఉ.10-00 ల 10-48 వ
మ.2-48 ల 3-36 వ

## వార్తాఫలం

**మేషం:** స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచన.

**వృషభం:** అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. గృహ యోగం.

**మిథునం:** విద్యార్థులకు శుభ యోగం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి.

**కర్కాటకం:** దేశాంతర ప్రయాణం చేస్తారు. ఆచి తూచి ఖర్చు చేస్తారు.

**సింహం:** కుటుంబంలో కలతలకు ఆస్కారం. ఉపాధ్యాయులకు స్థాన చలనం.

**కన్య:** వృధా కాలక్షేపం చేస్తారు. చోర భయం పొంచి వుంది. వాహన ప్రాప్తి.

**తుల:** స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. క్రయ-విక్రయాలు సామాన్యం.

**వృశ్చికం:** అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. ఆకస్మిక సంఘటనలు జరుగుతాయి.

**ధనుస్సు:** శ్రమకు తగిన ఫలితాలు పొందుతారు. చిరు వ్యాపారులకు లాభం.

**మకరం:** చిరకాల కోరిక తీరుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు. చర్చలు వాయిదా.

**కుంభం:** వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

**మీనం:** హోల్ సేల్ వ్యాపారులకు లాభం. కోర్టు తీర్పులు అనుకూలంగా వుంటాయి.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

# నిధుల దుబారాపై దృష్టి

## ప్రారంభమైన ప్రి బడ్జెట్ సమావేశాలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** నిధుల విషయంలో కేంద్ర సహకారం ఆశాజనకంగా లేకపోవడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్‌కు రూపకల్పన చేస్తోంది. దీంతో పాటు, ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో రెండు నెలల్లో ముగియనుండగా, నిధుల వినియోగంపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా నిధుల వినియోగంలో దుబారాను అరికట్టంపై దృష్టి సారించింది. అంతేకాకుండా ఆర్థిక నియంత్రణను పాటించేలా ప్రభుత్వ శాఖలన్నీ తగిన చర్యలు తీసుకోవడం తప్పనిసరి కానుంది. ఈ ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో 2023-24 వార్షిక బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ అయినా తెలంగాణ సర్కార్ దాన్ని పూర్తి స్థాయిలో రూపొందిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఈ నెల 13 వ తేదీ వరకూ అన్ని శాఖలనుండి బడ్జెట్ అంచ నాలకు సంబంధించిన ప్రతిపాదనలను శాఖల వారీగా సేకరించిన ఆర్థిక శాఖ బుధవారం నుండి ప్రీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించడం ప్రారంభించింది. ఇందులో భాగంగాతొలిరోజు పంచాయితీరాజ్, మున్సిపల్, పశుసంవర్థక, రవాణా, రోడ్లు, భవనాలు, రెవెన్యూ, దేవా దాయ, ఆర్థిక, ప్రణాళికా శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై చర్చ జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31వరకూ అన్నిశాఖలు చేయనున్న వ్యయాన్ని 30 నుండి 50% వరకూ తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లోనే ప్రస్తుత 2022-23 అంచనా బడ్జెట్‌ను సవరించిన అంచనా బడ్జెట్ పరిమాణాన్ని న20 శాతం తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ఎఫ్ఆర్‌బిఎం పరిమితులు, మార్కెట్ రుణాలు, బడ్జేటేతర రుణాలపై ఆంక్షల నేపథ్యంలో తెంగాణ ప్రభుత్వ ఖజానాకు దాదాపు 40 వేల కోట్ల రూపాయలకు పైగా లోటును ఎదుర్కొంటోంది. ముఖ్యంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 40 వేల కోట్ల రూపాయల మేర బడ్జెట్ అంచనాలకు గాను కేవలం 10 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేంద్ర గ్రాంట్ల రూపంలో వస్తాయని అంచనా వేస్తున్నారు. దీనికి తగినట్లుగా ఎఫ్ఆర్‌బిఎం పరిధి మించుతున్న కారణంగా బడ్జెటలో 54 వేల కోట్ల రూపాయల చొప్పున మార్కెట్‌లో రుణాలు తీసుకోవాలని నిర్ణయించినా, కేంద్రం దాన్ని 37,650 కోట్ల రూపాయలకే అనుమతించింది. ప్రస్తుత ఏడాది దాదాపు 43 వేల కోట్ల రూపాయల మేర లోటు వచ్చే అవకాశాలు ఉండటంతో వీటన్నింటి దృష్ట్యా ఆర్థిక నియంత్రణ తప్పనిసరిగా అమలు చేయాలని ఆయా శాఖలకు ఆర్థిక శాఖ దిశా నిర్దేశం చేసింది.

# మరో 2 వేలకోట్ల భారీ పెట్టుబడులు

≫ రాబోతుంది. డేటా భద్రతలో అత్యాధునికత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఈ డేటా సెంటర్ రాబోయే 5-7 సంవత్సరాల కాలంలో పూర్తి స్థాయిలో తన కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ ఏయిర్‌టెల్ నెక్స్ ట్రా తెలంగాణలో పెట్టుబడి పెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్‌లకు హైదరాబాద్ హబ్ మారిందన్నారు. ఏయిల్ తాజా పెట్టుబడితో తాము ఆశిస్తున్న మరిన్ని ఫలితాలు వస్తాయని నమ్ముతున్నామన్నారు. ఏయిల్‌టెల్-తెలంగాణ మధ్య ఈ సంబంధం ఇలానే కొనసాగాలని ఆశిస్తున్నాను. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటి, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా డిజిటలన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఏయిల్‌టెల్-నెక్స్‌ట్రాతో తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందన్నారు.
భారతీయ ఏయిర్‌టెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతే హైపర్ స్కేల్ డేటా సెంటర్ దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులలో ఒకటి అన్నారు. తెలంగాణతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. 2022 మేలో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో ప్రారంభమైన డేటా సెంటర్ ఏర్పాటు చర్చలు నెలల వ్యవధిలోనే కార్యరూపం దాల్చడానికి తెలంగాణ ప్రభుత్వం చాలా వేగంగా పనిచేసిందన్నారు. ఇతర రంగాల్లోనూ మా ఉనికి, ముద్రను చాటుకోవడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐటి, పరిశ్రమ, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 3 రాష్ట్రాలకు వచ్చేనెల ఎన్నికలు

≫ కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ త్రిపురలో జనవరి 21న విడుదలవుతుంది. నామినేషన్లకు ఆఖరు తేదీ జనవరి 30,ఉపసంహారణ ఆఖరు తేదీ ఫిబ్రవరి 2 కాగా.. మేఘాలయ, నాగాలాండ్‌లో ఎన్నికల నోటిఫికేషన్ జనవరి 31న విడుదలవుతుంది. నామినేషన్లకు ఆఖరు తేదీ ఫిబ్రవరి 7, ఉపసంహారణ ఆఖరు తేదీ ఫిబ్రవరి 10.. ఈ మూడు రాష్ట్రాల్లోనూ మార్చి 2న ఓట్ల లెక్కింపు చేపడ్తారు. నాగాలాండ్‌లో మార్చి 12న, మేఘాలయాలో మార్చి 15న, త్రిపురలో మార్చి 22న అసెంబ్లీల గడువు ముగియనున్నది.
మూడు రాష్ట్రాల్లో 60 అసెంబ్లీ స్థానాల చొప్పున మొత్తంగా 180 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 3 రాష్ట్రాల్లో మొత్తం 9125 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని రాజీవ్‌కుమార్ తెలిపారు. 80 శాతానికిపపైగా పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. 70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.
కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలోని ఇసి బృందం ఇటీవలే ఈ 3 రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికలపై రాజకీయ పార్టీలు, స్థానిక యంత్రాంగం, పోలీస్ సిబ్బంది అభిప్రాయం తీసుకుంది. ప్రస్తుతం త్రిపురలో మాణిక్ సాహా నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండగా, మిగతా రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వాల్లో బిజెపి భాగస్వామిగా ఉంది. ఈ ఏడాది మొత్తం 9 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. కర్నాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభల పదవీకాలం ఈ యేడాదిలోనే ముగియనున్నది.

# కంటి వెలుగు ఆదర్శం

≫ జాతీయ కార్యదర్శి నేత డి రాజా ప్రారంభోత్సవం చేశారు. అంతకు ముందు యాదాద్రి నుంచి హెలీకాప్టర్లలో ఖమ్మం చేరుకున్న ముఖ్యమంత్రులు, జాతీయ నేతలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సీఎం కేసీఆర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ గురించి జాతీయ నేతలకు సీఎం కేసీఆర్ వివరించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సర్వమత ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అనంతరం చాంబర్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కూర్చుండబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఫోటో ఎగ్జిబిషన్‌ను జాతీయ నేతలు తిలకించారు. సీఎం కేసీఆర్ కలెక్టరేట్ల నిర్మాణానికి సంబందించిన వివరాలు నేతలకు వివరించారు.

SINGAM KUIL RED WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| DAY - SINGAM SERIES Dr No:170 | DAY - KUIL SERIES Dr No:170 |
| 1st Prize Rs.100000/- 784569 | 1st Prize Rs.100000/- 589674 |
| 2nd Prize Rs.7000/- 99902 | 2nd Prize Rs.7000/- 26766 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 14557 22574 55690 60512 68533 | 01670 07411 07830 11551 17034 |
| 69537 70887 75790 81380 89873 | 57801 83572 95995 97395 98791 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 1059 3128 5127 5175 5569 5789 5792 | 1251 2051 2565 2792 3036 4131 4696 |
| 6714 8870 9134 | 8712 9160 9663 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0989 3242 3299 4265 4328 4806 6602 | 3173 3623 4378 5049 5512 7011 8011 |
| 7448 9056 9738 | 8400 8535 9033 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0038 1168 2818 4256 5594 7595 9175 | 0223 1831 3122 4797 6161 7686 9288 |
| 0061 1329 2833 4412 5676 7854 9201 | 0276 1959 3166 4845 6345 7837 9314 |
| 0097 1498 2960 4451 5806 7959 9236 | 0321 1970 3198 4883 6471 7974 9366 |
| 0293 1579 2986 4606 6144 7977 9551 | 0369 2077 3338 4897 6700 8014 9427 |
| 0303 1628 3038 4627 6456 7986 9627 | 0469 2219 3493 4922 6743 8019 9477 |
| 0321 1879 3142 5060 6489 8116 9628 | 0578 2287 3827 5016 6771 8048 9621 |
| 0594 1934 3150 5142 6550 8202 9629 | 0667 2338 3960 5105 6927 8308 9682 |
| 0595 2093 3388 5182 6617 8266 9825 | 0673 2374 4055 5181 6963 8342 9829 |
| 0597 2175 3411 5244 6666 8271 9889 | 1039 2737 4090 5226 7036 8363 9946 |
| 0669 2476 3472 5256 6669 8285 9924 | 1154 2775 4144 5578 7095 8372 9986 |
| 0694 2575 3792 5329 6694 8686 | 1269 2790 4264 5620 7241 8511 |
| 0983 2590 3888 5407 6912 8799 | 1354 2827 4330 5921 7329 8594 |
| 1036 2641 3914 5412 7106 8957 | 1579 2871 4499 5952 7359 8676 |
| 1046 2663 3935 5470 7313 8985 | 1611 2930 4541 6081 7572 8818 |
| 1067 2773 4162 5496 7486 9083 | 1751 2939 4773 6107 7594 9153 |

ROSA DEER PEARL WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| DAY - ROSA SERIES Dr No:170 | DAY - DEER SERIES Dr No:170 |
| 1st Prize Rs.100000/- 223596 | 1st Prize Rs.100000/- 655325 |
| 2nd Prize Rs.7000/- 43792 | 2nd Prize Rs.7000/- 25353 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 00924 08289 08861 38720 39879 | 10299 30231 30725 38424 41812 |
| 51326 62143 67581 78563 82942 | 55866 63580 79906 82309 88272 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0035 0930 2962 4062 4312 4493 6457 | 0148 0519 0850 1420 4179 5240 7227 |
| 6593 7589 8156 | 8260 8290 8617 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0266 0750 1217 1481 3377 5090 5523 | 0599 3247 3856 4207 5464 5587 6774 |
| 7667 9194 9579 | 6851 7105 7927 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0092 1876 3560 5394 6215 7357 8937 | 0005 2040 3710 4972 6444 7659 8576 |
| 0221 1930 3786 5484 6273 7477 8999 | 0125 2159 3736 5252 6452 7761 8809 |
| 0275 1961 3972 5504 6365 7546 9176 | 0281 2193 3839 5347 6516 7784 8912 |
| 0418 1976 4015 5509 6367 7552 9260 | 0353 2284 3858 5376 6605 7814 9281 |
| 0499 2003 4064 5558 6473 7602 9390 | 0424 2555 4016 5396 6689 7866 9495 |
| 0732 2010 4085 5640 6578 7630 9424 | 0469 2655 4060 5403 6731 7893 9528 |
| 0877 2056 4101 5687 6592 7772 9641 | 0685 2663 4072 5825 6822 7933 9586 |
| 0901 2086 4106 5786 6616 8116 9681 | 0827 2682 4081 5927 7214 7967 9611 |
| 0998 2138 4484 5814 6850 8155 9848 | 0987 3032 4155 5935 7223 7998 9860 |
| 1073 2651 4604 5857 6911 8507 9972 | 0998 3133 4443 6056 7234 8081 9968 |
| 1077 2812 4615 5889 7105 8549 | 1130 3306 4729 6065 7350 8159 |
| 1098 3057 4830 5927 7151 8796 | 1282 3354 4771 6116 7375 8164 |
| 1472 3223 4873 5982 7280 8816 | 1410 3385 4791 6312 7478 8187 |
| 1719 3305 4878 6099 7281 8817 | 1434 3472 4901 6323 7561 8293 |
| 1861 3310 5342 6190 7342 8901 | 1885 3628 4918 6366 7633 8510 |

THANGAM VAIRAM FORTUNE WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| DAY - THANGAM SERIES Dr No:170 | DAY - VAIRAM SERIES Dr No:29 |
| 1st Prize Rs.100000/- 523641 | 1st Prize Rs.50000/- 427387 |
| 2nd Prize Rs.7000/- 91133 | 2nd Prize Rs.7000/- 41497 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 18531 33575 46712 47001 50652 | 01340 08057 21612 24985 32964 |
| 58564 69158 73729 78131 99230 | 56381 70087 77277 88892 90714 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0437 1052 2686 5807 5866 6280 8612 | 1164 3185 4114 4364 6113 8584 8682 |
| 9035 9714 9727 | 8734 8846 9102 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0714 3462 4796 5651 5672 7960 8374 | 0115 0854 1426 2525 2633 2996 4431 |
| 9598 9649 9746 | 6668 7752 7875 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0063 1206 2843 4466 5964 7425 9005 | 0032 1732 3039 4463 5674 7525 8999 |
| 0075 1249 2873 4508 6030 7535 9066 | 0088 2087 3319 4525 5901 7766 9028 |
| 0263 1318 3025 4670 6037 7746 9086 | 0112 2114 3352 4574 5907 8097 9305 |
| 0338 1393 3086 4672 6149 7809 9234 | 0408 2146 3393 4645 6119 8205 9457 |
| 0380 1402 3106 4704 6203 8029 9370 | 0636 2169 3418 4675 6343 8211 9461 |
| 0397 1443 3277 4906 6282 8045 9580 | 0647 2204 3508 4697 6451 8400 9467 |
| 0549 1549 3526 5226 6350 8076 9658 | 0675 2357 3558 4820 6505 8416 9497 |
| 0572 1579 3849 5266 6671 8136 9872 | 0681 2363 3615 4849 6635 8489 9622 |
| 0577 1643 3889 5490 6685 8389 9956 | 0791 2557 3666 4945 6663 8512 9737 |
| 0654 1902 3918 5492 6710 8457 9972 | 0839 2628 3677 5010 6783 8631 9980 |
| 0827 1921 3921 5574 6839 8616 | 0952 2778 4004 5047 6819 8636 |
| 0856 2104 4126 5581 7040 8658 | 0986 2892 4075 5181 6847 8867 |
| 1008 2679 4267 5617 7146 8661 | 1422 2903 4135 5195 6929 8888 |
| 1029 2684 4340 5678 7165 8830 | 1446 2931 4188 5407 7132 8915 |
| 1195 2820 4439 5867 7254 8916 | 1454 2961 4245 5592 7280 8937 |

NALLANERAM MANI FORTUNE WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| DAY - NALLANERAM SERIES Dr No:170 | DAY - MANI SERIES Dr No:29 |
| 1st Prize Rs.50000/- 693886 | 1st Prize Rs.50000/- 536390 |
| 2nd Prize Rs.7000/- 63216 | 2nd Prize Rs.7000/- 34580 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 28466 34368 38666 62364 75069 | 03788 18541 39764 43884 45613 |
| 76210 76916 77766 88489 94525 | 49905 53047 63239 75233 85392 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 1498 2000 2456 3161 4140 4343 5044 | 0660 0799 0879 3172 3173 3720 6427 |
| 6553 9670 9776 | 7548 8352 9384 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0608 1015 2383 3491 4417 4811 6013 | 3526 5303 5949 6163 6713 7462 7637 |
| 6543 7560 9114 | 7665 8986 9928 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0036 1842 3610 4929 6012 7472 8432 | 0057 1332 2624 3879 5931 7561 8732 |
| 0098 1953 3683 4994 6038 7503 8594 | 0223 1438 2629 3947 6270 7569 8767 |
| 0173 1987 3764 5013 6088 7549 8901 | 0271 1527 2651 3963 6304 7641 9003 |
| 0278 2316 4056 5081 6105 7638 8903 | 0346 1621 2810 4453 6634 7870 9100 |
| 0404 2592 4147 5085 6215 7647 9133 | 0378 1659 3055 4578 6653 7900 9137 |
| 0478 2647 4315 5107 6415 7706 9291 | 0622 1779 3204 4697 6660 8066 9169 |
| 1112 2681 4600 5117 6471 7738 9379 | 0645 1860 3272 4739 6731 8067 9477 |
| 1274 2738 4607 5251 6473 7831 9518 | 0707 2049 3330 4837 6745 8116 9553 |
| 1387 3001 4659 5387 6547 7877 9567 | 0780 2077 3690 4890 6851 8296 9558 |
| 1412 3143 4691 5399 6608 7965 9709 | 0865 2082 3698 5058 6926 8403 9965 |
| 1437 3327 4697 5506 6655 8019 | 0970 2169 3732 5153 7043 8414 |
| 1447 3418 4713 5604 6665 8029 | 1040 2210 3783 5365 7085 8550 |
| 1518 3444 4750 5627 6773 8127 | 1102 2228 3791 5630 7340 8557 |
| 1676 3488 4815 5880 7260 8255 | 1141 2246 3824 5729 7448 8602 |
| 1709 3600 4835 5890 7409 8279 | 1299 2352 3871 5832 7545 8618 |

KUMARAN VISHNU STAR WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| DAY - KUMARAN SERIES Dr No:170 | DAY - VISHNU SERIES Dr No:170 |
| 1st Prize Rs.50000/- 154921 | 1st Prize Rs.50000/- 356733 |
| 2nd Prize Rs.7000/- 39169 | 2nd Prize Rs.7000/- 43954 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 06252 15631 22705 24170 25196 | 19757 28844 32656 35096 48630 |
| 37012 38294 39605 61980 80529 | 62989 73706 91512 91985 97200 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0863 1744 1931 6233 7390 7554 8367 | 2372 2613 3996 4711 6713 7224 7836 |
| 8591 8951 9891 | 8858 9236 9911 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 2735 4181 4260 4430 4462 5242 6778 | 0600 1546 2087 4007 4266 5707 8134 |
| 8331 9202 9959 | 9025 9091 9358 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0024 0788 1987 3370 4946 6240 8227 | 0023 1140 2714 4265 6284 7450 9260 |
| 0125 0854 1998 3454 5016 6254 8240 | 0118 1207 2747 4437 6328 7456 9289 |
| 0146 0856 2063 3535 5075 6362 8345 | 0209 1334 2853 4446 6559 7485 9368 |
| 0234 0893 2147 3666 5089 6656 8461 | 0433 1475 3097 4666 6577 7675 9503 |
| 0305 0910 2331 4038 5106 6771 9122 | 0464 1488 3112 4772 6636 7828 9512 |
| 0308 1055 2342 4061 5214 6882 9395 | 0536 1612 3205 4973 6645 7866 9527 |
| 0408 1163 2396 4102 5254 6967 9451 | 0583 1759 3296 5168 6676 8002 9528 |
| 0498 1198 2402 4149 5263 7076 9458 | 0640 1937 3300 5196 6729 8364 9625 |
| 0538 1522 2463 4464 5404 7307 9787 | 0682 2107 3405 5217 6871 8477 9736 |
| 0557 1587 2595 4554 5520 7319 9941 | 0844 2117 3655 5363 6953 8990 9741 |
| 0593 1712 2673 4599 5731 7859 | 0849 2229 3684 5638 7028 9001 |
| 0617 1869 2899 4623 5846 7932 | 0966 2284 3858 5775 7100 9045 |
| 0642 1932 2933 4637 6041 8166 | 1050 2442 3985 5914 7148 9092 |
| 0742 1983 3235 4844 6050 8185 | 1060 2461 4137 5981 7260 9098 |
| 0771 1986 3272 4916 6234 8212 | 1109 2472 4233 6154 7393 9246 |

SWARNALAXMI LION EMERALD WEDNESDAY
DrawDate on:18/01/23

| | |
|---|---|
| SWARNALAXMI SERIES Dr No:170 | DAY - LION SERIES Dr No:29 |
| 1st Prize Rs.50000/- 241811 | 1st Prize Rs.50000/- 638593 |
| 2nd Prize Rs.7000/- 63709 | 2nd Prize Rs.7000/- 49968 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 17923 28276 39634 41126 52346 | 16781 27306 38147 49317 51410 |
| 63398 74201 74530 85633 96802 | 62539 73534 84275 84959 95498 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 1164 1317 1789 2597 4129 5946 6175 | 0082 0961 2313 2550 3707 6711 7241 |
| 7389 9648 9656 | 7266 9472 9995 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 1402 4611 5030 5141 5363 6354 6876 | 0537 1967 2266 2731 4613 4637 5535 |
| 7932 8178 9579 | 7558 8789 9862 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0058 2189 3517 4779 6292 7696 9450 | 0079 1398 3251 4691 6541 7843 9464 |
| 0141 2233 3589 4991 6401 7743 9526 | 0525 1630 3432 4824 6567 7925 9488 |
| 0166 2315 3603 5066 6465 8068 9575 | 0527 1740 3648 4830 6672 7926 9567 |
| 0344 2331 3604 5126 6510 8202 9620 | 0531 2022 3660 4884 6687 8128 9652 |
| 0455 2543 3708 5258 6517 8304 9676 | 0605 2041 3746 4977 6729 8201 9674 |
| 0733 2663 3772 5560 6578 8371 9767 | 0607 2098 3847 5053 6761 8256 9719 |
| 0770 2784 4197 5689 6628 8376 9791 | 0686 2133 4174 5374 6799 8260 9793 |
| 0837 2790 4209 5755 6808 8600 9861 | 0695 2310 4202 5666 7124 8528 9861 |
| 0939 2901 4246 5891 6953 8602 9880 | 0977 2432 4281 5712 7189 8585 9876 |
| 1186 2944 4276 5942 7169 8692 9971 | 1028 2446 4381 5727 7197 8707 9978 |
| 1356 2975 4517 6004 7262 9077 | 1084 2712 4382 5785 7198 8919 |
| 1395 2976 4587 6045 7285 9151 | 1099 2900 4489 5833 7318 9171 |
| 1563 3261 4659 6085 7406 9218 | 1205 2910 4505 6021 7383 9236 |
| 1718 3334 4686 6196 7560 9287 | 1228 3004 4507 6028 7607 9345 |
| 1873 3434 4739 6238 7587 9442 | 1327 3190 4583 6053 7782 9370 |

# యాదాద్రీశుని దర్శించుకున్న సిఎంలు

**యాదగిరిగుట్ట, జనవరి 18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రులు, ముఖ్య నేతలు రెండు హెలికాప్టర్లలో బుధవారం యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఃలేష్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాలు హైద్రాబాద్ నుండి యాదగిరిగుట్టకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు.

**ఆలయంలో ప్రత్యేక పూజలు..**

అక్కడి నుండి శ్రీ యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి వారి ప్రధాన ఆలయానికి ముఖ్యమంత్రులు, ముఖ్య నేతలు చేరుకున్నారు. సీఎం కెసిఆర్‌కు, ముఖ్య అతిధులుగా వచ్చిన వారికి ఆలయ, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి కుంకుమ బొట్టు పెట్టి స్వాగతం పలికారు. ముఖ్య నేతలంతా ఆలయంలోకి ప్రవేశించగానే క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ధ్వజస్తంభ ప్రదక్షిణగావించారు. ఆలయ గర్భగుడిలో మూల విరాట్ స్వయంభూ శ్రీ యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ప్రధాన అర్చకులు, వేదపండితులు సంకల్పం చెప్పి సువర్ణ పుష్పాలతో ప్రత్యేక అర్చనలు, నిర్వహించారు. వారందరికీ హారతి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అర్చకులు, వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ముఖ్య అతిధులకు ఆలయ అధికారులు స్వామి వారి విగ్రహాలను అందించి శాలువాలతో సత్కరించారు.

**ఆలయ పునర్నిర్మాణం గురించి వివరించిన సీఎం కెసిఆర్..**

శ్రీ యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి వారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రులు, ముఖ్య నేతలు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన సందర్భంగా స్థల పురాణాన్ని, ప్రాశస్త్యాన్ని సీఎం వారికి తెలిపారు. గతంలో ఈ ఆలయం ఉన్న ఫోటోలను, ప్రస్తుతం పునర్నిర్మాణం జరిగిన తరువాత తీసిన ఫోటోలను ముఖ్యమంత్రి కెసిఆర్ సహచర సీఎంలు, ముఖ్య నేతలకు చూపిస్తూ ఆలయ పునర్నిర్మాణం జరిపించిన తీరును వివరించారు. గతంలో యాదగిరిగుట్టపై ఆలయం కేవలబం అర ఎకరం స్థలంలో మాత్రమే ఉండేదని, దాన్ని ఇప్పుడు నాలుగు ఎకరాల స్థలానికి విస్తరించి అభివృద్ది జరిపిన తీరును వివరించారు. సిమెంట్ లేకుండా పూర్తిగా కృష్ణశిలతో పాటు ఆలయ నిర్మాణానికి కావాల్సిన ఇతర స్టోన్స్‌ను దేశంలోని ఇతర ప్రాంతాల నుండి తెప్పించి వివిధ రాష్ట్రాల్లోని నిపుణులైన స్థపతులతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు వారికి తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూ కాంప్లెక్స్‌ను నిర్మించినట్లు, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తరువాత అద్దాల మంటపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆ తరువాత విజిటర్స్ బుక్‌లో ఆలయ గొప్పతనం గురించి అతిధులు తమ అభిప్రాయాలను నమోదు చేశారు. అనంతరం వారంతా శివాలయానికి చేరుకుని స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వారికి ఆశీర వ్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్, మాజీ ముఖ్యమంత్రి అఃలేష్‌యాదవ్‌లు ప్రశంసించారు. అనంతరం వారంతా ఆలయం నుండి ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకున్నారు. సీఎం కెసిఆర్ ఆ సూట్ నుండి కేజ్రీవాల్‌కు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయాన్ని, టెంపుల్ సిటీని చూపించారు. అంతకు ముందు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ప్రెసిడెన్షియల్ సూట్ నుండి శ్రీ యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, టెంపుల్ సిటీ, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం వారు హెలిప్యాడ్ స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్, ఎమె ల్సీ కవిత, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, సీఎం సెక్రటరీ భూపాల్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డి ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఆలయ ఈవో గీతారెడ్డి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్, ఆర్డీవో భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత యాదగిరిగుట్ట నుండి వారందరూ రెండు హెలికాప్టర్లలో ఖమ్మం బయలుదేరి వెళ్లారు. ఉదయం 11:15 గంటలకు యాదగిరిగుట్ట చేరుకుని తిరిగి 12:50 గంటలకు బయలుదేరారు. ప్రముఖుల రాక సందర్భంగా పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహించారు.




యాదాద్రి ఆలయంలో సిఎం కెసిఆర్, కేజ్రీవాల్, భగవంత్‌మాన్ తదితరులు

# కాంగ్రెస్ వార్‌రూం వ్యవహారం బాధ్యత నాదే

**● సునీల్‌కు ఎలాంటి సంబంధం లేదు: మల్లు రవి స్పష్టీకరణ ● మూడు గంటల పాటు పోలీసుల విచారణ**

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన కాంగ్రెస్ వార్ రూం వ్యవహారం కేసులో పిసిసి ఉపాధ్యక్షుడు మల్లు రవి విచారణ ముగిసింది. ఈ కేసులో ఇప్పటికే సునీల్ కనుగోలును విచారించిన సిసిఎస్ పోలీసులు బుధవారం నాడు మల్లు రవిని మూడు గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా మాదాపూ ర్‌లోని కాంగ్రెస్ పార్టీ రహస్య వార్ రూం గురించి పోలీసులు ఆయనను భిన్న కోణాల్లో విచారించారు. సునీల్ కనుగోలును విచారించిన సమయంలో వెలుగు చూసిన వివరాల ఆధారంగా సిసిఎస్ పోలీసులు మల్లు రవిని ప్రశ్నించారు. సిసిఎస్ పోలీసుల తరపున ఎసిపి ప్రసాద్ నేతృత్వంలోని బృందం విచారణలో పాల్గొని మల్లు రవిని పదుల సం



ఖ్యలో ప్రశ్నలు సంధించి వాటికి సమాధానాలు రాబట్టింది. కాగా విచారణ అనంతరం బయటకు వచ్చిన మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ వార్ రూం వ్యవహారాలకు పూర్తి బాధ్యత తన దేనని తెలిపారు. ఇదే విష యాన్ని తాను పోలీసు లకు చెప్పానని ఆయన వెల్లడిం చారు. ఈ వ్యవహారంలో సునీల్ కనుగోలుకు ఇతర సిబ్బందికి ఎలాంటి ప్రమేయం లేదని ఆయన చెప్పారు. వార్ రూంలో సునీల్‌తో పాటు ఇంకొందరు ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి వివరాలను తాను పోలీసులకు అందించానని, ఇదే సమయంలో వార్ రూం వ్యవహా రాలకు సంబంధించి పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని ఆయన వివరించారు. వార్ రూం వ్యవహారంలో భాగంగా అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని పోలీసులు చెప్పారని మల్లు రవి అన్నారు. ఇక వార్ రూం నుంచి సోషల్ మీడియాలో వెలుగు చూసిన పోస్టులను మల్లు రవి సమర్థించు కున్నారు. ఈ పోస్టింగులు ఎవరిని కించపరిచే ఉద్దేశంతో చేసినవి కావని, నిబంధనలకు, చట్టానికి లోబడి చేసి నవేని ఆయన తెలిపారు. వార్ రూం నుంచి సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులు సామాన్యులకు అర్థమయ్యే విధంగా వున్నాయని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని ఆయన అ న్నారు. ఈ పోస్టులకు తాను పూర్తి బాధ్యత వహించినట్లు పోలీసులకు చెప్పానని, సునీల్ కను గోలు కేవలం ఉద్యోగి మాత్రమేనని, ఇందులో అతనికి ఎటువంటి సంబంధం లేదని చెప్పానని రవి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వార్‌రూం నుంచి పోలీసులు విలువైన సమాచారాన్ని తీసుకు వచ్చారని, విచారణ పూర్తయిన తరువాత వీటిని తిరిగి తమకు ఇవ్వాలని కోరుతానని ఆయన అన్నారు.

కాగా మల్లు రవి విచారణ సందర్భంగా సిసిఎస్ వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరా వడంతో విచారణ పూర్త య్యే వరకు ఉత్కంఠ నెలకొంది.

## దుండిగల్ పిఎస్‌లో హాజరైన బండి సాయిభగీరథ్



దుండిగల్ పిఎస్ ఎదుట న్యాయవాది కరుణాసాగర్‌తో బండి సాయిభగీరథ్

**హైదరాబాద్ (దుండిగల్), జనవరి 18 ప్రభాత వార్త :** టెక్ మహీంద్రా యూని వర్సిటీలో సహచర విద్యార్థిపై దాడి చేసిన ఘటనలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమా రుడు బండి సాయిభగీరథ్‌పై దుండిగల్ పిఎస్‌లో కేసు నమోదైన విషయం విదితమే. బుధవారం న్యాయవాది కరుణసాగర్‌తో కలిసి సాయిభగీరథ్ పోలీసుల ఎదుట హాజరయ్యారు. అయితే ప్రాథమిక విచారణ కొనసాగుతుందని, కేసు సంబంధించిన పూర్తిఆధారాలు సేకరించి ముందుగా బాధితుడు శ్రీరామ్‌ను విచారణ చేయాల్సి ఉంటుందన్నారు. అతని స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తరువాత సాయిభగీరథ్ ఎప్పుడు విచారణకు హాజరు కావాలో సమాచారం అందిస్తామని పోలీసులు తెలిపారు. అయితే కేసు దర్యాప్తులో భాగంగా పూర్తిసహకారం అందిస్తామని, ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరవుతామని సాయి భగీరథ్ న్యాయవాది కరుణసాగర్ పేర్కొన్నారు.

## ఎంఎల్ఎల కొనుగోలు కేసు
## తదుపరి విచారణ 30కి వాయిదా
## తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన ఎంఎల్ఎలకు ఎర కే సుపై హైకోర్టులో జరుగుతున్న విచారణ ఈ నెల 30వ తేదీకి వాయిదా పడింది. ఇదే సమయంలో ఈ కే సుకు సంబంధించిన తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. గత ఏడాది అక్టోబర్ నెలలో వెలుగు చూసిన ఈ కేసు మూడు నె లలుగా రోజుకో మలుపు తిరుగుతుండడం తెలిసిందే. ఫాం హౌస్ కుట్ర కేసుగా పిలువబడుతున్న ఈ కేసును మొదట మొయినాబాద్ పోలీసులు విచారణ చేబట్టగా ఆ తరువాత ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేందుకు సిటీ పోలీసు కమిషనర్ ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సర్కారు నియమించడం విది తమే. అయితే ఈ కేసులో అరెస్టయిన రామచంద్ర భారతి, సింహ యాజులు, నందకుమార్‌లు సిట్ విచారణ తమకు సమ్మతం లేదని సిబిఐ దర్యాప్తు కావాలని హైకో ర్టులో పిటిషన్ వేశారు. ఇదే సమయంలో బిజెపి తరపున కూడా ఇటువంటి పిటిషన్ దాఖలవడంతో అన్నింటిని కలిపి విచారించిన హైకోర్టు ఎంఎల్ఎలకు ఎర కేసు వి చారణను సిబిఐ ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది. హైకో ర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర సర్కారు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. ఫాం హౌస్ కుట్ర కేసును సి బిఐ విచారిస్తే ఇందులో ఎలాంటి నిజాలు వెలుగు చూడవని, సిబిఐ పూర్తిగా కేంద్రం ఆదేశాల తో పనిచేస్తుండడంతో ఈ విచారణ జరిగినా...జరగక పోయినా ఒకటేనని సర్కారు వాదించింది. మరో వైపు ఈ కేసులో సిట్ విచారణ వద్దే వద్దని సిబిఐ విచారణ మాత్రమే కావాలని ఈ కేసులో అరెస్టయిన రామచంద్ర భారతి, సింహయా జులు, నందకుమార్‌ల తరపున వాదించిన న్యాయవాది హైకోర్టుకు విన్నవించారు. దీనిని సర్కారు తరపు న్యాయవాది దుష్యంత్ దవే ఖండించారు. ఏదైనా కేసులో నిందితులుగా వున్న వ్యక్తులు తమను అరెస్టు చేసిన పోలీసుల విచారణను కాదని వేరే సంస్థ విచారణను ఎలా కోరతానని, వారికి ఈ హక్కు వుండదని దవే వాదించారు. ఇదే అంశమై బుధవారం కూడా హై కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో లిఃత పూర్వకమైన వాదనలు వినిపించేందుకు తమకు కొంత గడువు కావాలని దవే కోరారు. దీనికి స్పందించిన హైకోర్టు ఈనెల 30వ తేదీలోపు లిఖితపూర్వకమైన వాదనలు ఇవ్వాలనిసూచించింది. దీంతో ఈ కేసులో సర్కారు పిటిషన్‌పె హైకోర్టు ఎటువంటి తీర్పు ఇవ్వనుందని జనవరి 30వ తేదీన తేలిపోనుంది.

## హాట్‌కేక్‌గా అమ్ముడుపోయిన లాండ్ పార్సెల్స్
### 9 లాండ్ పార్సెల్ విక్రయాలు ద్వారా రూ.195.24కోట్ల రెవెన్యూ

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండిఎ) ల్యాండ్ పార్సెల్ ఆన్‌లైన్ వేలం ప్రక్రియకు మంచి ఆదరణ లభించింది. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ ఎంఎస్‌టిసి బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లా పరిధిలోని తొమ్మిది లాండ్ పార్సెల్‌ను ద్వారా విక్రయాల ద్వారా రూ.195.24 కోట్ల రెవెన్యూ వచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు లాండ్ పార్సెల్ కొనుగోలుకు ఆసక్తి కనబరడం వల్ల అత్యధికంగా గజం రూ.1.11లక్షల రూపాయల ధర పలికింది.

## గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతి



**మంథని - ప్రభాతవార్త:**మంథని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విదులు నిర్వహి స్తున్న ఉపాధ్యాయురాలు తన్నీరు సునిత బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెం దింది. పాఠశాలల విధులు నిర్వహించి పాఠశాల ముగిసే సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురై పాఠశాలలోనే కుప్పకూలటంతో తోటి ఉపా ధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసేసమయంలోనే ఆసుపత్రిలో మృతి చెందింది. కాగా విధినిర్వహణలో మరో ప్రాంతం నుండి వచ్చి మంథనిలో గుండెపోటుకు గురై మరణించటం పట్ల తోటి ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఆసుపత్రికికిక వెళ్లి ఉపాధ్యాయురాలికి నివాళులు అర్పించారు. ఈ సంఘటన పట్ల పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# ముగిసిన నిజాం అంత్యక్రియలు



బుధవారం ముకర్రం జా బహదూర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వేలాది ప్రజలు, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు, నిజాం పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, తదితరులు

**హైదరాబాద్ (చార్మినార్), జనవరి 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ సంస్థానం చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ బహదూర్ మనుమడు ఆజమ్ జా దుర్రె షెహవార్ వారి దం పతులు కుమారుడు నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్ వాలాషన్ ము కర్రం జా బహదూర్ అంత్య క్రియలు బుధవారం సాయంత్రం చారిత్రక మక్కామసీదులో ఉన్న ఆసఫ్ జాహి సమాధుల వద్ద జరిగాయి. అంత్యక్రియలలో వేలాది మంది ప్రజలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జనవరి 14వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో ముకర్రం జా బహదూర్ చనిపోయారు. కాగా ముకర్రం జా బహ దూర్ పార్థిదేహం మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ప్రత్యేక విమానం ద్వారా టర్కీ నుంచి నగరానికి చేరుకుంది. ఎనిమిదివ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీ వాలాషన్ ముకర్రం జా బహదూర్‌కు పట్టాభిషేకం జరిగిన ప్రదేశంలోనే ముకర్రం జా పార్థివ దేహాన్ని చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచారు. చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచిన ముకర్రం జా బహదూర్ భౌతిక కాయానికి బుధవారం ఉదయం ఎనిమిది గంటలు నుంచి సాయంత్రం వరకు ప్రజలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చౌమహల్లా ప్యాలెస్ పరిసర ప్రాంతాలలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం చౌమహల్లా ప్యాలెస్‌ను సందరి ్శంచి ముకర్రం జా బహదూర్ పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముకర్రంజా బహదూర్ అంతిమ శవ యాత్ర చౌమహల్లా ప్యాలెస్ నుంచి మక్కామసీదు వరకు కొనసాగింది. మక్కా మసీదులో ప్రభుత్వ లాంఛానాలతో అంత్యక్రియలు జరిగాయి. మక్కా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార ్ధనలు అనంతరం మక్కామసీదు ఆవరణలో ఉన్న ఆసఫ్ జాహి సమాధులలో తన తండ్రి సమాది ప్రక్కనే ఎనిమిదివ నిజాం ముకర్రం జా బహదూర్ పార్థివ దేహాన్ని ఖననం చేశారు. కాగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంఐఎం శాసన సభ్యులు మహ్మద్ ముంతాజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి, మేరాజ్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజ్ హుస్సేన్ ఆఫెందీతో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# చలన చిత్ర నిర్మాతల మండలికి 19న ఎన్నికలు

**ఫిబ్రవరి 1 నుండి 6 వరకు నామినేషన్లు**

**ఒకరు ఒక పోస్ట్‌కు మాత్రమే పోటీ**

**నిర్మాత సురేష్‌కుమార్‌పై మూడేళ్ల సస్పెన్షన్**

**మండలి నుండి యలమంచలి రవికుమార్ శాశ్వత బహిష్కరణ**

**నిర్ణయాలు వెల్లడించిన అధ్యక్షుడు కల్యాణ్**

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలికి ఎట్టకేలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 4వ తేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల విషయమై వివాదం జరగడంతో చివరకు ఫిబ్రవరి 19వ తేదీన ఎన్నికలు జరపాలని ప్రస్తుత కార్యవర్గం నిర్ణయించింది. ఎన్నికల అధికారిగా కే దుర్గాప్రసాద్ వ్యవహరించనున్నారు. ఒకరు ఒక పోస్ట్‌కు మాత్రమే పోటీ చేయాల్సి ఉంటుంది. మండలిలో 1,200 మంది రెగ్యులర్ సభ్యులు ఉన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 6వ తేదీ వరకూ జరుగుతుంది. 13వ తేదీ వరకూ నామినేషన్లను ఉపసంహారణకు అవకాశం ఉంటుంది. 19వ తేదీన ఎన్నికలు జరిగి అదే రోజు సాయంత్రం పాలకవర్గ సమావేశం జరగనుంది. తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయాలను హైదరాబాద్ ఎఫ్ఎన్‌సిసిలో ప్రస్తుత అధ్యక్షులు సి కల్యాణ్ బుధవారం మీడియా సమావేశంలో వీటి వివరాలను వెల్లడించారు. గత కొద్ది రోజులుగా నిర్మాతల మండలిపై కొందరు బురద జల్లుతూ రకరకాలుగా మాట్లాడుతున్నారన్నారు. కొందరు నిర్మాతలు ఛాంబర్ దగ్గర టెంట్ వేసి సమస్యలపై పోరాడుతున్నట్లు ప్రకటించి లేనిపోని అపనిందలు వేశారని చెప్పారు. నిర్మాతల మండలికి ఎన్నికలు జరపడం లేదంటూ కామెంట్లు సైతం మీడియా చేశారని, వీటన్నింటి దృష్ట్యా సమావేశం అయి ఏకగ్రీవంగా ఎన్నికలు జరపాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ సంస్థపై కొందరు చేసిన కామెంట్లను సోషల్ మీడియాలో కొంత మంది ఇష్టం వచ్చినట్లు బురద జల్లుతున్నారని ఆరోపించారు. సంస్థకు ఎవరు చెడ్డ పేరు తెచ్చినా ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠిన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే నిర్మాత కె సురేష్‌కుమార్‌ను మూడేళ్లు సస్పెండ్ చేశామని, అయితే ఆయన యధావిధిగా సినిమాలు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే యలమంచి రవికుమార్‌ను బుధవారం నుండి తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి నుండి శాశ్వతంగా బహిష్కరిస్తున్నామని, ఇక మీదట మండలికి ఆయనకు ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలికి ఎన్నికలు జరగడం లేదని కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని, వాటన్నింటికీ సమాధానమే ఈ రోజు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తనకు ఎలాంటి పదవీ వ్యామోహం లేదన్నారు. అందుకే ఎన్నికల తేదీని ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయదలచుకోలేదని తేల్చిచెప్పారు. ఒకసారి ఒక పదవిలో ఉంటే మళ్లీ ఆ పదవికి పోటీ చేయనని వెల్లడించారు. కాగా మండలిలో ప్రస్తుతం 9 కోట్ల రూపాయల మేర ఫండ్ ఉందన్నారు. ఇంత పెద్ద మొత్తం సమకూరడానికి కారణం దాసరి నారాయణరావు అని చెప్పారు. తమ సంస్థకు తిరుపతిలో ఒక భవనం ఉందన్నారు. మూవీ టవర్స్‌లో 2.40 కోట్ల రూపాయల మేర పెటుబడి పెట్టినట్లు వివరించారు. ఇప్పుడు అది 10 కోట్ల రూపాయలకు చేరిందని తెలియచేశారు. ఆంధ్రాకు సినిమా పరిశ్రమ వెళుతుందని అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తమ సంస్థకు ఒరిగింది ఏమీ లేదన్నారు. గతంలో అందాల్సిన సబ్సిడీలే ఇంకా రాలేదని వెల్లడించారు.

# యాదాద్రి దేవస్థాన నిర్మాణం అమోఘం

**●యాదాద్రిని దర్శించుకున్న ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవంత్‌మాన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ● పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికిన దేవస్థాన అధికారులు, అర్చకులు ● దేవస్థాన విశిష్టతను వివరించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ● గంటన్నరకు పైగా సాగిన ముఖ్యమంత్రుల పర్యటన**



ముఖ్యమంత్రులకు వేదాశీర్వచనం అందజేస్తున్న అర్చకస్వాములు

**యాదగిరిగుట్ట, జనవరి 18, ప్రభాతవార్త :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహాస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్‌తో పాటు ఇద్దరు ఆప్ పార్టీకి చెందిన ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవంతుమాన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌లు బుధవారం శ్రీస్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఖమ్మంలో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరుగు భారీ బహిరంగ సభకు బయలుదేరుటకు ముందుగా హైద్రాబాద్ బేగంపేట విమానాశ్రయం నుండి రెండు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి కేసిఆర్, కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరై విజయన్, భాగవంత్‌మాను, అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరప్రదేశ్ మాజీముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి దొరైస్వామిరాజులు యాదాద్రికి చేరుకున్నారు. ఉదయం 11.15 నిమిషాలకు హెలిప్యాడ్ నుండి ప్రత్యేక వాహనాలలో కొండపైకి చేరుకున్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్‌తో పాటు ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంతుమాను, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్‌లు ప్రత్యేక వాహనంలో కొండపైకి చేరుకోగా మిగిలిన కేరళ ముఖ్యమంత్రి పినరై విజయన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజాలు ప్రెసిడెన్షియల్‌లోనే ఉండి దర్శనానికి రాలేదు. తూర్పు రాజగోపురం నుండి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన ముగ్గురు ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, జిల్లా స్థాయి అధికారులను ఆలయ ప్రధాన అర్చకులు నల్లంతిగల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఇతర అర్చక బృందం ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఇతర ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో మంత్రోచ్చారణల మధ్య ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో గర్భాలయంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద ఆశీర్వచనాలు చేసి ప్రత్యేక కండువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ నరసింహామూర్తి అభిషేక లడ్డూ, విశేష ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయంలోని విశేషాలను, నిర్మాణాల గురించి ముఖ్యమంత్రి కేసిఆర్ వారికి వివరించారు. పశ్చిమ రాజగోపురం నుండి ఆలయం వెలుపలికి వచ్చి ఆలయ ప్రాకారాలు, ఇతర నిర్మాణ పనులను భక్తులకు ఏర్పాటు చేసిన వసతులు, ప్రత్యేక భక్తులకు రూపొందించిన ఎస్కలేటర్ సౌకర్యం, ఆలయ విశేషాలకు ముఖ్యమంత్రి కేసిఆర్ వారికి వివరించారు. శివాలయం ప్రధానార్చకులు నరసింహమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్పటిక లింగం వద్ద ప్రత్యేక పూజలు జరిపి ఆశీర్వచనం చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. తిరిగి 12.45 నిమిషాలకు కొండ కిందకు చేరుకుని 12.50 నిమిషాలకు హెలిక్యాప్టర్‌లో ఖమ్మంలో జరిగే భారత రాష్ట్ర సమితి భారీ బహిరంగ సభకు బయలుదేరారు. ప్రముఖుల రాక సందర్భంగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు దర్శనాలను నిలిపివేయడంతో పాటు రాచకొండ సీపీ దేవేంద్రసింగ్‌చౌహాన్ ఆధ్వర్యంలో డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ కోట్ల నరసింహారెడ్డి, ఇతర ప్రత్యేక పోలీసు బృందం పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్సీ కవిత, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవో గీత, చైర్మన్ నరసింహామూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఇతర ఆలయ అధికారులు,

ఈ కార్యక్రమానికి విచ్చేసి ముఖ్య మంత్రులు, ఇతర మంత్రులకు జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేంద్రరెడ్డి, ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తూ నుదుట తిలకం దిద్ది ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ విశిష్టత నిర్మాణాలను తెలుసుకున్న అనంతరం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, భగవం తుమాన్‌లు విజిటర్ రిజిష్టర్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణం ముఖ్యమంత్రి కేసిఆర్ ఆధ్వర్యంలో ఎంతో అద్భుతంగా నిర్మించబడిందని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రుల పర్యటన 11.15 నిమిషాల నుండి 12.50 వరకు గంటన్నర సాగింది. వీఐపీల రాగ సందర్భంగా ఆలయాన్ని పచ్చని తోరణాలు పూల మాలలతో అందంగా అలకరించారు.

# గ్రూప్2 దరఖాస్తులు ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి18:** రాష్ట్రంలో 783 గ్రూప్2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా, దరఖాస్తుల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. వచ్చే నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన అభ్యర్థులు టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో తమ వన్ టైం పాస్‌వర్డ్(ఓటిఆర్) నెంబర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఇప్పటి వరకు తమ ఓటిఆర్‌ను సవరించుకోని అభ్యర్థులు, ముందుగా ఓటిఆర్‌లో సవరణలు చేసుకుని గ్రూప్2కు దరఖాస్తు చేసుకోవాలని టిఎస్‌పిఎస్‌సి సూచించింది. మొదటిసారి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఓటిఆర్ నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. చివరి నిమిషంలో ఇబ్బంది పడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. గత నెల 29వ తేదీన గ్రూప్2 నోటిఫికేషన్ ద్వారా కమిషనర్ గ్రేడ్-3, అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-2, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ కానున్నాయి. గతంలో 1032 గ్రూప్-2 పోస్టులను భర్తీ చేసిన కమిషన్. ఆ స్థాయిలో మళ్లీ ఉద్యోగ ప్రకటన ఇవ్వడం ఇదే ప్రథమం. గ్రూప్-2కు భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**5 లక్షలకు చేరువలో గ్రూప్ 4 దరఖాస్తులు**

రాష్ట్రంలో గ్రూప్ 4 ఉద్యోగాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం సాయంత్రం నాటికి 4,97,056 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు టిఎస్‌పిఎస్‌సి వెల్లడించింది. ఈ ఉద్యోగాలకు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. కొన్నేళ్ల తర్వాత గ్రూప్4 ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో నిరుద్యోగులు భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. రోజురోజుకి క్రమంగా దరఖాస్తులు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఐదు లక్షల చేరువలో దరఖాస్తులు రాగా, మొదటి రోజు ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. రెండో రోజు నుంచి దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రోజుకు సుమారు 20వేల నుంచి 30వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

## టిడిపి నుంచి వైఎస్సార్సీలోకి



వైఎస్సార్సీలోకి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వావిలాల సరళాదేవిని ఆహ్వానిస్తున్న ఎపి సిఎం జగన్

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీకి షాకిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి, మాజీ చేనేత ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ వావిలాల సరళాదేవి, ఆమె భర్త వావిలాల వెంకట రమేష్ వైఎస్సార్సీలో చేరారు. పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో కలిసి వారు సీఎం జగన్‌ను ఆయన వ్యక్తిగత కార్యా లయంలో నేడు కలుసుకున్నారు. గత నాలుగేళ్లగా జగనన్న పాలన తమను ఎంతో ప్రభావితం చేసిం దని ఈ సందర్భంగా వారు సీఎం జగన్‌కు తెలి పారు. ప్రజల్లో వర్గాలు, రాజకీయాలకు తావివ్వ కుండా అందరికి సంక్షేమాన్ని కల్పించడం తమకు స్ఫూర్తిదాయక నిలిచిందన్నారు. నాయకుల్లో జవాబుదారీతనం పెంచిన సీఎం జగన్ వ్యక్తిత్వానికి అభి వృద్ధి కాముకతకు ప్రభావితమై వైఎస్సా ఆర్సీపీలో చేరాలనుకుంటున్నట్లు వారు సిఎం జగన్ తెలిపారు.

## వకుళమాత గుడిలో చోరీయత్నం

**తిరుపతి, జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి తల్లి వకుళమాత కొలువైన తిరుపతి రూరల్ పేరూరుబండపై ఉన్న ఆలయంలో చోరీ యత్నం జరిగింది. దుండగుడు ఆలయం వెనుకవైపు నుంచి ప్రవేశించి గడ్డపారతో తాళాలు పగలగొట్టాడని, హుండీలో నగదు చోరీ చేశాడు. ఈనగదు మొత్తం మూటగట్టి పరార య్యేందుకు ప్రయత్నించిన సమయంలో దుండ గుడుభయపడి నగదు మూటను ఆలయప్రాంగణం లోనే వదలిపెట్టి పరారయ్యాడు. ఇదీ సిసి కెమెరా ఫుటేజీల్లో నమోదైన విషయం. ఇంతకీ ఏకంగా వకుళమాత ఆలయంలోనే చోరీకిఎంతమంది ప్రయ త్నించారనేది కూడా ఇప్పుడు అటు పోలీసువర్గాల్లో ఇటు టిటిడి భద్రత వర్గాల్లో సంచలనంగా మారింది. గత కొద్దిరోజులుగా తిరుపతి పోలీసు జిల్లా పరిధిలో నగర శివార్లలో వరుసగా ఇళ్ళ దొంగతనాలు, ఆలయాలహుండీలు చోరీలు జరుగు తున్నాయి.

తాజాగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఏకంగా వకుళమాత ఆలయం లోనే హుండీ చోరీ జరగడంతో తిరుపతి వాసులను భయాందోళనకు గురిచేస్తోంది.

## వెంకన్న ఆలయం వెనుకభాగాన క్రేన్ ఏర్పాటుపై విమర్శలు

**తిరుమల, జనవరి 18ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న లక్షమందివరకు భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి చేరే నగదు, బంగారం, వెండి ఆభరణాలను పరకామణికి తరలించేందుకు కొద్దిరోజుల క్రిందట ఏర్పాటుచేసిన భారీ క్రేన్ వైఖానస ఆగమోక్తం ఆమోదిస్తోందా?అనే ప్రశ్నలు వెంకన్న భక్తుల్లో మొదలైంది. ఆలయానికి పడమరవైపు ఈ క్రేన్‌ను ఏర్పాటుచేసి ఆలయంలోపల నుంచి పరకామణి సంచులను, గంగాళాలను (హుండీలను) అన్న ప్రసాదం భవనం వద్ద ఉన్న నూతన పరకామణి భవనం వద్దకు చేర్చేందుకు చూస్తున్నారు.

వార్త

మానవుని మనసు ఒక ఊటబావి. నిత్యనూతనంగా ఉండగల అంతర్‌శక్తి దానికొక్కదానికే ఉంది.

-జిడ్డు కృష్ణమూర్తి

# మాటల్లోనే అవినీతి నిర్మూలన!

ధర్మాధర్మాలు తెలియవని కాదు. మొదటిది ఒంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్టుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ రకంగా చూసినా అవినీతికి పాల్పడడం నేరం, తప్పు. ధర్మంకాదని అందరికి తెలిసిందే. కానీ అవినీతికి పాల్పడేవారు దేశంలో కోట్లసంఖ్యలో ఉన్నారు. అంత కంతకు పెరుగుతున్నారు. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నామని పాలకులు ఎంతగా చెప్పుకుంటున్నా అది అంతకంతకు పెరుగుతున్నదే తప్ప ఏమాత్రం తగ్గడంలేదు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగా నిధులు వెచ్చించే కొద్దీ అంతకు రెట్టింపు స్థాయిలో అవినీతి పెరిగిపోతూనే ఉంటుంది. అవినీతికి, అభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంది. అభివృద్ధి ముందుకు తీసుకువెళ్తుంటే అవినీతి వెనక్కు గుంజుతూ ఉంటుంది. కానీ ఎక్కడ అభివృద్ధి ఉంటుందో అక్కడే అవినీతి ఏదో ఒక రూపంలో ఉంటుంది. దేశంలో అవినీతిని పారద్రోలేందుకు అటు దేశ ప్రధాని నరేంద్రమోడీతోసహా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు యుద్ధమే ప్రకటించారు. అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అవినీతిని నిర్మూలించే విషయంలో రాజీలేని పోరాటంచేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. ఇప్పుడే కాదు ఏనాటి నుంచో అవినీతి నిర్మూలన విషయంలో గతపాలకులు కూడా ఇలాంటి ప్రకటనలు ఎన్నో చేశారు. అవినీతి అధికారులను వదిలిపెట్టం, అవినీతికి పాల్పడేవారు ఎంతటివారైనా కఠిన శిక్షల నుంచి తప్పించుకోలేరని, అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడమే తమ ధ్యేయమని ఎన్నిరకాల అభినయాలతో చెప్పొచ్చో అన్నిరకాలుగా పాలకులు విన్యాసాలు చేస్తూనే ఉన్నారు. వీరెంత అరచి కేకలు పెడుతున్నా, ఎంత మందిని పట్టుకొని శిక్షలు వేయిస్తున్నా రెట్టింపు స్థాయిలో అవినీతి రాక్షసి విస్తరిస్తున్నది. ఇందుగలడు, అందులేడని సందేహం వలదు చక్రి సర్వోపగతుండు ఎందెందు వెతికి చూసినా అందందే గలడు అన్నట్లు సర్వాంతరయామిగా విస్తరించింది. గతంలో లేదని కాదు. ఇప్పుడు అది శృతిమించుతున్నది. దేనికైనా హద్దూపద్దు ఉండాలి. దారులుకొట్టి బతికే బందిపోట్లు సైతం దోపిడీకి, దోపిడీకి కొంత వ్యవధి ఇస్తారు. కానీ ఈ అవినీతి అధికారులు ఆ వ్యవధి కూడా ఇవ్వడం లేదు. ఒక్కొక్కరి దగ్గర ఆదాయానికి మించి కోట్లాది రూపాయల ఆదాయాన్ని కనుగొంటున్నారు. ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిరు ఉద్యోగి దగ్గర వందల కోట్లఆదాయానికి మించిన ఆస్తులు బయటపడడం అప్పట్లో విస్మయం కలిగించింది. దేశంలో రోజూ ఈ అవినీతి అధికారులు పట్టుబడుతూనేఉన్నారు. కేసులు పెట్టి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. ఇవన్నీ పత్రికల్లో, టీవీల్లో ప్రసారం అవుతున్నాయి. ఇంతపెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నా, అవినీతిపరులుగా ప్రచారం అవుతున్నా, పాలకపెద్దలు కఠినచర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నా, ఈ అవినీతిపరుల్లో జంకుబొంకు లేకుండాపోతున్నది. ఎసిబి దాడులన్నా, సిబిఐ దాడులన్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. గతంలో ఈ అధికారులు అంటే అంతోఇంతో భయభక్తులు ఉండేవి. సిబిఐ, ఎసిబి దాడుల్లో పట్టుబడి జైలుకు వెళ్లివస్తే సమాజంలో విలువ ఉండదనే జంకుబిడియం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారి పోయింది. అలా జైలుకు వెళ్లి వచ్చినవారిని దండ లేసి ఊరేగింపుగా తీసుకుపోతున్నారు. దీనికితోడు అవినీతిపరులకు వత్తాసుపలికే రాజకీయ నాయకులు ఎక్కువైపోయారు. వీరికి కొందరు రక్షణగా నిలబడుతున్నారు. పట్టుబడ్డ కేసుల్లో అధికశాతం న్యాయస్థానాల్లో రుజువు కాక, శిక్షలనుంచి తప్పించుకొని నిర్దోషులుగా బయటపడుతున్నారు. అసలు కేసుల వెనుకఏం జరుగుతున్నది? తదితర విషయాలు పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన సంఘటనలు బయటకు వస్తాయి. ఎసిబికి చిక్కిన కేసులు అర్థాంతరంగా ముగిసిపోవడమేకాదు, పట్టుబడినవారు దర్జాగా ప్రమోషన్లు పొందగలుగుతున్నారు. ప్రభుత్వ నిఘాలు కానీ, చట్టాలు కానీ ఏమీ చేయలేకపోతున్నాయనేది రాజకీయ అండదండలు ఉన్నవారి విషయంలో ఎన్నోసార్లు రుజువు అయింది. రాజకీయాలతో ముడిపడి ఉన్న అవినీతిని నిర్మూలించలేకపోతే పోయారు. నిత్యం ప్రజలను వేధిస్తున్న అవినీతి విషయంలోనైనా పాలకులు శ్రద్ధ తీసుకోవాలి. ఈ అవినీతి రకరకాలుగా ఉంటుంది. అందులో ఒకరకం మూడోనేత్రానికి కన్పించే అవకాశాలు ఉండవు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణాలు, గత, ప్రస్తుత స్థితిగతులను బట్టి ఎవరికివారు ఊహాజనితమైన నిర్ణయాలకు రావాలి. అంతేకాని ఫొటోలతోనో, ప్రత్యక్ష సాక్షులతోనో రుజువు చేయడం సాధ్యమయ్యే పనికాదు. ముడుపులు తాము ఇచ్చినట్లు ఇచ్చినవారు చెప్పరు. అలాగే తీసుకున్నవారు తాము తీసుకున్నట్లు చెప్పరు. ఎవరైనా ఆరోపించినా ఇద్దరూ కలిసి ఖండిస్తారు. ఈ అవినీతిని అరికట్టడానికి కొంత కష్టపడాల్సి వస్తున్నది. కానీ మరొక అవినీతి బాహాటంగా ప్రజలముందు విశ్వరూపం ధరించి నాట్యం చేస్తున్నది. ఇదే ఏప్రభుత్వాన్ని అయినా అప్రతిష్టపాలు చేసేది. ఏశాఖలో ఏమేరకు అవినీతి జరుగుతున్నదో తెలుసుకోవడం పెద్దకష్టం కాకపోవచ్చు. ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటుంటారు. దీనికి పెద్దగా లోతైన దర్యాప్తు కూడా అంతగా అవసరం ఉండదు. ఏదిఏమైనా వేలాది కోట్ల రూపాయలు వడ్డీకి అప్పులు తెచ్చుకొని సంక్షేమ పథకాలకు, నిర్మాణాత్మక కార్యక్రమాలకు వెచ్చిస్తున్న నిధులను అవినీతిపరులపాలు చేయడం ఏమాత్రం సమంజసం కాదు. గతంలో పాలించిన కొందరు నేతలు ఇలా తీవ్ర అప్రతిష్టపాలైన విషయం తెలుగు రాష్ట్రాల్లో కథలుకథలుగా చెప్పుకుంటారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఏనాటికైనా పాలకులు వారి చెంతన చేరిపోతారు.

> తోటి మానవులను అసహ్యించుకోవడం కన్నా, వారి యెడల నిరాదరణ చూపడమే ఘోరపాపం. అమానుషత్వానికి అర్థం అదే.




జార్జి బెర్నార్డ్ షా

> మానవ జీవితంలో ఏదీ స్థిరమైనది కాదు. కనుక సంపద వచ్చినప్పుడు పొంగిపోవడం, బాధలలో క్రుంగిపోవడం తగదు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## ఆర్థిక అంతరాలు ప్రగతి నిరోధకాలు

తాజాగా విడుదలైన ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ నివేదిక లెక్కలు భారత్‌లో పెరుగుతున్న ఆర్థికఅసమానతల్ని పట్టి చూపిస్తున్నాయి. ఆ నివేదికప్రకారం ఒక్క శాతం సంపన్నుల చేతిలో నలభై శాతం దేశసంపద కేంద్రీకృతమై ఉండగా, యాభైశాతం ప్రజలు మూడుశాతం సంపదతో సరిపెట్టుకుంటున్నారు. కరోనా సంక్షోభ సమయంలో బిలియనీర్లఆదాయం 121శాతం పెరగగా, అధిక జనాభాఆదాయంలో 13శాతం వృద్ధిమాత్రమే కనబడింది. పేదరికంలోకి కొత్తగాకోట్లాది మంది జారిపోయారు. సంపన్నులకు ఇచ్చే పన్నురాయితీవల్ల లక్షల కోట్లు రావాల్సిన ఆదాయాన్ని భారత్ వదులుకుంది. అదే సమయంలో జిఎస్టీ పన్ను ద్వారా వచ్చిన ఆదాయంలో 66శాతం అధిక జనాభా జేబుల్లోంచి వచ్చింది. సంపన్నుల వాటా అందులో కేవలం మూడు శాతం. ఎన్ని రకాలుగా కూడికలు, తీసివేతలు చేసి ఏరకంగా తేల్చిచెప్పినా వాటి సందేశం ఒక్కటే. ఆర్థిక అంతరాలు పెరుగుతూ వస్తున్నాయి తప్పతరగడంలేదు. ప్రభుత్వ విధానాలు అందుకుసహకరిస్తున్నాయి తప్ప దిద్దుబాటు దిశగా లేవు.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

## డి. ఏ ప్రకటించాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం ప్రకటించాలి. రాష్ట్రంలో పెరుగుతూ ఉన్న ధరలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరవుభత్యం మంజూరుచేయాలి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. పెరిగిన ధరలతోయేది కొనాలన్నా ఇబ్బందిగా మారింది. కేంద్రప్రభుత్వం ఇప్పటికే డి.ఏలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మంజూరు చేసింది. జూన్ 2021 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకి మూడు డి.యేలు రావాలి. తక్షణమే పెండింగులో ఉన్న డి.ఏను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకి, ఉపాధ్యాయులకు మంజూరుచేస్తారని లక్షలాది మందివేయికళ్లతో ఎదురుచూస్తూఉన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా డి.ఏ ఇస్తారని భావించారు. కానీ ఇవ్వలేదు. ప్రభుత్వం డి.ఏ పెంపు మీద తక్షణం నిర్ణయం తీసుకోవాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్, భూపాలపల్లిజిల్లా

## విద్యార్థుల విహారయాత్రలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విజ్ఞాన అభివృద్ధికి చారిత్రాత్మకమైన ప్రదేశాలను చూడడానికిగానురాష్ట్ర పర్యాటకఅభివృద్ధిశాఖ విద్యాశాఖఆధ్వర్యంలో ప్రయాణ రవాణా సౌకర్యాలలోబస్సులు, రైళ్లు, ఇతరవాహనాలలో ప్రయాణించడానికి అవకాశం కల్పించాలి. విద్యాశాఖ ఆధ్వర్యంలో విహారయాత్రల కార్యక్రమం నిర్వహించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

## పెన్షన్ కోత సరికాదు

సామాజిక పెన్షన్లలోపెద్దఎత్తున కోతపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందన్న వార్తలు పింఛనుదారుల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. ప్రస్తుతం రెవెన్యూఅధికారుల నుండి అనర్హతా నోటీసులు అందుకున్న వారిలో అత్యధికులు పోషణ కోసం ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడినవారే. ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్నకొద్దిపాటి మొత్తంతో వారిజీవనమంతా సాగిపోదు. కానీ వేన్నీళ్లకుచన్నీళ్లలా కొంతమేర ఊరట కలిగిస్తుంది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దానికి అనుగుణంగా లేవు. అనర్హతా నోటీసులు అందుకుంటున్నవారిలో అత్యధికులు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, వృద్ధకళాకారులు. తప్పుల తడికలుగా చేసిన అనేక సర్వేలే తాజా అనర్హుల జాబితాకు ఆధారమని పలు ఆరోపణలు వినవస్తున్నాయి. అదే నిజమైతే సామాజిక పెన్షన్లు ఇవ్వడంలోని అసలు లక్ష్యమే దెబ్బతింటుంది. ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం జిల్లా

## ధర్మాన గారికి ధర్మం కాదు!

విశాఖ రాజధాని కాకుంటే ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతానంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రేలాపనలు సరికాదు. ఈ డిమాండ్ అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడే చేస్తే వారివాదనకు కొంతైనా బలంఉండేది. ఇప్పుడు విశాఖ వాసులు విశాఖ నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించమని డిమాండ్ చేస్తే ధర్మాన ఎవరి మీద పోరాడుతారు? ధర్మాన వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం, విశాఖఉక్కు కర్మాగారంపై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి. సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన ధర్మాన శ్రీకాకుళానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారు.

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

## కూరలో కరివేపాకు?

అనంతపురం జిల్లాలో ఒక బి.సిమంత్రి పదవి పోయినందుకు అధికార పార్టీలో ఒక అగ్రవర్ణ సామాజిక వర్గం వారు విందు భోజనాలు ఏర్పాటు చేసుకోవడం అధికార పార్టీలో బి.సిలపరిస్థితికి అద్దం పడుతున్నది. బి.సి.లను ఉద్ధరిస్తున్నామంటూ బి.సికులాలవారికి పలుకార్పొరేషన్లు ఏర్పాటు చేసి పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేశారు. బి.సిలను కూరలో కరివేపాకులా చూడడం దుర్మార్గం. పాలకుల మోసపూరిత విధానాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని తగిన సమయంలో గుణపాఠం చెప్పాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# పేదలకూ నాణ్యమైన విద్య అందించాలి

**దేశం సుస్థిరాభివృద్ధి లక్ష్యంతో సమ్మిళిత వృద్ధివైపు పయనించాలంటే మానవ వనరుల నాణ్యత, నైపుణ్యాలను పెంచే విద్యపైన ప్రభుత్వాలు తమఆదాయంలో 10శాతం నిధులను ఖర్చుచేయాలి. దేశంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలబెట్టడానికి పిఎంశ్రీ లాంటి పథకాలను 14,500 పాఠశాలలకే పరిమితం చేయకుండా దేశంలోని 15లక్షల ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి దేశంలోని విద్యావ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి.**



డాక్టర్ తిరునహరి శేషు

బ్రిటన్ ఒకనాడు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంగా మారటానికి పారిశ్రామిక విప్లవం శక్తినిచ్చింది. కానీ పారిశ్రామిక విప్లవం ఆ దేశంలో రావటానికి కొత్త ఆవిష్కరణలే కారణం. ఆ ఆవిష్కరణలకు ప్రధాన కారణం విద్యనే. అంటే విద్యావ్యవస్థ, విద్యా ప్రమాణాలు ఒక దేశం దశ, దిశను మార్చేస్థాయి అనటంలో సందేహం లేదు. విద్య ద్వారా లభించిన నైపుణ్యం సాంకేతికత ఆవిష్కరణలు ఉపయోగించుకున్న దేశాలు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక స్థాయి అభివృద్ధిని సాధించాయి. ఒక దేశాన్ని నాశనం చేయడానికి ఆ దేశంపై అణుబాంబులు వేయనవసరం లేదు. ఆ దేశంలో ఉన్న విద్యావ్యవస్థను విద్యాప్రమాణాలను నాశనం చేస్తే సరిపోతుంది అని దక్షిణాఫ్రికాలోని విశ్వవిద్యాలయం గోడలపై రాసి ఉంటుందంటే ఒక దేశం గమనాన్ని మార్చటంలో విద్యకు ఏస్థాయి ప్రాధాన్యత ఉంటుందో అర్థమవుతుంది. 200 సంవత్సరాల బ్రిటిష్‌పాలనా చెరనుండి బయటపడే నాటికి భారతదేశంలో అక్షరాస్యతా శాతం కేవలం 18శాతమే. అంతేకాదు విద్యాప్రమాణాలు పాఠశాలలు, ఆ పాఠశాలలో కల్పించే సౌకర్యాలు కూడా అధమ స్థాయిలోనే ఉండేవి. బ్రిటిష్ భారతదేశంలో అనుసరించిన లార్డ్ మెకాలే విద్యావిధానం వలన భారతదేశంలో విద్య మానవ వనరులను అభివృద్ధిపరిచే విధంగా లేదు. ఈ విద్యా విధానం గుమస్తాలను తయారు చేయడమే కాదు, పట్టభద్రతను కల్పిస్తుంది కానీ పొట్ట భద్రత కల్పించలేదు అని నోబెల్ బహుమతి గ్రహీత గున్నార్ మిర్డాల్ అభిప్రాయపడ్డారు. కాబట్టి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యావ్యవస్థలో మార్పుల కోసం, ప్రమాణాల మెరుగుదల కోసం 1964లో కొఠారికమిషన్ ఏర్పాటు, 1986లో జాతీయ విద్యావిధానం2009లో విద్యాహక్కు చట్టాన్ని రూపొందించినా కానీ భారతదేశ విద్యావ్యవస్థలో ఆశించిన మౌలిక మార్పులు పెద్దగా రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొఠారీ కమిషన్ చెప్పినట్లు భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల లోనే నిర్మాణం అవుతుంది కాబట్టి దేశ జిడిపిలో ఆరు శాతం విద్యపైనే ఖర్చు చేయాలనే సిఫారసులను ఏ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లనే దేశవ్యాప్తంగా విద్యాప్రమాణాలు పెరగలేదు. ప్రభుత్వ పాఠశాలలు విద్యాసంస్థల స్థితిగతులు మారలేదనేది వాస్తవం. భారత ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం 2020లో విద్యార్థుల నైపుణ్యాలను, వృత్తి విద్యానైపుణ్యాలను పెంచడానికి సాంకేతిక విద్యావిధానానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాల స్థితిగతులను మార్చడానికి ఉపాధి మార్గాలకు పాఠశాల స్థాయిలోనే పునాదులు వేయడానికి విద్యార్థుల ప్రతిభకు మరింతపదును పెట్టేలా మౌలిక వసతులను కల్పించి, సాంకేతిక సొబగులతో ప్రభుత్వపాఠశాలలో సౌకర్యాలను, విద్యాప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో భారతప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎంశ్రీ) అనే పథకాన్ని ప్రవేశపెడుతుంది. ఈ పథకం కింద 27,360 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ 14597 ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక మౌలిక వసతులను కల్పించాలని నిర్ణయించారు. ఈ పథకం కింద ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలలో పక్కాభవనాలు, సౌచాలయాల (మరుగుదొడ్ల)నిర్మాణం, డిజిటల్ బోర్డులు, సౌర విద్యుత్, తాగునీరు అంతర్జాల సదుపాయం, డిజిటల్ గ్రంథాలయాలు, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, ల్యాబ్ నైపుణ్యాల వృద్ధికి, వృత్తి విద్యాకోర్సులు, ఆరోగ్యం, మొదలైన సౌకర్యాలు కల్పించబడతాయి. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయుల సంఖ్యాబోధనా



విధానం, పదవ తరగతిలో వస్తున్న గ్రేడులు, ఇతర క్లాసులలో విద్యార్థులకు వస్తున్నమార్కులు, తరగతి గదుల దుస్థితి, పాఠశాలలోని మౌలిక వసతులను డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్‌లో నమోదు చేస్తారు. దీని ఆధారంగానే పిఎంశ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన పాఠశాలలకు మూడు సంవత్సరాల కాలంలో 46 లక్షల రూపాయల నిధులను సమకూరుస్తారు. ఈ పథకం కింద అయ్యే ఖర్చుని కేంద్ర రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. ఈ పథకం ద్వారా గ్రామ స్థాయి విద్యార్థులకు, జాతీయ స్థాయి విద్య ప్రమాణాలు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చి ఈ పథకంద్వారా మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయాలనేది ప్రభుత్వ ఆశయంగా కనిపిస్తుంది. విద్యలో ముఖ్యంగా ప్రాథమిక విద్యలో సమూలమైన మార్పులు తీసుకువచ్చే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిన బాధ్యత కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకే ఎక్కువ ఉంది. ప్రాథమిక విద్య ప్రధానమైన విద్య. అది విద్యార్థుల జీవితాలలో బలమైన పునాది వేస్తుంది. ఉపాధ్యాయుల కొరత, మౌలిక సౌకర్యాల లేమి, నాణ్యతా ప్రమాణాలు, జవాబుదారీతనం లేకపోవడం వలన వివిధరాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సరైన విద్య అందడం లేదనేది వాస్తవం. ప్రభుత్వపాఠశాలలో విద్యాప్రమాణాలను పెంచి నాణ్యమైన విద్యను అందించడానికి మౌలికవసతుల కల్పనకు ఢిల్లీ ప్రభుత్వం సర్వోదయ పాఠశాలలను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు- మనబడి లాంటి కార్యక్రమాలను ప్రారంభించింది. ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలతో ప్రభుత్వపాఠశాలలో మౌలిక వసతుల కల్పన వలన ఎన్రోల్‌మెంట్ పెరిగింది అనే విషయాన్ని గమనించాలి. తెలంగాణలో మాత్రం మనఊరు-మనబడి కార్యక్రమానికి 2022-23 బడ్జెట్‌లో 7289 కోట్ల రూపాయలను కేటాయించి మొదటిదశలో 9123 పాఠశాలలో 12 రకాలైన మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంపెట్టుకున్నా లక్ష్యసాధనలో ప్రభుత్వం వెనుకబడిపోయింది. పిఎంశ్రీ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని 1200పాఠశాలలను ఎంపికచేయాలని అధికారులు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినారు. దేశవ్యాప్తంగా ఉన్న 15 లక్షల పాఠశాలలోని 26 కోట్ల మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలనుపరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేస్తూ రెండు ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థికవేత్త రాజ్‌కృష్ణ మందకొడి వృద్ధిరేటుని అధిగమించి ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ నుండి మూడవఅతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారవచ్చునని, గతిశక్తి ప్రణాళికతో బలమైన మౌలికవసతుల కల్పన జరగవచ్చునని, ఆరోగ్యమైత్రితో విశ్వగురుస్థాయికి భారతదేశం ఎదగవచ్చునని, కానీ మానవ వనరుల నాణ్యత, నైపుణ్యం పెరగకపోతే సాధించిన అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ భారతదేశం మానవ అభివృద్ధి సూచికలో 132వస్థానంలోనే ఉన్నది అనేవిషయాన్ని గమనించాలి. కాబట్టి దేశంసుస్థిరాభివృద్ధి లక్ష్యంతో సమ్మిళిత వృద్ధివైపు పయనించాలంటే మానవ వనరులనాణ్యత, నైపుణ్యాలను పెంచే విద్యపైన ప్రభుత్వాలు తమఆదాయంలో 10శాతం నిధులను ఖర్చుచేయాలి. దేశంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలబెట్టడానికి పిఎంశ్రీ లాంటి పథకాలను 14,500 పాఠశాలలకే పరిమితం చేయకుండా దేశంలోని 15లక్షల ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి దేశంలోని విద్యావ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. ●

# ప్రజాభ్యున్నతిని మరచిపోతున్న పార్టీలు!

దండంరాజు రాంచందర్‌రాజు

నేడు మనదేశంలో రాజకీయాలు ఒక భ్రష్టుపట్టిన విధంగా వ్యవస్థను అసహ్యించుకునే విధంగా ఉన్నాయి. ఇటువంటి రాజకీయ నాయకులు మన పాలకులా అని విస్మయం కలుగుతున్నది. ప్రతి రాజకీయ నాయకుడు తనకు తానే అపర మేధావినని తనకు మించిన వ్యక్తి ప్రపంచంలో లేనే లేడని భ్రమిస్తూ ఊహాలోకంలో తెలియాడుతూ ఉంటున్నారు. ప్రజలు నవ్వుతున్నారన్న ఇంగితజ్ఞానం కూడా ఈ నాయకులలో కనపడడం లేదు. ముఖ్యంగా కొందరు నాయకులు అయితే తమకు తామే దైవాంశ సంభూతులుగా ప్రపంచంలో ఎప్పుడో కనిపెట్టిన వస్తువులను కూడా తాము చెప్తేనే కనిపెట్టినట్టు ప్రజలను మభ్యపెడుతున్నారు. ఇంతేకాక సాఫ్ట్‌వేర్, సెల్‌ఫోన్స్ ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక సాంకేతిక, ఔషధాలు కూడా సృష్టించింది తామే అని, ఆ సంస్థల అధిపతులను తామే సృష్టించామని ప్రజలకు సందేశం ఇస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సృష్టికే సృష్టికర్తగా భావిస్తున్నారు. రాజకీయాలకు అర్థాలు, పరమార్థాలు, నియమాలు, విలువలు నిబంధనలు ఎప్పుడో మటుమాయమైపోతున్నాయి. రాజకీయ వ్యవస్థ ప్రతిపక్షాలను ఎదగకుండా తామే దైవాంశ సంభూతులుగా రాజకీయం చేయడం ప్రధాన వైఖరిగా మారుతున్నది. అధికారంలో ఉన్నవారు, విపక్షం, స్వపక్షం వారూ వీరు అనే తేడా చూడడం లేదు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధిక ధన సంపాదన కోసం, ప్రజల్లో పార్టీలు పలుకుబడి పెంచుకునేందుకు రాజకీయాలను రాజకీయం చేసే పనిలోనే నాయకులు వ్యూహ, ప్రతివ్యూహాలు చేస్తూనే ఉన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడం అధికార పార్టీ బాధ్యత. అధికార పార్టీ ఎప్పటికప్పుడు అప్రమత్తతో పనిచేస్తుందా! ప్రజలకు మేలు చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటుందా! చూసుకుంటూ, సమర్థవంతంగా అప్రమత్తతో వ్యవహరిస్తూ ప్రభుత్వంలోని లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపిస్తూ, ప్రజలకు మేలు జరిగే విధంగా చేయాలి. కానీ ఇప్పుడున్న రాజకీయపార్టీలు వ్యవహరిస్తున్న తీరు అనేక విమర్శలకు తావిస్తోంది. కేవలం అధికార పార్టీకి గొప్పతనం దక్కకుండా చేసేందుకు, విపక్షాలు ప్రయత్నం




చేస్తున్నాయి. ప్రతిపక్షానికి ప్రజల్లో బలం పెంచుకోకుండా అష్ట దిగ్బంధనం చేస్తూ బలహీనం గావిస్తూ అసలు నామరూపాలు లేకుండానే అణగదొక్కేందుకు అధికార పార్టీ ప్రయత్నించడం నేడు మనదేశంలో జరుగుతున్న తంతు. ఈ విషయంలో ఒకరిది తప్పు, మరొకరిది ఒప్పు అని చెప్పేందుకు అవకాశం లేకుండా ప్రస్తుత రాజకీయ పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు మొదలగు చర్యలకు పూనుకుంటారు. ఇది ప్రజల కోసమని, ప్రతిపక్షాల గొంతు నొక్కవద్దని ఘంటాపదంగా నొక్కి వక్కాణిస్తారు. అదే తాము అధికారంలోకి రాగానే ధర్నాలు చేయనివ్వరు రాస్తారోకోలు చేసేవారిని ఎక్కడికక్కడ పోలీసులతో అణచివేస్తున్నారు. ధర్నా చౌక్ లే లేకుండా చేస్తున్నారు. ప్రతిపక్షాల సభలకు అనుమతి కూడా ఇవ్వడం లేదు. ప్రతిసారి హైకోర్టు ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు సభ నిర్వహణ కోసం అనుమతి తెచ్చుకొని నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీ గతంలో అధికారంలో ఉండగా చేసిన తప్పులను ఎత్తిచూపుతూ, వాటిపై విచారణ చేస్తూ, ఆ పార్టీలోని కీలక నాయకులను అరెస్టు చేయిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ ఆ పార్టీలో ఉన్నవారు, తమ పార్టీలో చేరే విధంగా చేస్తూ అధికార పార్టీ తమ ప్రతాపం చూపిస్తుంటే అధికార పార్టీ ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ, ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేస్తున్నా, చిన్న లోపాలను సైతం ఎత్తిచూపుతూ, అవినీతి ఆరోపణలు చేస్తూ, అభివృద్ధిని అడ్డుకుంటూ, కోర్టుల్లో కేసులువేస్తూ, ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునేందుకే సమయం కేటాయిస్తున్నారు తప్ప అసలు తాము రాజకీయాల్లోకి ఎందుకు వచ్చాం, ప్రజాభ్యున్నతికి ఏమైనా మంచి పనులు చేస్తున్నామా అనే విషయాలను ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవడం లేదు. రాజకీయాలంటే డబ్బు సంపాదించుకోవడం కోసం, పలుకుబడి పెంచుకోవడం కోసం అన్నట్టుగా నాయకుల వ్యవహారశైలి తయారైనది. ఇది దేశవ్యాప్తంగా విషపు కోరలుగా విస్తరించి ఉన్నది. అన్ని పార్టీల వ్యవహారశైలి ఇదేరకంగా ఉంటున్నది. పైకి మాత్రం తాము ప్రజల కోసమే కష్టపడిపోతున్నాం అన్నట్టుగా నాయకులు వ్యవహరిస్తున్నారు. కేవలం కొద్దిమంది మాత్రమే చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టుగా కనిపిస్తున్నారు తప్ప మెజారిటీ నాయకుల వ్యవహారశైలి మాత్రం విమర్శల పాలయ్యే విధంగానే ఉంటూ వస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాల్లో మార్పు వస్తుందని ఆశించడం ఎండమావిగా, కలగానే మిగిలిపోతున్నది. ●

# గవర్నర్ వ్యవస్థ అవసరమా?

జె.జె.సి.సి. బాబూరావు

స్వాతంత్ర్య భారతదేశంలో నాటి నుండి నేటి దాకా కొన్ని రాష్ట్రాల్లోని గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకుండా తమ ఇష్టారాజ్యంగా, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనాలు సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఒక రకంగా సమాంతర ప్రభుత్వాలని నడిపిస్తున్నారు. ఆ విధంగా వ్యవహరించే వారి ఆధిపత్య ధోరణులు ఏమాత్రం సహేతుకం కావు. ఇలాంటి సంకుచిత పరిస్థితుల్లో గవర్నర్ల విధి విధానాలపై అడపాదడపా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ నుండి ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎస్.రవి సభ నుండి అర్థాంతరంగా నిష్క్రమించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చగా మిగిలింది. ముఖ్యంగా గత కొంతకాలంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్, గవర్నర్ రవికి మధ్య గత కొంతకాలం నుండి పొసగడం లేదు. ప్రభుత్వం పంపిన దాదాపు 20 బిల్లులను గవర్నర్ తొక్కిపెట్టారని ప్రచారంలో ఉంది. ఈ క్రమంలోనే తమిళనాడులో గవర్నర్, ప్రభుత్వాల మధ్యఘర్షణలు మరింతగా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కొత్త సంవత్సరంలో జరిగే తమిళనాడు శాసన సభ తొలి సమావేశాలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీగా జరుగుతుంది. శాసనసభా సమావేశాల తొలిరోజు జనవరి 9 నాడు గవర్నర్ రవి ప్రవర్తించిన తీరు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. అసెంబ్లీలో 48 పేజీల ఆంగ్ల ప్రసంగాన్ని చదివిన గవర్నర్ 'తమిళనాడు' 'ద్రావిడ' అనే పదాలకు ప్రత్యామ్నాయ పదాలను వాడారు. ప్రభుత్వ ప్రసంగ పాఠంలోనూ, 33 చోట్ల తమిళనాడు ప్రభుత్వం అని ఉంటే ఆ పదాన్ని దాటవేసి 'ఈ ప్రభుత్వం' అంటూ ఆయన ఉచ్చరించారు. పెరియార్, అంబేద్కర్, అన్నాదురై, కామరాజ్, కరుణానిధి మొదలైన వారి పేర్లు ఉన్న వాక్యాలను ఆయన ఉద్దేశ్యపూర్వకంగా పూర్తిగా వదిలివేశారు. అలాగే ముఖ్యంగా రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయి అని, విదేశీ పెట్టుబడులు ఆకర్షిస్తూ అన్ని రంగాల్లో ముందు ఉంటుంది అని, అలాగే ఎన్ని కష్టాలు ఎదురైనా తమిళభాషని కాపాడుకుందాం అని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం నడుచుకుంటుంది అని ఉన్న వాక్యాలను కూడా ఆయన వదిలివేశారు. అంతేకాకుండా తమిళనాడుకు బదులు తమిళగలం అనే పేరుగా సవరించాలని ప్రకటించడం పట్ల డి.ఎం.కె. అన్నాడిఎంకె సహారాష్ట్రంలోని అన్నిపార్టీలు గవర్నర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని గవర్నర్ అసెంబ్లీలో చదవడం సంప్రదాయం. ముఖ్యంగా గవర్నర్ ఆమోదంతోనే ప్రసంగ పాఠాన్ని ముద్రించినా ఆయన రాజ్యాంగ నియమాలకు తిలోదకాలిస్తూ ఆ పాఠాన్ని సరిగ్గా చదవకుండా తాను నిర్దేశించుకున్న రీతిలో చదవడం అనే చర్యలు రాష్ట్ర శాసనసభా సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయి. అంతిమంగా ఆయన ఈ విధంగా వ్యవహరించడం ఏమాత్రం సహేతుకంకాదు. ఆయన ఒక రకంగా గవర్నర్‌గా కాకుండా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించి రాజ్యాంగ విలువలను నిసిగ్గుగా మంటగలిపి గవర్నర్ పదవికి మాయని మచ్చ మిగిల్చారు అని పేర్కొనవచ్చు. గవర్నర్ రవి తీరును ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా నిరసించారు. గవర్నర్ ఆమోదంతో సభ్యులు అందరికి పంపిణీ చేసిన ఆంగ్ల ప్రసంగాన్ని యధాతథంగా సభ రికార్డులో పొందుపరచాలని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పీకర్‌ని కోరారు. అంతేకాకుండా ఆ ప్రసంగ పాఠంలో లేకుండా గవర్నర్ చదివిన వాక్యాలను రికార్డులో పొందుపరచరాదని ఆయన పేర్కొన్న దరిమిలా యధావిధిగా అసెంబ్లీ తీర్మానాన్ని సభ ఆమోదించింది. స్టాలిన్ ప్రసంగిస్తుండగానే గవర్నర్ కనీసం రాజ్యాంగ బాధ్యతలు కూడా విస్మరించి అసెంబ్లీ నుండి వెళ్లిపోయారు. సహజంగా ప్రతిపక్షాలు వాకౌట్ చేస్తాయి. కాని గవర్నర్ అసెంబ్లీ నుండి వాకౌట్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచే సంచలన వార్తగా నిలిచారు. ఈ విధంగా ఒక రాష్ట్ర గవర్నర్ సభ నుండి వాకౌట్ చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం కావడం గమనార్హం. ఏదిఏమైనా సభ నడుస్తున్న సమయంలోనే జాతీయ గీతాలాపన కూడా జరగక ముందే గవర్నర్ రవి సభ నుండి కావాలని నిష్క్రమించడం ఏమాత్రం సహేతుకం కాదు. నిజానికి గవర్నర్ రాష్ట్ర శాసనసభ సమావేశాలను ప్రారంభిస్తూ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవాల్సి ఉన్ననూ ఆయన ఆవిధంగా చదవకపోవడం, తమిళ సంస్కృతిని అగౌరవపరచడమే అని డి.ఎం.కె సభ్యులు, విపక్షాలు పేర్కొనడం గమనార్హం. తమిళనాడు డి.ఎం.కె సర్కారుకు, రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవికి మధ్య సభలో చోటు చేసుకున్న పరిణామాలు చిలికిచిలికి గాలివానగా మారి తమిళనాట గోడలపైకి ఎక్కాయి. రాష్ట్రం నుండి వెళ్లిపోండి అంటూ మరుసటి రోజు చెన్నై పలు ప్రాంతాలలో పోస్టర్లు వెలిశాయి. నేడు కొన్ని రాష్ట్రాలలో కొందరు గవర్నర్లు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ గవర్నర్ పదవికి తీవ్ర కళంకం తీసుకువస్తున్నారు. ఇటీవలి కాలంలో కేరళ, తెలంగాణ గవర్నర్లు ప్రభుత్వాలతో వైరాలు కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్ తమిళిసై అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలని నిరసిస్తూ ఇటీవల భారత కమ్యూనిస్ట్ పార్టీ చలో రాజభవన్‌కి పిలుపు ఇచ్చి గవర్నర్ వ్యవస్థని రద్దు చేయాలి అని నినదించడం విశిష్ట ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఏదిఏమైననూ 'రబ్బర్ స్టాంప్ వంటి, ఎలాంటి ఉపయోగం లేని గవర్నర్ వ్యవస్థని రద్దు చేయడం సముచితం' అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ●



# మేఘాలయలో అయిదుగురు ఎమ్మెల్యేల రాజీనామా

**సిల్లాంగ్, జనవరి 18:** అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో మేఘాలయలో అయిదుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. బుధవారం తమ రాజీనామాను గవర్నర్‌కు సమర్పించి యూనైటెడ్ డెమోక్రటిక్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. రాజీనామా చేసిన వారిలో కేబినెట్ మంత్రి హిల్ స్టేట్ పిపుల్ డెమోక్రటిక్ పార్టీ (హెచ్‌ఎస్‌పిడిపి) ఎమ్మెల్యే రెనిక్టన్ లింగ్‌డో టోంగ్‌కార్, తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే షిల్లాంగ్ పాలే,సస్పెండెడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మైరల్‌బోర్న్ సియోమ్, పిటి సాక్మీతో పాటు ఓ స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. అయితే ఈ పరిణామంతో రాష్ట్రంలో కాంగ్రెస్, హెచ్‌ఎస్‌పిడిపి పార్టీలకు ఎమ్మెల్యేలు లేకుండా పోయారు. కాగా మేఘాలయలో ఈ మధ్య కాలంలో పార్టీ ఫిరాయింపులు అధికమయ్యాయి. ఇప్పటి వరకు దాదాపు 18 మంది శాసనసభ్యులు సంబంధిత పార్టీలకు రాజీనామాలు సమర్పించారు. ఇదిలా ఉండగా, మార్చి 15తో మేఘాలయ 11వ అసెంబ్లీ కాలం ముగియనుంది. ఈ క్రమంలో మూడు ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నిల సంఘం బుధవారం షెడ్యూల్ ప్రకటించనుంది. ఇక మేఘాలయ డెమోక్రటిక్ అలయెన్స్ పేరుతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో భాగమైన బిజెపి ఈ యేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఒంటరిగానే బరిలోకి దిగనున్నట్లు నేషనల్ పీపుల్స్ పార్టీ పే ర్కొంది. 60 అసెంబ్లీ స్థానాలున్న మేఘాలయలో మెజార్టీ మార్కును దాటగలమని ఆశాభావం వ్యక్తం చేసింది. కాగా 2018లో ఎన్‌సి పి (20), యుడిపి (8), పిడిఎఫ్ (4), హెచ్‌ఎస్ పిడిపి (2), బిజెపి (2), ఇద్దరు స్వతంత్ర ఎమ్మె ల్యేలతో కలిసి మొత్తం 39 సంకీర్ణ ప్రభు త్వం ఏర్పడింది. నేషనల్ పీపుల్స్ అధినేత కె. సంగ్మా సిఎంగా ఉన్నారు.



## కాంగ్రెస్‌కు మాజీమంత్రి మన్‌ప్రీత్‌సింగ్ రాజీనామా

## బిజెపిలో చేరిన సీనియర్ నేత

**చండీగఢ్, జనవరి 18:** పంజాబ్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ ఆర్థికమంత్రి మన్‌ప్రీత్‌సింగ్ బాదల్ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆయన రాసిన లేఖలో తన రాజీనామాకు కారణాలను వివరించారు. ట్విట్టర్ ద్వారా పంపిన ఆ లేఖలో.. పార్టీలో వర్గపోరు తీవ్రంగా ఉన్నదని బాదల్ ఆరోపించారు. అనంతరం ఆయన బిజెపిలో చేరారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో బాదల్ ఆ పార్టీలో చేరారు. రాహుల్‌కు రాసిన లేఖలో పంజాబ్‌లోని కాంగ్రెస్ విభాగం పనితీరుపై బాదల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఓ కోటరీ పని చేస్తోందని, పార్టీ నేతల మధ్య విభేదాలను తగ్గించడానికి బదులుగా, ఈ కోటరీ పెద్దలు వర్గపోరును మరింత పెంచడానికి ప్రయత్నిస్తున్నారని బాదల్ ఆరోపించారు. పార్టీలో తాను తీవ్ర అవమానాలకు గురయ్యానని లేఖలో పేర్కొన్నారు. పంజాబ్ మాజీ సిఎం ప్రకాశ్‌సింగ్ బాదల్‌కు మన్‌ప్రీత్ సమీప బంధువు. రాహుల్ భారత్ జోడో యాత్రలో మన్‌ప్రీత్ పాల్గొనలేదు. పిసిసి చీఫ్ అమరీందర్‌సింగ్ రాజాతో విభేదాలే మన్‌ప్రీత్ పార్టీ మారడానికి కారణమైనట్లు భావిస్తున్నారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో మన్‌ప్రీత్‌కిది నాలుగో పార్టీ.

# ఇండోనేసియాలో భారీ భూకంపం

**జకార్తా, జనవరి 18:** ఇండోనేషియాలోని తూర్పు ప్రాంతాల్లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. అయితే ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలుస్తోంది. ఈ భూకంపం రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో వచ్చింది. భూకంపం కేంద్రం సముద్రం కింద 147 కిలోమీటర్లు, గోరంటాలోకు దక్షిణ ఆగ్నేయంగా 65 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతమైందని యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇది గోరంటాలో, ఉత్తర సులవేసి, ఉత్తర మలుకు, సెంట్రల్ సులవేసి ప్రావిన్సు లలోని కొన్ని ప్రాంతాల్లో కంపించింది. ఇండోనేషియా వాతవరణ శాస్త్రం, క్లైమాటాలజీ మరియు జియోఫిజిక్స్ ఏజెన్సీ ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీచేయలేదు. ఇండోనేషియా, విస్తారమైన ద్వీపసమూహంగా ఉంది. ఈ దేశంలో 270 మిలియన్ల మందికిపైగా నివాసం ఉంటున్నారు. ఈ దేశం పసిఫిక్ బేసిన్ చుట్టూ భూకంప లోపాలతో కూడిన' రింగ్ ఆఫ్ ఫైర్'పై దాని స్థానం కారణంగా తరచుగా భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలకు గురవుతుంది. నవంబరు 21న పశ్చిమ జావాలో 5.6 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా కనీసం 331 మంది మరణించారు. సులవేసిలో 2018 భూకంపం, సునామీ కారణంగా 4,340 మంది మరణించిన తర్వాత ఇండోనేషియాలో ఇది అత్యంత ఘోరమైనది. 2004లో, అత్యంత శక్తివంతమైన హిందూ మహాసముద్ర భూకంపం ఒక డజను దేశాల్లో 2,30,000 మందికిపైగా మరణించిన సునామీని సృష్టించింది. వారిలో ఎక్కువ మంది ఇండోనేషియాలోని అచే ప్రావిన్స్‌లో ఉన్నారు. తాజాగా వచ్చిన భూకంపంలో స్వల్ప ఆస్తి నష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. ఇండోనేషియాలో భూకంపాలు కామన్ కాబట్టి అక్కడ ప్రజలు ఎప్పుడు అప్రమత్తతో ఉంటారు. అందుకే అక్కడ ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తోంది.





# మళ్లీ మొదలైన తాలిబన్ల అకృత్యాలు

**కాందహార్, జనవరి 18:** తాలిబన్లు అఫ్గానిస్థాన్‌లో తమ అరాచక పాలనకు తెరలేపినట్లు కనిపిస్తోంది. దొంగతనం, చట్ట విర్ధు సంబంధాలు,సామాజిక కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారిని అతి దారుణంగా శిక్షిస్తున్నట్లు తెలుస్తోంది. కాందహార్‌లోని అహ్మద్ షాహి స్టేడియంలో తొమ్మిది మందిని బహిరంగంగా కొరడాతో కొట్టారు. స్థానిక అధికారులు, ప్రజల ముందే ఆ శిక్షలు అమలు చేశారని, 35 నుంచి 39 కొరడా దెబ్బలు కొట్టారని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అఫ్గాన్ ప్రభుత్వంలో గతంలో విధాన సలహాదారుగా పనిచేసిన షబ్నమ్ నాసిమి మరో భయకానక విషయం వెల్లడించారు. దొంగతనం ఆరోపణపలై కాందహార్‌లోని ఫుట్‌బాల్ స్టేడియంలో ప్రజలందరి ముందు తాలిబన్లు నలుగురు వ్యక్తుల చేతుల్ని నరికేశారు. సరైన న్యాయ విచారణ జరపకుండా ప్రజలకు శిక్షణ విధిస్తున్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది అని ఆమె ట్వీట్ చేశారు. అంతర్జాతీయంగా తాలిబన్ల కఠిన వైఖరిపై వ్యతిరేకత వ్యక్తం అవుతున్నప్పటికీ, వారు ఈ తరహా శిక్షలను అమలు చేస్తున్నారు. తమ గత పాలనను తిరిగి తీసుకువచ్చి, ప్రజలను తీవ్ర ఆందోళనలోకి నెట్టేశారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. చరిత్ర మళ్లీ పునరావృతమవుతోంది. 1990ల్లో వలే తాలిబన్లు బహిరంగ శిక్షలను విధించడం ప్రారంభించారు అని అఫ్గాన్ పాత్రికేయుడు ఒకరు ట్వీట్ చేశారు.

## తమిళనాడు పేరు మార్చాలని సూచించలేదు

## వివరణ ఇచ్చిన గవర్నర్ ఆర్ఎన్ రవి

**చెన్నై, జనవరి 18:** తమిళనాడు వర్సెస్ తమిళగం వివాదంపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కి తగ్గారు. తన మాటల్ని కొందరు వక్రీకరించారంటూ వివరణ ఇచ్చారు. తమిళనాడు పేరు విషయంలో ఇటీవల గవర్నర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. గవర్నర్ రవికి వ్యతిరేకంగా క్విట్ తమిళనాడు, గెట్ ఔట్ రవి అంటూ ఆ రాష్ట్రంలో నిరసనలు పెద్ద ఎత్తున జరిగాయి. దాంతో, గవర్నర్ రవి బుధవారం వివరణ ఇచ్చారు. తాను తమిళనాడుకు వ్యతిరేకం కాదని, తమిళనాడు పేరు మార్చాలని తాను సూచించలేదని, కొందరు తన మాటల్ని వక్రీకరించారని అన్నారు. కాశీకీ, తమిళులకూ చారిత్రకంగా, సాంస్కృతికంగా బంధం ఉన్నదని, దాని గురించి చెబుతూ తాను తమిళగం అనే పదం సముచితమైనదని చెప్పేందుకు ప్రయత్నించానని అన్నారు. తమిళనాడు అంటే తమిళుల దేశమని, తమిళగం అంటే తమిళుల ఇల్లు అని ఆయన అన్నారు. దేశం మొత్తానికి తమిళనాడు వర్తించదని.. అయితే, అది అలవాటుగా మారిందని అన్నారు.



## ఎలక్టోరల్ బాండ్స్ విరాళాల్లో 57 శాతం బిజెపి ఖాతాలోకే

### ఐదేళ్లలో రూ.5270 కోట్లు

**న్యూఢిల్లీ, జనవరి 18:** ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రాజకీయ పార్టీలకు అందే విరాళాల్లో బిజెపి ఒక్కటే సగానికిపైగా తన ఖాతాల్లో వేసుకుంది. 2018 నుంచి 2022 వరకు దేశంలోని ఆయా కంపెనీలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు అందించిన విరాళాల మొత్తం రూ.9208 కోట్లు కాగా, అందులో బిజెపి వాటా రూ.5270 కోట్లు. అంటే..57 శాతం ఎలక్టోరల్ బాండ్ల విరాళాలు ఒక్క బిజెపి ఖాతాలోకే వెళ్లాయని అర్థం. ఇక అదే కాలంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు అందిన విరాళాల మొత్తం రూ.964 కోట్లు, అంటే..మొత్తం విరాళాల్లో కాంగ్రెస్‌కు అందింది 10 శాతం మాత్రమే. పశ్చిమబెంగాల్‌లో అధికారంలో ఉన్న టిఎంసికి అందిన విరాళాల మొత్తం రూ.764 కోట్లు. ఇక సంవత్సరాల వారీగా చూస్తే బిజెపికి అత్యధికంగా 2020 మార్చి వరకు ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.2555 కోట్లు అందాయి. 2018లో రూ.210 కోట్లు, 2019లో రూ.1450 కోట్లు, 2021లో రూ.22.38 కోట్లు, 2022లో రూ.1033 కోట్లు బిజెపి అందాయి.

## ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే త్రిపురలో ఘర్షణలు, గాయపడ్డ కాంగ్రెస్ నేత

**అగర్తలా, జనవరి 18:** త్రిపురలో హింసాత్మక ఘర్షణలు జరిగాయి. త్రిపుర అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అరగంటకే కాంగ్రెస్, బిజెపి మద్దతుదారుల మధ్య మజ్లిస్‌పూర్ నియోజకవర్గంలోని రనిర్ బజార్ మోహన్‌పూర్‌లో గొడవలు చెలరేగాయి. ఈ గొడవల్లో కాంగ్రెస్ నేత డాక్టర్ అజయ్‌కుమార్ గాయపడ్డారు. తమ పార్టీ కార్యకర్తలు పలువురు గాయపడ్డారని, వారంతా రనిర్‌బజార్ పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదీప్‌రాయ్ బర్మన్ తెలిపారు. బిజెపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆ పాంతంలో ఉండటంతో క్షతగాత్రులు ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన అన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడి వెనుక ఓ మంత్రి ప్రమేయం ఉన్నదని ఆయన ఆరోపించారు. మజ్లిస్‌పూర్ నియోజకవర్గంతోపాటు ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికలను ప్రత్యేకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.




## నేటి నుంచి పాట్నా హంసఫర్ ప్యాంట్రీ కార్ బోగీ

**గుంతకల్లు రైల్వే, జనవరి 18 ప్రభాతవార్త** ఉభయ తెలుగు రాష్ట్రాల మీదుగా పాట్నా-బెంగుళూరు-కృష్ణరాజపురం-పాట్నాల మధ్య తిరిగే నెంబర్ 22353/53 హంసఫర్ వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా ప్యాంట్రీకారు బోగి నుంచి ఏర్పాటుచేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

పాట్నా నుంచి బెంగుళూరు కృష్ణరాజపురంకు ఈ నెల 19న గురువారం నుంచి బయల్దేరే నెంబర్ 22353 హంసఫర్ వీక్లీ సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు, అలాగే బెంగుళూరు కృష్ణరాజపురం నుంచి పాట్నా వెళ్లే నెంబర్ 22354 హంసఫర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 22 ఆదివారం నుంచి ఎంట్రీ కార్ సేవలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటా యన్నారు.



# మేం బలమైన భాగస్వాములం

### మాల్దీవుల పర్యటనలో విదేశాంగమంత్రి జైశంకర్

**మాలే, జనవరి 18 :** భారత్, మాల్దీవులు మంచి పొరుగు దేశాలు, బలమైన భాగస్వాములని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. రెండు దేశాలకు ఈ ప్రాంతంలో శాంతి, భద్రతలు నెలకొలపడం పట్ల బాధ్యత ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. మూడురోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ బుధవారం మాల్దీవులకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన శ్రీలంక వెళ్లనున్నారు. మాల్దీవుల విదేశాంగమంత్రి అబ్దుల్లా షాహిద్‌తో జైశంకర్ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక భాగస్వామ్యం ప్రత్యేకించి అభివృద్ధి సహకారం, ఇరు దే శాల ప్రజ ల మధ్య సం బం ధాలను పెంపొందించడంలాంటి అంశాలపై వారిరువురూ చర్చించారు. సమావేశం అనంతరం ఇరువురు నేతలు సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. ' మేం మంచి పొరుగువారం.

మేం బలమైన భాగస్వాములం. మేం పరస్పరం అభివృద్ధి, ప్రగతి కోసం పెట్టుబడులు పెట్టాం. అయినా, మాకు ఈ ప్రాంత శాంతి, భద్రతలపై సంయుక్త బాధ్యత ఉన్నద్ణి అని జైశంకర్ అన్నారు.

మాల్దీవుల అవసరాలను తీర్చడం కోసం భారత్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జైశంకర్ అన్నారు. మాల్దీవుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్తతల్ని తగ్గించడం కోసం తాము ఉమ్మడిగా పని చేస్తామని జైశంకర్ పేర్కొన్నారు.

## ఒక్కరోజులో కరోనా కేసులు 138, మృతి ఇద్దరు

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,46,81,371

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి18:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 138 కేసులు నమోదయ్యాయి. మృతి ఇద్దరు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46, 81,371కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,48,645మంది కోలుకోగా 1998మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,728కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది.దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,36,978కి చేరగా,79,88,421 మంది వరకు కోలుకున్నారు.1,48,420మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,29,272కి చేరింది. అందులో 67,56,419మంది కోలుకున్నారు. 71, 570 మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,72,553 చేరింది. అందులో 40, 32,141మంది కోలుకున్నారు. 40,309మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య35,94,578కి చేరింది. అందులో 35,56,474 మంది కోలుకున్నారు. 38,049 మంది మరణించారు.



## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలైన సిస్టర్ ఆండ్రే కన్నుమూత

**ప్యారీస్, జనవరి 18:** ప్రపంచంలో సుదీర్ఘకాలం జీవించి ఉన్న మహిళగా రికార్డుల్లోకి ఎక్కిన ఫ్రెంచ్ మహిళ సిస్టర్ అండ్రే మంగళవారం కన్నుమూశారు. ఆమె వయసు 118 సంవత్సరాలు. అండ్రే అసలు పేరు లూసిలి రాండన్, టౌలన్‌లోని తన నర్సింగ్ హోమ్‌లో రాండన్ మంగళవారం నిద్రలోనే చనిపోయారని హోమ్ అధికార ప్రతినిధి చెప్పారు. మొదటి ప్రపంచ యుద్ధానికి దశాబ్దం ముందు అంటే 1904 ఫిబ్రవరి 11న ఫ్రాన్స్‌లోని అలెస్ నగరంలో జన్మించిన అండ్రే, క్రైస్తవ సన్యాసిగా మారి తన జీవితాన్ని జీసస్ సేవకు అంకితం చేశారు. అండ్రే ఇప్పటి వరకు మార్సెల్లీ సిటీలోని ఓ నర్సింగ్ హోమ్‌లో ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక కాలం జీవిస్తున్న మహిళగా రికార్డుల్లోకి ఎక్కిన అండ్రే, మంగళవారం మరణించడం బాధాకరమని నర్సింగ్ హోమ్ ప్రతినిధి చెప్పారు. ' సిస్టర్ అండ్రే మృతి బాధాకరమే..అయినా, స్వర్గంలోని తన సోదరుడిని కలుసుకోవాలన్న అండ్రే కోరిక నెరవేరింది' అంటూ నర్సింగ్ హోమ్ సంతాప ప్రకటన విడుదల చేసింది.

# ఓ డీల్ కోసం నాకు లంచం ఆశ చూపారు

## ఢిల్లీ అసెంబ్లీలో లంచం డబ్బు ప్రదర్శించిన ఆప్ ఎమ్మెల్యే

**న్యూఢిల్లీ, జనవరి 18:** ఢిల్లీ అసెంబ్లీలో బుధవారం అనూహ్య సంఘటన జరిగింది. అక్రమాలను బయటపెట్టకుండా ఉండేలా తనకు లంచం ఇచ్చేందుకు యత్నించారంటూ ఆరోపించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే మహేందర్ గోయల్..ఆ డబ్బులను శాసనసభలో చూపించారు. ఈ లంచం ఘటనపై తాను ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. తనకిపుడు ప్రాణహాని ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో గోయల్ దీనిపై మాట్లాడుతూ..రోహిణి జిల్లాలోని డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ ఆస్పత్రిలో తాత్కాలిక సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ నియామకాల ప్రక్రియను ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని, ఆ కాంట్రాక్టర్ ఉద్యోగుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని గోయల్ తెలిపారు. దీనిపై తాను డిసిపి, చీఫ్ సెక్రటరీ, లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. దాంతో, ఆ కాంట్రాక్టర్ తనతో డీల్ కోసం ప్రయత్నించి లంచం ఇవ్వజూపారని తెలిపారు. ఆ లంచం డబ్బులు ఇవేనంటూ ఓ సంచిలో నుంచి తీసి శాసనసభ్యులకు చూపించారు. దీనిపై తాను మాట్లాడకుండా ఉండేందుకు కొందరు శక్తిమంతమైన వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని గోయల్ తెలిపారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనకు రక్షణ కావాలని ఆయన కోరారు. అయితే, తాను బెదిరింపులకు భయపడనని, ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన స్పీకర్..ఇది చాలా తీవ్రమైన విషయం. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్ణి అని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పాక్‌కు షాక్ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు!

**వాషింగ్టన్, జనవరి 18:** ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు అమెరికా కాంగ్రెస్ గట్టి షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఇప్పటి వరకు పాక్‌కు ఇచ్చిన' నాటోయేతర పెద్ద మిత్రుడి' హోదాను తొలగించేందుకు



ప్రతినిధుల సభలో ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. ఈ మేరకు అరిజోనా డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ సభ్యుడు ఆండీ డిగ్స్ హెచ్‌ఆర్80 బిల్లును ప్రతిపాదించారు. ఇది అధ్యక్షుడి సంతకానికి వెళ్లడానికి ముందే సెనెట్, ప్రతినిధుల సభ ఆమోదం పొందాల్సి ఉంది. అధ్యక్షుడి ఆమోద ముద్రపడ్డాక దీనిని విదేశీ వ్యవహారాల కమిటీకి పంపి చర్యలు తీసుకొంటారు. ఉగ్రవాదానికి ఆశ్రయం ఇవ్వడం ప్రభుత్వ విధానంగా పెట్టుకొన్న పాక్‌పై అమెరికాలో చట్టసభ సభ్యుల్లో ఉన్న ఆగ్రహాన్ని ఈ బిల్లు ప్రతిబింబిస్తోంది. ఒకవేళ పాక్‌కు' నాటోయేతర పెద్ద మిత్రుడి' హోదాను అధ్యక్షుడు జోబైడెన్ కొనసాగించాలంటే ఓ ధ్రువీకరణ జారీచేయాల్సి ఉంటుంది. హక్కానీ నెట్‌వర్క్ అణచివేతకు పాక్ చర్యలు తీసుకుంటోందని దీనిలో అధ్యక్షుడు చెప్పాల్సి ఉంటుంది. ఆ దేశ భూభాగాన్ని హక్కానీ వాడుకోకుండా పాక్ చర్యలు తీసుకోవడంలో నిబద్ధత ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ రెండు నిబంధనలను పాటించాలని బిల్లులో కోరారు. దీంతోపాటు అఫ్గానిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కూడా పాకిస్థాన్ చురుగ్గా సమన్వయం చేస్తున్నట్లు బైడెన్ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. వాస్తవానికి హక్కానీ నెట్‌వర్క్ పాక్ ఐఎస్‌ఐకు అత్యంత కీలకమైన ఉగ్రసంస్థ. నాటోలో సభ్యత్వం లేని దేశాలతో అమెరికా సైనిక దళాలు కలిసి పనిచేస్తుంటే ఈ హోదాను ఇస్తుంటారు.

ఈ హోదా దక్కిన దేశాలకు పలు రకాలైన సైనిక, ఆర్థిక సహాయాలను అమెరికా అందచేస్తుంది. అమెరికా 19 దేశాలకు ఈ హోదాను ఇచ్చింది. ఈ దేశాలతో కలిసి సమష్టిగా రక్షణ రంగ ప్రాజెక్టులను చేపడుతుంది. కీలకమైన ఆయుధ వ్యవస్థలను వీటికి అమ్మకం లేదా లీజుకు ఇవ్వడం, శిక్షణ వంటివి అందచేస్తుంది.

# సరకు రవాణా ద్వారా 10 వేల కోట్లు రాబడి దాటిన దక్షిణ మధ్య రైల్వే

### కేవలం 9 నెలలు 16 రోజుల వ్యవధిలోనే చరిత్రలోనే అత్యంత వేగవంతంగా సాధించింది

**గుంతకల్లు రైల్వే, జనవరి 18 ప్రభాతవార్త:**.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సరుకు రావాణా కార్యకలాపాల ద్వారా దక్షిణమధ్య రైల్వే జోన్ రూ.10వేలకోట్ల రాబడిని నమోదు చేయడం ద్వారా మరోమైలురాయిని చేరుకున్నాయి. ఈ ప్రగతిని కేవలం 9 నెలల 16 రోజుల్లో చేరుకోవడం జరిగింది. ఇది జోన్‌ప్రారంభమైనప్పటి నుంచి అత్యంత వేగవంతమైనది. అంతకు ముందు అనగా 9 మార్చి 2019న 343 రోజులలో 10వేల కోట్లు సరుకు రావాణా రాబడిని సాధించింది. సరుకు రవాణా విభాగం నిరంతరం కృషి చేయడం మూలాన కొన్ని రోజుల క్రితం దక్షిణ మధ్య రైల్వే 100 మిలియన్ టన్నుల లోడింగ్ మార్క్‌ను దాటింది. సదరు రవాణా యొక్క ఒరవడి ఆశాజనకంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అత్యధిక సరుకు రవాణా లోడింగ్‌ను చేరుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే బృందం నిరంతరం కృషి చేస్తోంది. కొత్తగా సరుకు రవాణాను ఆకర్షించడానికి, ఇతర రవాణా మార్గాలకు మళ్లించబడిన రవాణాను పునరుద్ధరించడానికి జోన్ వ్యాపార అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన యూనిట్లు ద్వారా అలాగే ఆపరేటింగ్ యూనిట్లు, కమర్షియల్ అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నాయి. సరుకు రవాణా వినియోగదారులతో అధికారులు అవిశ్రాంతంగా శ్రమిస్తూ సరుకు రవాణా వినియోగ దారులకు అందిస్తున్న పాలసీ, /విధానాలను, కార్యక్రమాలు, ప్రోత్సాహకాలను వారికి వివరిస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నింటి మూలాన సరుకు రావాణా విభాగంలో అన్ని ప్రక్రియల్లో వృద్ధికి దారి తీశాయి. సరుకు లోడింగ్‌లోప్రధాన వస్తువు బొగ్గు, మొత్తం లోడింగ్‌లో 50 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుండగా, సిమెంట్ 26శాతం లోడింగ్‌కు దోహదం చేస్తుంది. లోడింగ్‌లో దాదాపు 11 శాతం ఆహార ధాన్యాలు, ఎరువులతో కలిపి లోడింగ్ సమకూర్చుతుండగా మిగిలిన ఇతర వస్తువుల ద్వారా లోడింగ్ చేయబడుతుంది. దక్షిణ మధ్య రైల్వేకు ప్రధాన సరుకు రవాణాదారు సింగరేణి కాలరీస్, దీని వల్ల థర్మల్ పవర్‌ప్లాంట్లు, సిమెంట్‌ప్లాంట్‌లకు బొగ్గును రవాణా జరుగుతుంది. కోవిడ్ లాక్‌డౌన్ నుంచి ఆహార ధాన్యాలు, ఎరువుల లోడ్ గణనీయంగా పెరిగింది. దేశ వ్యాప్తంగా ఆహార సరఫరా గొలుసును సమతుల్యం చేయడంలో సహాయ పడుతుంది. సరుకు రావాణా విభాగంలో రూ.10వేలకోట్ల రాబడిని సాధించినందుకు, దక్షిణ మధ్య రైల్వే ఆపరేటింగ్, కమర్షియల్ విభాగాల బృందాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అభినందించారు. రైల్వేలో సరుకు రవాణాకు ప్రాధాన్య మార్గంగా మార్చడంతోపాటు అదే స్థితిని కొనసాగించాలని బృందానికి సూచించారు. సరుకు రవాణా జరుగుతున్న తీరు, అలాగే ఆ విభాగంలో కొత్త పుంతలు తొక్కేందుకు జోన్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జోన్‌లో సరుకు రావాణా జరుగుతున్న తీరు, ఆ విభాగంలోకొత్త శిఖరాలను అధిరోహించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.





గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులతో మాట్లాడుతున్న మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్‌గౌడ్,మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

## ప్రాజెక్టులకు అడ్డుగా బిఆర్ఎస్ పార్టీ

### దేశాన్ని దోచుకుతినేందుకు జాతీయ పార్టీ

### తెలంగాణ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

**అక్కన్నపేట,జనవరి 18,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులను అడ్డుకుని కాలాయాపన చేస్తున్నది టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీనేనని మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్ నిప్పులు చెరిగారు. బుధవారం హుస్నాబాద్ పరిధిలోని అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ భూ నిర్వాసితుల దీక్షాశిబిరానికి విచ్చేసి వారి ఇబ్బందులు ఇక్కట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పూర్తిచేయాలని చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపకుండా ఈ మారు వేసంగి పంటలకు కూడా నీళ్లివ్వలేని చేతకాని ప్రభుత్వం కెసిఆర్ సర్కార్ అని తీవ్రంగా విమర్శించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ఇరగదీసాడని చెప్పు కుంటూ ఇపుడు జాతీయపార్టీ తనదంటూ ఖమ్మం జిల్లాలో సభను పెట్టి దేశాన్ని దోచుకుతి నేందుకు ఎత్తుగడ వేశాడని దుయ్యపట్టారు. గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో తాను ఇక్కడి నుండి బస్‌లు ఏర్పాటు చేసి వందమంది మహిళలను తెలగాణ చీఫ్‌సెక్రటరీ శాంతకుమారి వద్దకు తీసుకువెళ్ళి వారి గోడును వినిపించి వస్తామని ప్రభాకర్‌గౌడ్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు జంగపల్లి అయిలయ్య, అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి,హుస్నాబాద్ పట్టణ మాజీ సర్పంచ్,టిపిసిసి సభ్యులు కేడం లింగ మూర్తి,సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య,హుస్నాబాద్ మండల పార్టీ అధ్యక్షులు బంక చందు,యూత్ మీడియా కోకన్వీనర్ కూన విశ్వతేజ,వెన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన అలెగ్జాండ్రీస్ రామచిలుక పిల్లలు స్వాధీనం

### నెహ్రూ జూపార్కులో పెంచేందుకు పంపించిన పిసిసిఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్



**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** చూడచక్కగా ఉండి, ముచ్చట గొలిపే అరుదైన అలెగ్జాండ్రీస్ రామచిలుకలను అమ్మకంకోసం తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయంగా అందించిన సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులు పది రామచిలుకలను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా అటవీశాఖ యాంటీ స్క్వాడ్ పట్టుకుంది. షాద్‌నగర్‌లో వీటిని కొని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆరామ్‌ఘడ్ దగ్గర అహసుద్దిన్, సయాద్ బుర్హానుద్దిన్‌లను నుంచి అటవీశాఖ స్వాధీనంచేసుకుంది. వైల్డ్‌లైఫ్ చట్టం-1072 ప్రకారం ఈ రకమైన రామచిలుకలను వేటాడటం, వెంట ఉంచుకోవడం నేరమని పిసిసిఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ తెలిపారు. విచా రణలో తాము వీటిని 25వేల రూపాయలకు అమ్మేందుకు తరలిస్తున్నామని ఆ ఇద్దరు వ్యక్తులు తెలిపారు. ఈ రకమైన వ్యాపారం వన్యప్రాణి సంరక్షణ చట్టంఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. చట్ట ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, ఐదు లక్షల రూపాయల జరిమాన విధించవచ్చని తెలిపారు. స్వాధీనం చేసుకున్న చిలు పిల్లలను నెహ్రూ జూ పార్కుకు తరలించి సంరక్షించాలని పిసిసిఎఫ్ ఆదేశించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, యాంటీ పోచింగ్ స్క్వాడ్ సిబ్బంది, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

## కెసిఆర్ బిజెపి అండర్‌లోనే పనిచేస్తున్నాడు

### కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాడన్నది భూటకం అని, కెసిఆర్ బిజెపి అండర్‌లోనే పని చేస్తున్నాడని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం కెసిఆర్ బిజెపికి భయపడి నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. నిజాం ముకరంజా అంత్యక్రియలకు హైదరాబాద్‌లో బంద్ పాటించకపోవడం బాధకరమన్నారు. బిజెపికిభయపడే కెసిఆర్ బంద్ నిరణయం తీసుకోలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంపై పాతబస్తీలో ముస్లింలు బాధపడుతున్నారన్నారు. హైదరాబాద్ అభివృద్ధినికి నిజాం ఎంతోకృషి చేశారన్నారు. దేశ స్వాతంత్ర్యంలో బిజెపి నాయకులు ఎవరూలేరన్నారు. దేశంలో బిజెపి విభజన రాజకీయాలు చేసుందన్నారు. మోడీ పాలనలో దేశానికి చేసింది ఏమీ లేదన్నారు. మోడీ రిమోట్ కంట్రోల్ ఆర్ఎస్ఎస్ దగ్గర ఉందన్నారు. బిఎల్ సంతోష్‌ను కాపాడేందుకు సిబిఐ విచారణ అన్నారు. బిజెపి చెప్పేవన్నీ బూటకం అన్నారు.

## హైదరాబాద్‌లో మరోసారి ఐటి దాడులు

### 50 బృందాలతో రంగంలోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి18:** హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపాయి.మూడు రియల్ ఎస్టేట్ సంస్థలపై బుధవారం ఉదయం ఉంచి ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సోదాల్లో దాదాపు 50 బృందాలు పాల్గొన్నట్లు ఐటీ వర్గాలు తెలిపాయి. శ్రీదిత్య హోమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోటారెడ్డి, అతని కుమారుడు ఆదిత్యరెడ్డి ఇళ్లతో పాటు ఈ సంస్థల ప్రధాన కార్యాలయాలతో పాటు వాటి అనుబంధ సంస్థలు,బంధువులు,స్నేహితుల ఇళ్లపైనా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థలు నిర్వహిస్తున్న స్థిరాస్థి వ్యాపారానికి అవి చెల్లిస్తున్న ఆదాయ పన్నుకు పొంతన లేకపోవడంతో దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రాథమిక సమాచారాన్ని సేకరించిన అధికారులు... ఆయా సంస్థలపై కేసులు నమోదు చేశారు. బంజారాహిల్స్,కూకట్‌పల్లిలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లోఈ సోదాలు కొనసాగుతున్నాయి. బుధవారం నుంచి కనీసం మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కేపీహెచ్‌బీలోని లోధా అపార్ట్‌మెంట్స్‌లోని ప్రముఖ వ్యాపారవేత్త ఊర్జిత కన్‌స్ట్రక్షన్స్ ఎండి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో,కార్యాలయంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ కొంపల్లిలోని ఊర్జిత కన్‌స్ట్రక్షన్స్ నిర్మిస్తున్న విల్లాల్లో ఉదయం నుంచి సోదాలు నిర్వహిస్తున్న ఐటీ అధికారులు టాక్స్ ఎగవేత విషయంలో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఐటీ రిటర్న్లు దాఖలులో అవకతవకలు జరిగినట్లు ఐటీ శాఖ గుర్తించింది. గడిచిన ఐదేళ్లలో ఐటీ రిటర్న్లు వివరాలను అకౌంట్స్ విభాగం నుంచి తీసుకున్న ఐటీ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# నిస్వార్థ సేవకు చిరునామా ఎన్టీఆర్

● నిజ జీవితంలోనూ రియల్ హీరో: నారా భువనేశ్వరి ●ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రక్తదాన శిబిరం, వైద్య పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి18:** దివంగత,మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశారని, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తెలిపారు. కానీ, ప్రస్తుతం రాజకీయ విలువలు పడిపోయాయన్నారు. తద్వారా స్వార్థ రాజకీయాలు కొనసాగుతున్నాయనియ పేర్కొన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజలకు సేవ చేసిన రియల్ హీరో ఎన్టీఆర్ అని, ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ నిలిచిపోతాడని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ 77వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన మెగా లెజెండరీ రక్తదాన శిబిరం,బ్లడ్ డొనేషన్ క్యాంపును నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల కీర్తి అని, సింగిల్ హ్యాండ్‌తో సమస్యలను పరిష్కరించేవారని చెప్పారు. సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ ఆయనరియల్ హీరో అని ప్రశంసించారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్ సహా కంటి, దంత, గుండె, ఎముకలు, నరాల వంటి విభాగా లకు సం బంధించిన టెస్టులు ఉచితంగా నిర్వహించారు.

**బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడిన మహనీయుడు: కాసాని**
బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడిన మహనీయుడు ఎన్టీఆర్ అని టిటిడిపి అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ప్రాంతాల వారీగా 30 రోజులపాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కాసాని ప్రకటించారు.

**ఎన్టీఆర్ బిడ్డగా పుట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తా: బాలకృష్ణ:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,దివంగత మాజీ సిఎం నందమూరి తారకరామారావు బిడ్డగా పుట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఆయన కుమారుడు,నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. నందమూరి బాలకృష్ణ, నందమూరి రామకృష్ణ, సుహాసిని,ఇతర కుటుంబసభ్యులు,టిడిపి నేతలు నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. టిడిపి రూపంలో ఎన్టీఆర్ తమకు పెద్ద కుటుంబాన్ని ఇచ్చారని, ఎన్టీఆర్ స్ఫూర్తిగా పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని పేర్కొన్నారు. సుహాసిని మాట్లాడుతూ అందరం కలిసి పార్టీకి పునర్వైభవం తీసుకువద్దామని కోరారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాముడైనా, రావణబ్రహ్మ అయినా ఎన్టీఆరేనని తెలిపారు. ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని పేర్కొన్నారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ ఆరాధ్య కథానాయకుడు,అన్నగారు నందమూరి తారక రామారావు గారికి ఘన నివాళి అర్పిస్తున్నానని, నటుడిగా ఎన్టీఆర్ అనేక చారిత్రాత్మక చిత్రాలు నిర్మించారని పేర్కొన్నారు. 1982లో ప్రజలకు సేవ చేసేందుకు ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ కృషి చేశారని, ఎన్టీఆర్ ప్రపంచ స్థాయికి తెలుగువారి కీర్తిని ఇనుమడించారని తెలిపారు. ఎడిసన్ సిటీలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారని,ఇది అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

**ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన తారక్, కల్యాణ్‌రామ్:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నివాళు లర్పించారు.ఈ తెల్లవారుజామునే జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. ఎన్టీఆర్ సమాధి వద్దకు వచ్చిన ఇద్దరు సోదరులు పుష్ప గుచ్ఛాలు ఉంచి తమ తాతను స్మరించుకున్నారు.





ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ తదితరులు

## దేశంలో రైతు రాజ్యం తీసుకొస్తామని బిఆర్ఎస్ చెప్పడం హాస్యాస్పదం

### మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** దేశంలో రైతు రాజ్యం తీసుకుని వస్తామని బిఆర్ఎస్ నేతలు చెప్పడం హాస్యాస్పందంగా ఉందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎకరానికి కోటి రూపాయలు సంపాదిస్తున్నానని అని సిఎం కెసిఆర్ చెప్పాడని, ఇది ఎంత నిజమో, దేశంలో రైతు రాజ్యం కూడా అంతేనిజం అన్నారు. కెసిఆర్ తెలంగాణలో రైతులకు ఏంచేశారని దేశంలో రైతు రాజ్యం అంటున్నాడన్నారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర కెసిఆర్ సర్కారుది అన్నారు. రుణమాఫీ 30శాతం మందికి మించి అందించలేదన్నారు. రైతులు పండించినపంట అమ్ముకోలేని దయనీయ పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్రంలో సాగు కానీ భూములకు రైతు బంధు ఇస్తున్నారన్నారు సంపాదించిన అక్రమ సంపాదనతో ఇప్పుడు దేశ రాజకీయాలు అంటూ బయలు దేరాడన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడ లేని చరిత్ర కెసిఆర్ సర్కారుది అన్నారు. కెసిఆర్ నిర్మించిన ప్రాజెక్టులతో ఒక్క ఎకరానికంటే అదనంగా నీళ్ల ఇచ్చారా? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఐటిపరిశ్రమ అభివృద్ధి ఒక భూటకం అన్నారు. రాష్ట్రంలో సాగుకానీ భూములకు రైతు బంధు ఇస్తున్నారన్నారు. సంపాదించిన అక్రమ సంపాదనతో ఇప్పుడు దేశ రాజకీయాలు అంటూ బయలు దేశాడన్నారు. 60లక్షలమంది రైతులు ఉంటే కేవలం 18లక్షలమంది రైతులకే క్రాప్ లోన్స్ వచ్చాయి. రుణమాఫీ చేయకపోవడంతో రైతులకు బ్యాంకులు రుణాల ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేని చరిత్ర కెసిఆర్ ప్రభుత్వానిది అన్నారు. కెసిఆర్ నిర్మించిన ప్రాజెక్టులతో ఒక్క ఎకరాని కంటే అదనంగా నీళ్ల ఇచ్చారా అన్నారు. ఎనిమిదేళ్లలో పంట నష్టపరిహారాన్ని ఒక్కరికైనా అందించారా అన్నారు. పాల ఉత్పత్తుల మీద 12 లక్షల మంది రైతులు ఆధారపడి ఉంటే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదన్నారు. లక్షల కోట్లు ఆర్జించి ఖమ్మం సభ నిర్వహిస్తున్నారన్నారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు అయినా అందనంగా నీళ్ల ఇచ్చారా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకునే గొప్పల గురించి చర్చకు సిద్ధమా అన్నారు. టి హబ్ అనేది కేవలం రియల్ ఎస్టేట్ కోసమే అన్నారు.



బుధవారం బిసి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

## సర్కారు భూమలు అమ్మకుండా కేంద్రం చట్టం తేవాలి

### ప్రభుత్వ భూముల్లో బిసిగురుకులాలు, హాస్టళ్లు నిర్మించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వేలకోట్ల విలువైన భూములను అమ్మకుండా కేంద్రం చట్టం తీసుకురావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణల అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాల పేరుతో నాయకులు భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు కూడా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండటంతో నాయకులు వేలకోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. మియాపూర్‌లోని 50ఎకరాల స్థలాన్ని ఏపీ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట చంద్రశేఖర్‌రకు కేటాయించడాన్ని కృష్ణయ్య తప్పుబట్టారు. బిసి గురుకులాలకు సొంత భవనాలు లేక బిసిలు నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు తీరెత్తినట్లు వ్యవహారిస్తుందని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో బిసిగురుకులాలు, హాస్టళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపా డాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రభుత్వ భూములు కబ్జా చేసినా ..ఆక్రమించినా బిసిసంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు నీలం వెంకటేష్, విద్యార్థిసంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి బర్క కృష్ణ, కర్రి వేణు మాధవ్, సతీష్, దీపిక, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ రిపోర్టును త్వరగా అందజేయండి

### జస్టిస్ రోహిణికి బిసి సమాజ్ వినతి



జస్టిస్ రోహిణికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు సూర్యారావు,శంకర్ ముదిరాజ్, నాగపరిమళ తదితరులు

**హైదరాబాద్, జనవరి 18,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ -అడ్మిషన్లలో వర్గీకరణ రిపోర్టును కేంద్రానికి త్వరగా అందజేసి బిసి వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఓబిసి వర్గీకరణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ రోహిణిని బిసి సమాజ్ కోరింది. ఈమేరకు బుధవారం ఢిల్లీలోని జస్టిస్ రోహిణిని కార్యాలయంలో బిసి సమాజ్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బిసిల్లోని కొన్ని వర్గాల్లో ఉద్యోగ, అడ్మిషన్లలో అన్యాయం జరుగుతుందని దాన్నిపై అధ్యయనం చేయడానికి 2017లో జస్టిస్ రోహిణీకమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి రిపోర్టు ఇవ్వకపోవడంతో బిసిలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. కావున ఈపార్లమెంట్ సమావేశల్లోగా అన్ని విషయాలను సమగ్రంగా అధ్యయనం చేసి బిసి కులాలల్లో అందరికీ అనుకూలంగా వర్గీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అలాగే వర్గీకరణతోపాటు, బిసికులాల ఉన్నతి కోసం సూచనలు, అత్యంత వెనకబడిన కులాల కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేవిధంగా ప్రభుత్వానికి సూచించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శంకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు నాగపరిమళ, పి.సతీష్‌సాగర్, జి.కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో కరోనా తాజా కేసులు-3

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి18:** రాష్ట్రం లో కరోనా పాజటీవ్ కేసులు బాగా తగ్గాయి. బుధవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో మూడు పాజిటీవ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.ఇప్పటివరకు రాష్ట్రంలో 8,41,459పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు.రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది.ఒక్క రోజులో 4227మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,83,50, 958 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు కరోనా నుంచి 8,37,329మంది కోలుకోగా (99.51 శాతం) బుధవారం 10మంది కోలుకున్నారు. మొత్తం యాక్టీవ్ కేసులసంఖ్య 19కు చేరింది. బుధవారం జిహెచ్ ఎం సిపరిధిలో రెండు పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి.

## ఒక్క రోజే మల్టీప్లెక్స్‌లో రూ.99కే సినిమా టికెట్

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** అన్ని సదుపాయాలు ఉన్న మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో ఒక్క రోజునే తక్కువ ధరతో ప్రేక్షకులకు సినిమా చూసే అవకాశం కలుగనుంది. ఫిబ్రవరి 20వ తేదీన సినిమా ప్రియుల దినోత్సవం సందర్భంగా ఆ ఒక్క రోజు మాత్రమే 99 రూపాయలకే ఎంపిక చేసిన ప్రాంతాల్లో సినిమా చూసే అవకాశాన్ని కల్పించాలని సినిమా థియేటర్ సంస్థ పివిఆర్ నిర్ణయించింది. దీనికి జిఎస్టి చార్జీలు అదనంగా పడనున్నాయి. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. అయితే పంజాబ్‌లోని పఠాన్‌కోట్, చండీఘడ్, పుదుచ్చేరి నగరాల్లో ఈ ఆఫర్ వర్తించదు. తెలంగాణలో జిఎస్టి చార్జీలతో కలుపుకొని టికెట్ ధర దాదాపు 112 రూపాయలకు పైగాను, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జిఎస్టీతో 100 రూపాయలకు పైన ఉండనుంది.

## మండుతున్న మిర్చి ధరలు

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎండు మిర్చి ధరలు మండుతున్నాయి. హోల్ సేల్‌లో కిలో 280 రూపాయలకు చేరగా, మార్కెట్లలో వ్యాపారులు 300 రూపాయలకు విక్రయిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఎండు మిర్చి ధరలు రెట్టింపు పెరిగాయి. గత ఏడాది జనవరి నెలలో ఎండు మిర్చి ధరహోల్ సేల్ మార్కెట్‌లో రూ.100 నుండి 120లుగా ఉండగా ఇప్పుడు అది280 రూపాయల నుండి 300లకు చేరడంతో సామాన్యులు తీవ్రఇ బ్బందులను ఎదుర్కొంటున్నారు.


## టిఆర్ఎస్ పేరుతో వెలగబెట్టింది, బిఆర్ఎస్ పేరుతో వెలగ పెట్టేది లేదు

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణలో టిఆర్ఎస్ పేరుతో వెలగబెట్టింది లేదు, ఇప్పుడు బిఆర్ఎస్‌పేరుతో వెలగ పెట్టేది లేదని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ మండిపడ్డారు. తెలంగాణ సిఎం కెసిఆర్ ఢిల్లీకి పోవడం కాదు, గల్లీలో కూడా ఉండకుండా తెలంగాణ ప్రజలు చేస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెల జీతం ఇవ్వలేని తెలంగాణ ముఖ్యమంత్రి, దేశాన్ని పాలిస్తాను అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టే అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి మాటలు అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వలేని, చేతగాని ముఖ్యమంత్రి దేశాన్ని ఉద్ధరిస్తాడంటా అన్నారు. టిఆర్ఎస్ పేరుతో వెలగపెట్టింది లేదు, బిఆర్ఎస్ పేరుతో వెలగపెట్టేది లేదన్నారు. ఏమీ మాట్లాడాలో అర్ధంకాక సమయం అయిపోయిందా? హెలికాప్టర్‌తో పెద్ద సమస్య అని ప్రసంగం మధ్యలో అనడం, ముఖ్యమంత్రి కేవలం ప్రజల దృష్టి మళ్లించడానికి తప్ప మరొకటి కాదన్నారు. ఉచిత విద్యుత్ తెలంగాణాకే దిక్కు లేదు, దేశమంతా ఇస్తాడటా అన్నారు. బిజెపి నాయకులు రాష్ట్రానికి వచ్చి ప్రసంగిస్తే, కేంద్రం నుంచి వచ్చి హిందీలో లొడలొడ మాట్లాడతారని విమర్శించిన కెసిఆర్, ఇవాళ వచ్చిన నాయకులు ఏ భాషలో మాట్లాడారో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు.

# రేపిస్టు జవాన్‌కు 20యేళ్ల జైలు

### తిరుమల్‌గిరి ఘటనలో కామపిశాచికి ఎట్టకేలకు కఠిన శిక్ష



బ్రిజేష్ కుమార్ యాదవ్

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** నగరంలోని తిరుమల్‌గిరిలో మిలటరీ, పౌర విభాగం సరిహద్దుల్లో గల రహదారిపై 2017, 2018లో రెండు నెలల మధ్య ఒక మైనర్ బాలికపై అత్యాచారం, మరో బాలికపై అత్యాచార యత్న ఘటనలో సైకోలా వ్యవహరించిన మిలటరీ జవాన్ బ్రిజేష్ కుమార్ యాదవ్ (32)కు హాకా భవన్‌లోని పోస్కో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. దీనికి సంబంధించిన వివరాలను సిసిఎస్ జాయింట్ సిపి గజారావు భూపాల్ బుధవారం మీడియాకు వెల్లడించారు. 2017 డిసెంబర్ 21వ తేదీన తిరుమల్‌గిరిలో మిలటరీ, పౌర ఆవాసాల సరిహద్దులో సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో 15 ఏళ్ల మైనర్ బాలిక తన స్నేహితుడితో కలిసి వెళుతుండగా అప్పటికే అక్కడ చీకట్లో నక్కివున్న బ్రిజేష్ కుమార్ యాదవ్ ఒక్కసారిగా దుడ్డు కర్రతో వారిపై దాడిచేశాడు. మైనర్ బాలికతోపాటు వున్న వ్యక్తిపై దాడి చేసి తరిమేశాడు. అనంతరం ఆ బాలికను సమీపంలోని పొదల్లోకి లాక్కుని వెళ్లి అత్యాచారం చేసి పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక ఫిర్యాదు మేరకు తిరుమల్‌గిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ ఘటన నగరంలో అప్పట్లో తీవ్ర సం చలనం రేపింది. దీని తరువాత రెండు నెలలకు 2018 ఫిబ్రవరి నెలలో ఇదే ప్రాంతంలో మరో ఇద్దరు (మైనర్ బాలిక, ఆమె స్నేహితుడు) వెళుతుండగా బ్రిజేష్ కుమార్ యాదవ్ మళ్లీ చీకటిలో దాగివుండి ఒక్కసారిగా దాడిచేశాడు. ఈసారి కూడా బాలికతో పాటు వున్న యువకుడిపై దాడిచేసి తరిమేశాడు. అనంతరం బాలికను పొదల్లోకి లాక్కుని వెళ్లి అత్యాచారానికి పాల్పడేందుకు యత్నిస్తుండగా ఇదే సమయంలో ఆ ప్రాంతంలో గస్తీ తిరిగేందుకు వచ్చిన పోలీసు సిబ్బంది బాలిక కేకలు విని నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనలో కూడా బాలిక ఫిర్యాదు మేరకు తిరుమల్‌గిరి పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల్‌గిరి ప్రాంతంలో అది కూడా మిలటరీ, పౌర ఆవాసాల సరిహద్దులో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరగడం, మరో బాలికపై అఘాయిత్యానికి యత్నించిన ఘటనపై తీవ్రంగా పరిగణించిన అ ప్పటి సిటీ కొత్వాల్ (ప్రస్తుత డిజిపి) అంజనీ కుమార్ ఈ కేసుల్లో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేయాలని పోలీసులను ఆదేశించారు. ఇదే సమయంలో ఈకేసు విచారణను సిసిఎస్‌కు బదలాయించారు. కాగా ఈ కేసు విచారణను సిసిఎస్ చేబట్టి స్వల్ప వ్యవధిలోనే నిందితుడు బ్రిజేష్ కుమార్ యాదవ్‌పై హాకా భవన్‌లోని పోస్కో కో ర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. కాగా మొదట ఈ కేసులో పట్టుబడ్డ నిందితుడు మిలటరీలో పనిచేసే జవాన్‌గా భావించలేదు. తీవ్రమైన నేరాలకు పాల్పడే నేరగాడు, లేదా సైకోగా భావించారు. అయితే ఇతగాడు పట్టుబడిన తరువాత ఉద్యోగం నుంచి క్రమశిక్షణారాహిత్యం కింద సస్పెండ్ అయిన బ్రిజేష్ కుమార్ యాదవ్‌గా తేలింది. ఇతన్ని అరెస్టు చేసి పోస్కోతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన సెక్షన్లను నమోదు చేశారు. ఈ కేసులో అప్పట్లో రెండు నెలల పాటు చంచల్‌గూడ జైల్లో వున్న బ్రిజేష్ కుమార్ యాదవ్ బెయిలుపై బయటకు రాగానే తిరిగి విధుల్లో చేరడం గమనార్హం. ఇతగాడికి మిలటరీ అధికారులు నాగాలాండ్‌లో పోస్టింగ్ కూడా ఇవ్వడం విశేషం. అప్పటి నుంచి అతగాడు అక్కడే ఉద్యోగంలో వున్నాడు. ఇదే సమయంలో ఈ కేసు విచారణకు పలుమార్లు హాకా భవన్‌లోని పోస్కో కోర్టుకు హాజరయ్యాడు. ఈ కేసు విచారణ హాకా భవన్‌లోని పోస్కో కోర్టులో 2018 నుంచి ఇప్పటి వరకు కొనసాగింది. ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్షపడేలా చేయడంలో సిసిఎస్, మహిళా పోలీసు విభాగం తీవ్రంగా కృషి చేసింది. ఇక ఈ కేసును విచారించిన హాకా భవన్‌లోని పోస్కో కోర్టు స్పె షల్ జడ్జి కె.కవిత నిందితుడు బ్రిజేష్ కుమార్ యాదవ్ కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు లక్షల రూపాయల జరిమానాను విధించారు. కాగా ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్లకఠిన కారాగార శిక్షపడిన వెంటనే మిలటరీ అధికారులు బ్రిజేష్ కుమార్ యాదవ్‌ను ఉద్యోగం నుంచి తొలగించారని సమాచారం.అనంతరం అతన్ని తమ కస్టడీలోకి తీసుకుని మిలటరీ జైల్లో తాత్కాలికంగా నిర్బంధంలో వుంచారని తెలిసింది.ఇతగాడిని ఒకటి రెండు రోజుల్లో సిటీ పోలీసులకు అప్పగించి చంచల్‌గూడ జైలుకు తరలించేవీలుంది.నిందితుడికి శిక్ష పడేలా చూసిన సిసిఎస్ పోలీసులను కొత్వాల్ ఆనంద్ అభినందించారు.

# సర్కారీ దవాఖానాలపై కొరవడిన అజమాయిషీ

**మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు బాలింతల మృతికి ఆపరేషన్ థియేటర్ ఇన్‌ఫెక్షన్‌గా నిర్ధారణ**

**మొన్న ఇబ్రహీంపట్నంలో కు.ని ఆపరేషన్‌లు వికటించి నలుగురు బాలింతల మృతి**

**వరంగల్‌లో బాలుడికి అనస్తీషియా మోతాదు ఎక్కువవడంతో మరణం**

**ఖమ్మంలో ముక్కు ఆపరేషన్ వికటించి మహిళ మృతి**

**హైదరాబాద్, జనవరి 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఓవైపు సర్కారు భారీగా నిధులు అందిస్తూ మౌలిక వసతులు కల్పిస్తుండగా మరోవైపు వీటిపై అధికారుల అజమాయిషీ కొరవడడంతో పలుచోట్ల ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చిన రోగులు, బాలింతలు వైద్యుల నిర్లక్ష్యానికి మృత్యువాత పడుతుండడం అన్ని వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రిలో కాన్పుకు వచ్చిన ఇద్దరు మహిళలు ప్రసవం తరువాత అనారోగ్యం పాలై గంటల వ్యవధి లోనే మరణించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. బాలింతల మరణంలో తమ లోపం ఏమీలేదని వైద్యులు ప్రకటించగా అంతర్గత విచారణలో వారికి ఆప రేషన్ చేసిన థియేటర్‌లో వున్న ఇన్ఫెక్షన్ సోకడం వల్లే ఇద్దరు బాలింతలు మరణించారని తాజాగా తేలడం గమనార్హం. ఒక్క మలక్‌పేట్ ఆసు పత్రియే కాదు గత ఏడాది ఇబ్రహీంపట్నం ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి నలుగురు బాలింతలు మరణించగా దీని తరువాత వరంగల్ ఆసు పత్రిలో చేయి విరగడంతో ఆ పరేషన్ కోసం వచ్చిన బాలుడికి అనస్తీషియా మోతాదు ఎక్కువవడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా ఖమ్మం ఆసుపత్రిలో ముక్కులో గడ్డను తొలగించుకునేందుకు వచ్చిన మహి ళకు ఆపరేషన్ చేస్తుండగా ఆమె కూడా మర ణించింది. ఈ ఘటనలోనూ అనస్తీషియా మోతాదు ఎక్కువగా వుందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ తరహా ఘ టనలు తరచూ వెలుగు చూస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకాన్ని తగ్గేలా చేస్తోంది. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు...అనే పాట తెలంగాణలో దశాబ్దాల క్రితమే బహుళ ప్రచారం పొందింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సర్కారు ఆసుపత్రుల పటిష్టతకు ప్రభుత్వం చాలానే చేసిందని చెప్పాలి. బస్తీ దవాఖానాలు మొదలుకొని ఉచిత కంటి పరీక్షలు, అవసరం అయిన వారికి కళ్ల జోళ్లు అందించడం, మధుమేహం, బిపి వున్న వారికి ఉచితంగా మాత్రలు అందించడం, అనేక రకాల రోగాలకు ఖరీదైన పరీక్షలు చేయడం వంటివి ఇందులో ముఖ్యమైనవని చె ప్పాలి. రాష్ట్ర వ్యాప్తంగా నేడు దాదాపు అన్ని సర్కారు ఆసుపత్రుల్లో మధుమేహం, బిపి, గ్యాస్ట్రో సమస్యలకు, జ్వరం, జలుబు వస్తే ఉచిత వైద్యంతో పాటు మాత్రలు లభిస్తున్నాయి. గతంలో ఇవన్నీ లభించేవి కావు. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. రెండవ వైపు వరకు వస్తే చాలా ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బంది క్రమ శిక్షణతో మెలగడం లేదని, సమయపాలన చేయడం లేదని, రోగులతో మర్యాదగా మసలుకోవడం లేదని, ఆపరేషన్ల సమయంలో తగిన జాగ్రత్తలు తీసు కోవడం లేదని ఆరోపణలు వున్నాయి. వీటిని అధికారులు కొద్దిపాటి క్రమశిక్షణ చర్యలతో చక్కదిద్దే వీలుంది. ముందుగా ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు వుండే సహాయ సిబ్బంది రోగుల పట్ల మర్యాదగా వుండేలా చూడడం ఎంతో ముఖ్యం. రోగులతో వైద్యులు బాగానే వుంటున్నా ఇతర సిబ్బంది అమర్యాదగా వుంటుండడంపై అనేకచోట్ల ఫిర్యాదు లు వస్తున్నాయి. ఇక వైద్యుల వరకు వస్తే చాలా మంది విధుల్లో నిర్లక్ష్యంగా వుంటున్నారనేది ఆరోపణ. దీంతో పాటు ఆపరేషన్ల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించ డం లేదని మరో ఆరోపణ. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సమయంలో ఆపరేషన్ థియేటర్ సవ్యంగా వుందో...? లేదో...? చూడడం లేదని, ఆపరేషన్ కు వాడే కత్తెరలు ఇతర ఉపకరణాలను వైద్య ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరచడం లేదని మరో అభియోగం. సరిగ్గా ఇటువంటి కారణాల వల్లే ఇబ్రహీంపట్నంలో నలుగురు బాలింతలు ఒక్కటే పుణ్యానికి మరణించారు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం రేపగా దీనికి కారణమైన వైద్యులను, సహాయ సిబ్బందిని సస్పెండ్ చేశారు. బా ధితులకు నష్ట పరిహారం ప్రకటించారు. కానీ ఇవేవీ చనిపోయిన మహిళల కుటుంబాలకు న్యాయం చేయలేక పోయాయి. కేవలం వైద్యులు, సహాయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే నలుగురు బాలింతలు మరణించారు. ఈ ఘటన తరువాత కాన్పు కోసం వచ్చే గర్భిణీ మహిళలకు వైద్యం అందించే విషయంలో వైద్యులు సరిగ్గా వ్యవహ రించి వుంటే మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు బాలింతలు మరణించి వుండేవారు కాదు. ఈ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియే టర్‌లో చాలా కాలంగా ఇన్ఫెక్షన్ నెల కొందని, దీని కార ణంగానే ఇందులో కాన్పు చేయించుకున్న ఇద్దరు మహిళలు మరణించారని తాజాగా తేలింది. మొత్తం మీద వైద్యులు, సహాయ సిబ్బంది నిర్లక్ష్యం కా రణంగా నెల వ్యవధిలో ఆరుగురు బాలింతలు మరణించారు. ఈ ఘటనల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై సర్కారు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి వుంది. ఇక వరంగల్ ఆసుపత్రిలో కొన్ని నెలల క్రితం చేయి విరగడంతో ఆపరేషన్ కోసం వచ్చిన ఓ గిరిజన బాలుడు ఆపరేషన్ జరుగుతుండగానే చనిపోయాడు. ఈ బాలుడి మరణానికి అనస్తీషియా డోసు ఎక్కువవడం కారణంగా బాలుడి కుటుంబీకులు ఆరోపించారు. దీనిపైనా విచారణ సాగుతోంది. ఇక ఖమ్మంలో తాజాగా ముక్కు లో ఏర్పడ్డ చిన్నపాటి గడ్డను తొలగించుకునేందుకు 24 ఏళ్ల మహిళ రాగా ఆమెకు వైద్యం చేస్తుండగా ఉన్నట్టుండి చనిపోయింది. ఈ మహిళ మరణించేందుకు కూడా అ నస్తీషియా డోస్ ఎక్కువవడం కారణంగా మహిళ కుటుంబీకులు ఆరోపించారు. అంతకు ముందు భద్రాద్రి జిల్లాలో కుని ఆపరేషన్లకు వచ్చిన మహిళలకు ఆపరేషన్ ము గిశాక నేలమీదే పడుకోబెట్టగా ఇందులో చాలామంది అస్వస్థ తకు లోనయ్యారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో తరచూ వెలుగు చూస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ వీటిని ఎం దుకు నివారించడం లేదో తెలియడం లేదు. మలక్‌పేట్, ఖమ్మం ఘటనల తరువాతైనా అధికారులు సర్కారీ ఆసుపత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సంభవిస్తున్న మ రణాలను నిలువరిస్తారో...? లేదో...? చూడాల్సి వుంది.

# హైదరాబాద్‌లో యూరోఫిన్స్ అత్యాధునిక క్యాంపస్

- భారతీయ ఔషధ మార్కెట్‌లో విస్తరించేందుకు హైదరబాద్‌లో క్యాంపస్‌ను నెలకొల్పుతున్న ఫ్రాన్స్‌కు చెందిన యూరోఫిన్స్
- ఆహారం, పర్యావరణం, ఔషధాలు, కాస్మొటిక్ ఉత్పత్తుల పరీక్షల్లో యూరోఫిన్స్ గ్లోబల్ లీడర్
- దావోస్‌లో మంత్రి కెటిఆర్ సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న యూరోఫిన్స్



**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ఫార్మా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే అత్యాధునిక సాంకేతికత, సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలను హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నట్లు యూరోఫిన్స్ ప్రకటించింది. ఆహారం, పర్యావరణం, ఫార్మాస్యూటికల్, కాస్మొటిక్ ఉత్పత్తుల పరీక్షల్, బయో అనలిటికల్ టెస్టింగ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన యూరోఫిన్స్ గ్లోబల్ లీడర్‌గా ఉంది. హైదరాబాద్‌లో ప్రారంభించే అధునాతన టెస్టింగ్ ల్యాబ్‌తో భారతీయ ఔషధ మార్కెట్‌లో విస్తరించనుంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ఐటి, పరిశ్రమ శాఖ కెటిఆర్ సమావేశమైన యూరోఫిన్స్ ప్రతినిధి బృందం విస్తరణ ప్రణాళికలను వర్ణించింది. 90,000 అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ అత్యాధునిక ప్రయోగశాలలో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ ఆర్ అండ్ డి, బయో అనలిటికల్ సర్వీసెస్, ఇన్ వివో ఫార్మాకాలజీ, సేఫ్టీ టాక్సికాలజీ రంగాలకు చెందిన అంతర్జాతీయ స్థాయి సేవ, విదేశ ఫార్మాస్యూటికల్ కంపెనీలతో పాటు చిన్న బయోటెక్ కంపెనీలకు అవసరమైన సేవలు అందుతాయి. తన అనుబంధ సంస్థ యూరోఫిన్స్ అడ్వినస్ ద్వారా హైదరాబాద్‌లో ప్రయోగశాలను యూరోఫిన్స్ ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో యూరోఫిన్స్ కొనసాగిస్తున్న కార్యకలాపాలతో పాటు డిస్కవరీ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, బయోఅనలిటికల్ సర్వీసులను ఈ ల్యాబ్ ద్వారా మరింత సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఫార్ములేషన్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇన్ విట్రో, ఇన్ వివో బయోజీ విభాగాల్లో తన సేవలను విస్తరించేందుకు 2023వ సంవత్సరం ప్రారంభం నుంచే యూరోఫిన్స్ అడ్వినస్‌కు ఈ ల్యాబ్‌తో అవకాశం కలుగుతుంది. ఔషదాల తయారీ, పరిశోధనలకు ఆసియాలో ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ పరిగణించబడుతోంది. లైఫ్‌సైన్సె రంగంలో పరిశోధన, తయారీ, క్లీస్ మ్యాన్సుఫ్యాక్చరింగ్ కార్యకలాపాల కోసం భారతదేశంలో మొదటి సారిగా జినోమ్ వ్యాలీలో ప్రపంచస్థాయిలో మౌలిక సదుపాయాలతో ప్రత్యేక ఆర్థిక మండళ్ల రూపంలో పారిశ్రామిక/నాలెడ్జ్ ఏర్పాటలయ్యాయి. దాదాపు 15000 మంది నిపుణులతోన 200 కంటే ఎక్కువ కంపెనీలు జినోమ్ వ్యాలీలో దేశీయ, అంతర్జాతీయ సంస్థలకు తమ సేవలను అందిస్తున్నాయి. ఔషదాల పరిశోధల,తయారీలో ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ స్థానాన్ని యూరోఫిన్స్ అడ్వినస్ తాజా పెట్టుబడి మరింత బలోపేతం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించడంతో పాటు లేబోరేటరీ నెట్ వర్కును మరింత సుస్థిరం చేసుకునే దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళికలు తమ దగ్గర ఉన్నాయన్నారు. యూరోఫిన్స్ సిఈఓ డా.గిల్లెస్ మార్టిన్, ఔషదాల పరిశోధన, తయారీలో ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి ఉన్న ప్రాధాన్యతను తమ దృష్టిలో ఉందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే కొత్త క్యాంపస్‌తో ఔషదాల అభివృద్ధి, ఆవిష్కరణల్లో హైదరాబాద్ ఏర్పాటు చేయబోయే కొత్త క్యాంపస్‌తో ఔషదాల అభివృద్ధి, ఆవిష్కరణల్లో హైదరాబాద్ కేంద్రం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు.హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో యూరోఫిన్స్ ప్రవేశిస్తున్నందుకు సంతోషంగా ఉందిన మంత్రి కెటిఆర్ అన్నారు. తమ విస్తరణ-వృద్ధి ప్రణాళికల కోసం హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా యూరోఫిన్స్ పరిగణిస్తున్నందుకు తనకు చాలా గర్వంగా ఉందన్నారు. తాజాగా పెటుట్బడితో జినోమ్ వ్యాలీలోని గ్లోబర్ కంపెనీలో జాబితాలో చేరిన యూరోఫిన్స్‌కు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్‌తో పాటు ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ డైరక్టర్ శక్తి ఎం. నాగప్పన్‌లు పాల్గొన్నారు.

# బిజెపితో ప్రజాస్వామ్యానికి ముప్పు : కేరళ సిఎం పినరయి విజయన్



కేరళముఖ్యమంత్రి పినరయి విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్‌మాన్, సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజాను ఆహ్వానిస్తున్న సిఎం కెసిఆర్

**ఖమ్మం, జనవరి 18, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యానికి బీజేపీ ముప్పుగా మారిందని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు. ఖమ్మంలోఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ చేపడుతున్న అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారు. ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ అనేక చర్యలు చేపడుతోందన్నారు. సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం అద్భుతంగా ఉందంటూ కితా బిచ్చారు. కంటి వెలుగు కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రజలకు మద్దతుగా నిలుస్తోందని, కేంద్రంపై పోరాడేందుకు కేసీఆర్ నడుం బిగించారని విజయన్ అన్నారు. ఇదే సందర్భంలో కేంద్రంలో బీజేపీ సర్కార్ అవలం భిస్తున్న విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

కేసీఆర్ చేపట్టిన పోరాటాలకు తమ మద్దతు ఉంటుం దన్నారు. ఇవాళ కేంద్రం ప్రత్యేక పరిస్థితుల్లో ఉందన్నారు. దేశ సమగ్రతను, న్యాయాన్ని హక్కులను కాపాడుకోవాల్సి న బాధ్యత మనపై ఉందని తెలిపారు. కేంద్రం వైఖరితో లౌకికకత్వం ప్రమాదంలో పడుతోంద న్నారు. బీజేపీ హయాంలో దేశంలో రాజ్యాంగం సంక్షోభంలో పడిందని తెలిపారు. రాష్ట్రాల సమ్మేళనమే దేశం అని, ఫెడరల్ స్ఫూర్తి ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదన్నారు. రాష్ట్రాల హక్కులు, అధికారాలను కేంద్రం కాలరాస్తోందని తెలిపారు. కీలక నిర్ణయాల్లో కేంద్రం రాష్ట్రాలను పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిపారు. దేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి పాలిస్తు న్నాయని తెలిపారు. గవర్నర్ల వ్యవస్థను రాజకీయం కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను నియంత్రించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో.. ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. చర్చలు జరగకుండానే చట్ట సభల్లో బిల్లులను బలవంతంగా పాస్ చేస్తున్నారన్నారు. సంస్కరణల పేరుతో కేంద్రం నైతిక విధానాలను ఆచరిస్తోందని తెలిపారు. దేశాన్ని కులం, మతం పేరుతో నిలువునా చీలుస్తున్నారన్నారు. మాతృభాషను చంపే ప్రయత్నంలో భాగంగానే రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. న్యాయ వ్యవస్థను కూడా ఛిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. మోడీ కార్పొరేట్లకు తొత్తుగా మారారని విమర్శించారు. మోడీ పాలనలో ఫెడరల్‌స్ఫూర్తి దెబ్బతింటోందని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు బీజేపీకి వ్యతిరేకంగా పనిచేయాలన్నారు. పార్టీలను ఏకతాటిపైకి తెచ్చినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు అని పినరయి విజయన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

**భారత దేశం పూలమాల లాంటిది : పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సింగ్:** భారతదేశం పూల మాల లాంటిదని ఆ మాలలో అన్ని రకాల పూలు ఉంటేనే అందంగా ఉంటుందని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అన్నారు. దొడ్డిదారిలో అధికారంలోకి రావడంలో బీజేపీ నెంబర్‌వన్ అని మోడీ ప్రజల కోసం కాదు తన మిత్రుల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. ఎర్రకోటపై మోడీ 8ఏండ్లుగా ఒకే రకమైన మాటలు చెబుతున్నారని ప్రజల జీవితాలను మోడీ ఎలాగూ మార్చలేకపోతున్నారని, కనీసం తన ప్రసంగాన్నైనా మార్చుకోవాలని చురకలంటించారు. ఢిల్లీ మేయర్ పదవి కోసం బీజేపీ చేయని కుట్ర లేదని అడ్డదారిలో అధికారంలోకి రావడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. బీజేపీపై పోరాటానికి తొలి అడు గులు ఖమ్మం నుండే పడడం స్వాగతించాల్సి న పరిణా మం అని అన్నారు.

**ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది : డి రాజా:** దేశానికి బీజేపీ ప్రమాదకారిగా తయారైందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. దేశ సార్వభౌమాధికారం ప్రమాదంలో పడిందని తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి దేశ మౌలిక వ్యవస్థల్నే మార్చాలని చూస్తున్నాయన్నారు. భారతదేశం ప్రస్తుతం అతిపెద్ద సంక్షోభంలో ఉందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశానికి ముప్పుగా తయారయ్యాయని విమర్శించారు. గవర్నర్ వ్యవస్థ దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఢిల్లీలో ఏం జరుగు తుందో ప్రజలందరూ చూస్తున్నారని అన్నారు. విపక్షా లన్నీ కలిసిపోరాడితే తప్ప దేశాన్ని రక్షించుకోలేమని అన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు యావత్ దేశానికి ఆదర్శనీయమని ఆయన కొనియాడారు.

# నేటి నుంచి జిహెచ్‌ఎంసి పరిధిలో కంటి వెలుగు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణలో అంధత్వ నివారణ కోసం ప్రజలందరికి కంటి వైద్యం అందుబాటులోకి తీసుకుని రావడానికి కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో స్క్రీనింగ్ సెంటర్ల వద్ద ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ఈనెల 19వ తేది నుంచి జూన్ 30 వరకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మొత్తం 241 లోకేషన్లలో 5058 క్యాంపులను 100 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో చార్మినార్ జోన్‌లో 62 లోకేషన్‌లలో క్యాంపులు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఖైరతాబాద్ జోన్‌లో 32, కుకట్‌పల్లి జోన్‌లో 29, ఎల్‌బినగర్ జోన్‌లో 45, సికింద్రాబాద్ జోన్‌లో 41, శేరిలింగంపల్లి జోన్‌లో 32 లోకేషన్లలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఒక్కోక్క లోకేషన్‌లలో హౌజ్‌హోల్డ్ వారీగా క్యాంపులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చార్మినార్ జోన్‌లో 906 క్యాంపులు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ జోన్‌లో 710, కుకట్‌పల్ జోన్‌లో 683, ఎల్‌బినగర్ జోన్‌లో 1375, సికింద్రాబాద్ జోన్‌లో 849, శేరిలింగపల్లి జోన్‌లో 534 క్యాంపులు ఏర్పాటు చేవారు. అందుకోసం జిహెచ్‌ఎంసి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, ఆహ్వాన పత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీచేసున్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఉచిత కంటి పరీక్షశిబిరాలకు వెళ్లి పరీక్షలు పూర్తయిన తరువాతు చితంగా కంటి అద్దాలు, మందులు అందించనున్నారు. కంటి పరీక్షలు నిర్వహణ అనంతరం అవసరమైన వారికి రీడింగ్ అద్దాలు అక్కడిక్కడే పంపిణీచేస్తారు. దగ్గర చూపుగానీ, దూరం చూపు ఉన్నవారికి 15 రోజుల్లో తమ ఇంటికి అద్దాలు పంపిస్తారు. అదేవిధంగా తమ దృష్టిలోపం వివరాలు అప్పకప్పుడు రాత పూర్వ కంగా తెలియజేసి కంటి అద్దాలపై కూడా స్పష్టంగా ముద్రించి ఇవ్వనున్నారు.

# ఫిబ్రవరి చివరి వారంలో కెసిఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేస్తారు

**రూ.500కోట్లతో కర్ణాటకలో కాంగ్రెస్ ఓటమికి కెసిఆర్ కుట్ర**

**కీలక నేతలతో ఫాంహౌజ్ బేరసారాలు, ఆధారాలతో సహా నిరూపిస్తాం**

**టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణలు**

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్ర అసెంబ్లీని ఫిబ్రవరి చివరి వారంలో రద్దు చేస్తారని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవకుండా కెసిఆర్ కుట్రలు మొదలు పెట్టారని మండిపడ్డారు. కర్నాటకలో 25 మంది కాంగ్రెస్ నేతలతో సిఎం కెసిఆర్ ఇటీవల మాట్లాడి వారికి రూ.500కోట్ల ఆఫర్ ఇచ్చి కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో బుధవారం తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన బిఆర్ఎస్ సభపై రేవంత్‌రెడ్డి స్పందించారు. కర్నాటకలో కాంగ్రెస్ 130 సీట్లు గెలుస్తుందని నివేదికలు చెబుతున్నాయని, అయితే తక్కువ మెజారిటీతో గెలిచే నేతలను లక్ష్యంగా పెట్టుకుని కెసిఆర్ ఆపరేషన్ ప్రారంభించారని ఆయన ఆరోపించారు. కర్నాటక కాంగ్రెస్ పార్టీలో ఒక కీలక నేతను లొంగ దీసుకోవడానికి రూ.500కోట్లు ఆఫర్ ఇచ్చింది నిజం కాదా? బళ్లారి నుంచి రాయచూరు వరకు 25-30 స్థానాల్ల స్వల్ప తేడాతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఆ 25 నుంచి 30సీట్లలో కాంగ్రెస్ పార్టీ పరాజయానికి పని చేయాలని ఆయనతో ఫాం హౌజ్‌లో బేరసారాలు చేసింది నిజం కాదా? ఇవి ఆరోపణలు కాదు. వీటిని ఆధారాలతో సహా నిరూపిస్తాం అన్నారు. ఇవి అబద్ధం అని ఖండించే ధైర్యం కెసిఆర్‌కు ఉందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో రైతులకు నీళ్ల ఇవ్వాలని ప్రాజెక్టులు కట్టిన ఘతన కాంగ్రెస్ పార్టీది అన్నారు. 245 టిఎంసిల సామర్థ్యంతో నాగార్జునసాగర్‌ను నిర్మించింది. 1.45లక్షల గ్రామాలకు కరెంట్, లక్ష గ్రామాలకు తాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ ఎల్ఐసి, ఎయిర్ ఇండియాలను ప్రారంభించిన కాంగ్రెస్,మోడి అమ్ముకుంటున్న సంస్థలను స్థాపించిందో ఎవరో కెసిఆర్‌చెప్పాలన్నారు. ప్రభుత్వ సంస్థలను అమ్ముకుంటున్న మోడికి పార్లమెంటులో మద్దతు ఇచ్చింది మీరు కాదా అన్నారు. కెసిఆర్ ఉపాన్యాసం చూస్తుంటే మోడితో వైరం ఉందని నమ్మించి ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీగా నమోదైన తరువాత గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయన్నారు. నిజంగా మోడిని ఓడించాలనే ఆలోచన ఉంటే గుజరాత్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎందుకు పోటీచేయలేదన్నారు. యుపిఏ ఉప ఎన్నికలు, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా కెసిఆర్ ఎందుకు ప్రచారం చేయలేదన్నార. మోడిని రక్షించడానికి కాంగ్రెస్‌ను దూషిస్తున్నది నిజం కాదా అన్నారు. ఈ రోజు సభలో కాంగ్రెస్‌పై కెసిఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. దేశంలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో జరిగిందన్నారు. దీనిపై చర్చకు కెసిఆర్ సిద్ధమా? కాంగ్రెస్ ఏం చేసింది అన్నారు. కెసిఆర్ వ్యూహాత్మకంగానే డిసెంబరులో జరపాల్సి న శీతాకాల సమావేశాలు జరపలేదు. ఫిబ్రవరి చివరిలో ప్రభుత్వాన్ని రద్దు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్దంగా ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 1947 నుంచి 2014 వరకు అందరూ ప్రధానులు కలిసి 56 లక్షల కోట్లు అప్పులు చేస్తే ఎన్నిమిదేళ్లలో మోడి 100 లక్షలు కోట్లు అప్పు చేశారు. అలాంటి మోడితో కాంగ్రెస్‌ను పోల్చడం కెసిఆర్ దుర్మార్గానికి పరాకాష్ట, చైనా మెడలు వంచింది కాంగ్రెస్ అయితే 2000చదరపు కిలో మన దేశాన్ని ఆక్రమించుకున్నా చైనాకు మోడి క్లీన్ చీట్ ఇచ్చాడన్నారు. ఇలాంటి మోడి ప్రభుత్వంతో కాం గ్రెస్‌ను పోలుస్తారా? కెసిఆర్ విశాఖ ఉక్కును మోడి అమ్మేస్తే మేము అధికారంలో వచ్చాక తిరిగి తీసుకుం టామన్నారు. కెనడా అసలు కంది పప్పును దిగుమతి చేసుకుంటున్నామని తప్పుగా మాట్లాడుతున్నారన్నారు. కెనడ అసలు శీతల దేశం అని, అక్కడ పప్పు పండదు, ఆ విషయంకూడా కెసిఆర్‌కు తెలియదన్నారు. సచివాల యం దగ్గర నిర్మించే అంబేడ్కర్ విగ్రహం చైనా నుంచి తీసుకొచ్చింది నిజంకాదా?అందు కోసం మంత్రుల బృం దం చైనా వెళ్లింది నిజం కాదా అంటూ ప్రశ్నించారు.

# అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తికి మేకిన్ ఇండియా ఏం కనబడుతుంది?

**ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దీన స్థితికి రాష్ట్రాన్ని నెట్టింది కెసిఆర్ కాదా?: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** అధికారం దాహం తప్ప వేరే లక్ష్యంలేని కల్వకుంట్ల కుటుం బం, దేశ లక్ష్యాన్ని కోల్పోయిందని విమర్శలు చేయడం హాస్యాస్పదమని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాలు ప్రజలను మోసం చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ అంతరాత్మ మళ్లీ అధికారం ఎలా పొందాలనేది తప్ప దేశం, సమాజం కోసం ఎంత మాత్రం కాదన్నారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం సభలో కెసిఆర్ మేకిన్ ఇండియాను జోకిన్ ఇండియాగా వ్యాఖ్యా నించడంపై మండిపడ్డారు. కరోనా సమయంలో ఎన్-95 మాస్కుల దగ్గర్నుంచి పిపిఈ కిట్లు, ఆక్సిజన్ ప్లాంట్లు, ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్లు, వెంటిలేటర్లు చివరకు వ్యాక్సిన్ కూడా మేకిన్ ఇడియాలో దేశీయంగా తయారు చేసుకున్నవేనని గుర్తుచేశారు. భారతదేశంలో గత ఎనిమిదేళ్లలో మేకిన్ ఇండియా కారణంగా దేశీయంగా ఉత్పత్తి పెరిగే విదేశాలకు ఎగుమతులు చేసేప స్థాయికి చేరుకున్నామని తద్వారా ఆర్థిక స్తోమత పెరగడంతో పాటు ఉపాధి కల్పన కూడా పెరిగిన విషయం తెలిసిందే అన్నారు. అవినీతిపై ధ్యాస ఉన్న కెసిఆర్‌కు ఎలా కనిపిస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. రక్షణ రంగంలో 2005లో రూ.900 కోట్లున్న ఎగుతమతులు ప్రస్తుతం రూ.14వేల కోట్లకు చేరుకోవడంతో పాటు 71దేశాలకు మన రక్షణ ఎగుమతులు జరగుతుండటం మేకిన్ ఇం డియాలో భాగమన్నారు. కేంద్రంఈ దిశగా ప్రయ త్నాలు చేస్తున్నా, దీనిపై కూడా టిఆర్ఎస్ నాయకులు అనవసరం రాజకీయాలు చేస్తున్నార న్నారు. దేశ ప్రజల్లో అన్ని విషయాల్లో స్పష్టత ఉందని, కెసిఆర్ కుటుంబమే కన్‌ఫ్యూజన్‌లో ఉండి దీన్ని ప్రజలపైకి నెట్టడం సరికాదన్నారు. దేశం ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందంటూ అర్ధరహితమైన విమర్శలు చేస్తున్న కెసిఆర్, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉన్న విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కనీసం 1వ తేదిన జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని నెట్టేశారన్నారు. చిన్నచిన్న కంట్రాక్టర్లు కూడా తమ డబ్బులు రాక ధర్నా చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజలు కెసిఆర్ కల్వకుంట్ల కుటుంబం తీరుపట్ల విసిగివేసారి పోయారని, వచ్చే ఎన్నికల్లో ఓడించి ఆ కుటుంబాన్ని ఫాం హౌజ్‌కు పరిమితం చేయడం ఖాయమన్నారు. కెసిఆర్, టిఆర్ఎస్ ఎన్ని తిట్లు తిడితే బిజెపికి అవన్ని ఆశీర్వాలుగా మారుతున్నాయన్నారు.

# ప్రగతి భవన్‌లో జాతీయ పార్టీల నేతలకు కెసిఆర్ అల్పాహార విందు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి18:** తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు,జాతీయ పార్టీల నేతలు మంగళవారం రాత్రే హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆహ్వానం మేరకు వీరంతా బుధ వారం ఉదయం 9.45 గంటలకు ప్రగతి భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కేరళ సిఎం పినరయి విజయన్, ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్,పంజాబ్ సిఎం భగవంత్ మాన్, యూపీ మాజీ సిఎం అఃలేశ్ యాదవ్,సిపిఐ నేత డి.రాజా సహా పలువురు జాతీయ నేతలకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఘ నంగా స్వాగతంపలికారు. వారందరితో కలిసి ప్రగతి భవన్‌లో అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ రాజ కీయ పరిస్థితులపై వారు చర్చించుకున్నారు. అనంతరం సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు రెండు హెలికాప్టర్లలో యాదగిరిగుట్టకు చేరుకున్నారు.దైవదర్శనం చేసుకున్న అనంతరం అవే హెలికాప్టర్లలో ఖమ్మంకు వెళ్లారు.

# వినూత్నంగా మోడల్ కారిడార్ రోడ్లు

**హైదరాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరం విశ్వ నగరం స్థాయిలో ఎదిగేందుకు ప్రజలకు మౌలిక సదుపాయాలకు జిహెచ్‌ఎంసి పెద్దపీట వేస్తుంది. ఈనేప థ్యంలో 29 మోడల్‌రోడ్డు కారిడార్‌లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కారిడార్‌లో స్థల ప్రభావం, ప్రజల అవసరాల మేరకు వెండింగ్ జోన్‌లు, గ్రీనరీ, పార్కింగ్, ఏర్పాటు చేస్తారు. హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. పెట్టుబడి దారులను ఆహ్వానించి పరిశ్రమల స్థాపనకు సులభరంగా సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేస్తున నేపథ్యంలో ప్రపంచ స్థాయి పరిశ్రమలు హైదరాబాద్‌కు వస్తున్నాయి. నగర ప్రజల కోసం రవాణాకు పెద్దపీట వేసి రవాణాను మెరుగుపరుస్తున్నారు. ఎస్ఆర్‌డిపి ద్వారా ఫ్లైఓవర్‌లు, ఆర్‌ఓబిలు, అండర్‌పాస్‌లు, గ్రేడ్ సపరేట్ కారిడార్‌ల ద్వారా వాహనదారులు సకాలంలో గమ్యస్థానానికి చేయడానికి ఉపయోగపడుతున్నాయి. సిఆర్‌ఎంపి ద్వారా సుమారు 800పైగా కిలోమీటర్లు చేపట్టడం జరిగింది. ఇంకా అన్ని వర్గాల వారికి ఎలంటి సమస్యలు లేకుండా ప్రత్యేక మోడల్ కారిడార్ల నిర్మాణాలు జిహెచ్‌ఎంసి చేపట్టింది. ఈ నేపథ్యంలో 150 నుంచి 200 ఫీట్‌ల వెడల్పుగల ఈ మోడల్ కారిడార్ రోడ్లను చేపడుతున్నారు. రూ.568.2 కోట్ల రూపాయలతో 21,535 మీటర్లు చేపట్టారు.

# జనాభాలో ఇప్పటికే చైనాను దాటేసిన భారత్?

## తాజా లెక్క 142 కోట్ల 80 లక్షలు

**న్యూఢిల్లీ, జనవరి 18:** భారత దేశ జనాభా ఇప్పటికే చైనాను దాటి పోయిందని ఓ అంచనా. వరల్డ్ పాపులేషన్ రివ్యూ ప్రకారం భారత జనాభా జనవరి 18 వరకెల్లా 142 కోట్ల 30 లక్షలని అంచనా. మరో పరిశోధక సంస్థ మ్యాక్రో ట్రెండ్స్ ప్రకారం భారత జనాభా 142 కోట్ల 80 లక్షలు. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా చైనా ఇప్పటివరకూ రికార్డుల్లో ఉంది. మంగళవారం చైనా అధికారికంగా తమ దేశ జనాభాను ప్రకటించింది. 2022 చివరినాటికి ఆ దేశ జనాభా 141 కోట్ల 18 లక్షలని పేర్కొంది. ఇదిలా ఉండగా, గతేడాది నవంబర్ 15న ఐక్యరాజ్యసమితి వెల్లడించిన అంచనా ప్రకారం 2023 ఏప్రిల్ వరకెల్లా ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా భారత్ నిలుస్తుంది. ఈ లెక్కన 2050 నాటికి భారత జనాభా 166.80 కోట్లకు చేరుతుందని, అప్పటికి చైనా జనాభా 131.70 కోట్లు మాత్రమే ఉంటుందని ఐరాస అంచనా వేసింది. చైనా తమ దేశ జనాభాను తగ్గించడం కోసం ఒక్క సంతానం విధానాన్ని గతంలో అనుసరించింది. అయితే, తమ వనరులకు సరిపడినంతగా జనాభా లేదన్న కారణంతో తిరిగి ఆ విధానాన్ని 2016లో రద్దు చేసింది.

# ఎస్‌ఎస్‌ఎంబి 28 షూటింగ్ పున:ప్రారంభం

సూపర్ స్టార్ మహేష్‌బాబు తదుపరిచిత్రం గురించి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాగా మహేష్‌బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల ఎస్‌ఎస్‌ఎంబి 28 అనే చిత్రం





రూపొందనున్న సంగతి తెలిసిందే.. ఈచిత్రంలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది.. పూజా, శ్రీలీల లేడీ ఓరియెంటెడ్ పాత్రల్లో నటిస్తున్నారు. ఈసినిమా కొత్త షెడ్యూల్‌ను బుధవారం హైదరాబాద్ సారథి స్టూడియోస్‌లో ప్రారంభమైంది.. తాజా షెడ్యూల్‌లో మహేష్‌తోపాటు మరికొందరు పాల్గొనన ఓయాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు.. మరిన్ని వివరాలను త్వరలోయూనిట్ తెలియజేయనుంది.. ఈచిత్రం ఈఏడాది ఆగస్టు 28న గ్రాండ్‌గా విడుదల కానుంది.. ఫా ్యమిలీ ఎలిమెంట్స్‌తోరూపొందుతోంది. ఈ ఎపిక్ యాక్షన్‌ఫిల్మ్‌కు థమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ భారీస్థాయిలో ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.

# ప్రపంచ వ్యాప్తంగా రికార్డు వసూళ్లు



ఇళయ దళపతి విజయ్ హీరోగానటించిన తాజా చిత్రం వారిసు, తెలుగులో వారసుడు. ఈచిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించింది.. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి తెరకెక్కించారు. నిర్మాత దిల్ రాజు ఎంతోప్రతిష్టాత్మకంగా ఈసినిమా నిర్మాణం వహించగా, ఈచిత్రంలో ఈఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈచిత్రం తమిళ్ సహా తెలుగు, హిందీ భాషల్లో కూడ రిలీజ్ అయ్యింది.. ఈచిత్రంమొదటివారం బాక్సాఫీసు రన్ పూర్తిచేసుకుంది..వారం రోజుల్లో మొత్తం రూ.210 కోట్ల సెన్సేషనల్ మార్క్‌కు చేరినట్టు యూనిట్ అధికారికంగా ప్రకటించింది.. దీంతో వారిసు మూవీ విజయ్ కెరీర్‌లో మరో రూ.200 కోట్ల గ్రాసర్‌గా నిలిచింది..

# సుహాస్ నుంచి ఆసక్తికర ప్రాజెక్టు

టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ హీరోల్లో నటుడు సుహాస్ కూడ ఉన్నారు. పలు పాత్రలతోపాటుగా హీరోగా రీసెంట్‌గా ఓ సినిమాను అనౌన్స్ చేయగా, బుధవారం నుంచి మరోకొత్త ప్రాజెక్టు నుంచి మేకర్స్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.. అంతేకాదు సినిమా నుంచి ఆసక్తికరమైన టైటిల్ కాన్సెప్ట్ పోస్టర్‌ను రివీల్ చేశారు. 'ఆనందరావు అడ్వెంచర్స్' అనే ఈచిత్రాన్ని నూతన



దర్శకుడు రామ్ పసుపులేటి తెరకెక్కిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈచిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.. టాలీవుడ్ హల్క్‌రానా దగ్గుబాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. ఈసినిమాఫస్ట్‌లుక్‌ను గమనిస్తే.. ఓ రెండు దశాబ్దాల క్రితం తెలుగు పాఠ్యపుస్తకాల్లో కథలు వాటిలో బొమ్మలు కన్పించినట్టు అన్పించింది.. దీంతో ఈపోస్టర్ చూసిన వెంటనే సినిమా చాలా మందికి కనెక్ట్ అవుతుందని తెలుస్తోంది. ఆకాశం నుంచి పాల సీసా పట్టుకుని సుహాస్ భూమిమీద ఓ గ్రామం మీదకు వస్తున్నట్టుగా కన్పిస్తోంది.. ఈచిత్రానికి మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఉదయ్ కోలా, అన్నే విజయ్‌శేఖర్, సురేష్ కొతింటి నిర్మాణం వహిస్తున్నారు. మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# సుధీర్ బాబు 'హంట్' ట్రైలర్ రిలీజ్

నైట్రో స్టార్ సుధీర్‌బాబు హీరోగా నటించిన తాజా చిత్రం హంట్.. భవ్యక్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఆనంద ప్రసాద్ నిర్మించారు. మహేష్ దర్శకత్వం వహించారు.. రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న థియేటర్లలోవిడుదల కానుంది.. కాగా బుధవారం ఉదయం పాన్ ఇండియా రెబల్‌స్టార్ ప్రభాస్ చేతులమీదుగా సినిమాట్రైలర్‌ను విడుదలచేశారు.. యూనిట్‌కు



ఆల్‌దిబెస్ట్ తెలిపారు. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.. హంట్ సినిమాలో మెమరీ లాస్ అయిన అసిస్టెంట్ కమిషనర్ అర్జున్ పాత్రలో సుధీర్‌బాబు నటించారు.. ఆల్‌రెడీ విడుదలైన టీజర్‌ను చూస్తే ఆ సంగతి తెలుస్తుంది.. అందులో మెమరీ లాస్‌కు ముందు కలిసిన వ్యక్తులు, జరిగినఘటనలు అరుజన్‌కు గుర్తులేవు కానీ, పోలీసు ట్రెనింగ్, భాషలు, స్కిల్స్ గుర్తు ఉన్నాయని చెప్పారు. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. ఏకేసును అయితే అర్జున్ మొదలుపెట్టి సాల్వ్ చేయలేకపోయాడో. అదేకేసును ఇపుడు ఈ అర్జున్‌సాల్వ్ చేయాలి.. అని శ్రీకాంత్ చెప్పే డైలాగ్‌తోట్రైలర్ స్టార్ అయ్యింది.. టీజర్‌లోకూడ ఆయన ఈ మాట చెప్పారు.. ఆకేసు ఏమిటన్నది ట్రైలర్‌లోచూపించారు. పట్టపగలు ఓఅసిస్టెంట్ కమిషనర్ హత్యకు గురవుతారు.. ఆకేసు ఇన్వెస్టిగేషన్ చేసే క్రమంలో హీరోకు ఎటువంటి పరిస్థితి ఎదురయ్యాయి? ఏం చేశాడు..? అనేదిఆసక్తికరంగా ఉంది. నిర్మాత వి.ఆనందప్రసాద్ మాట్లాడుతూ, ట్రైలర్‌విడుదల చేసిన ప్రభాస్‌గారికి ధన్యవాదాలు అన్నారు.. కంటెంట్ బేస్డ్ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ అన్నారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామన్నారు. జనవరి26న సినిమాను థియేటర్లలో విడుదలచేస్తున్నామని తెలిపారు.

# ఆర్గనైజేషన్‌కు ఎవరు చెడ్డపేరు తెచ్చినా ఊరుకోం

## ఫిబ్రవరి 19న తెలుగు చలన చిత్ర మండలి ఎన్నికలు: సి.కళ్యాణ్

తెలుగు చలనచిత్ర నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలను అధ్యక్షుడు సి.కళ్యాణ్ బుధవారం ఎఫ్‌ఎన్‌సిసిలో మీడియాతో మాట్లాడారు.. కొద్దిరోజులుగా తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలిపై కొందరు బురద జల్లుతూ రకరకాలుగా మాట్లాడుతున్నారు. కొందరు నిర్మాతల ఛాంబర్ వద్ద టెంట్ వేసి సమస్యలపై పోరాడుతున్నట్టు ప్రకటించి లేనిపోని అపనిందలు వేశారని అన్నారు.. అందుకు కొన్ని చోట్ల మీడియాలో రకరకాలుగా చెబుతున్నారని, నిర్మాతల మండలికి ఎన్నికలు జరపటం లేదంటూకామెంట్లు చేశారనానరు.. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని




మేమంతా సమావేశమై ఏకగ్రీవ నిర్ణయంగా బుధవారం ఈనిర్ణయాలు ప్రకటిస్తున్నామని అన్నారు.. మండలిలో రెగ్యులర్‌సభ్యులు 1200 మంది ఉన్నారని, అలాంటి సంస్థపై కొందరు చేసిన కామెంట్‌లను సోషల్‌మీడియాలో కొంతమంది ఇష్టమొచ్చినట్టు బురద చల్లుతున్నారని అనాన్రు. ఆర్గనైజేషన్‌కు ఎవరు చెడ్డపేరు తెచ్చినా ఊరుకోమని అన్నారు. అలాంటి వారిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కళ్యాణ్ అన్నారు.. అందులో ప్రొడ్యూసర్ కె.సురేష్‌కుమార్‌ని మూడేళ్లు సస్పెండ చేశామన్నారు.. ఆయన యధావిధిగా సినిమాల చేసుకోవచ్చని, అలాగే యలమంచిలి రవి కుమార్‌ను బుధవారం నుంచి మా సంస్థ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నా మని తెలిపారు.ఇక మీద తెలుగు చలనచిత్ర మండలికి ఆయనకు శాశ్వతంగా ఎలాంటి సంబంధం ఉండదన్నారు. 40ఏళ్ల ఈసంస్థలో వీళ్లలాగా ఎవరూ బిహేవ్ చేయలేదని అన్నారు. ఈసంస్థ ఒక్కటే, దీనిని కాపాడుకునే బాధ్యత అందరిపైఉందన్నారు. నేను తప్పుచేసినా నాపై చర్యలు తీసుకోవచ్చని ఆయన వెల్లడించారు. అలాగే ఎన్నికల విషయానికొస్తే నేను పోటీ చేయటం లేదని అన్నారు. నేను ఒకసారి ఒక పదవిలో ఉంటే మళ్లీ ఆ పదవికి పోటీ చేయను అన్నారు. ఫిబ్రవరి 19న తెలుగు చలనచిత్ర మండలి ఎన్నికలు, ఫిబ్రవరి 1నుంచి 6 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఒకరు ఒక పోస్టుకు మాత్రమే పోటీ చేయాల్సి ఉంటుందని, 13వ తేదీ వరకు విత్‌డ్రాకు అవకాశం ఉందన్నారు.. ఎన్నికల అధికారిగా కే.దుర్గాప్రసద్ వ్యవహరిస్తారని, అదే రోజు సాయంత్రం ఈసీ మీటింగ్ జరుగుతుందని కళ్యాణ్ వివరించారు. కౌన్సిల్‌లో ప్రస్తుతం రూ.9కోట్ల ఫండ్ ఉందని, అంత అమౌంట్ పోగవ్వటానికి కారణం దాసరి నారాయణరావు గారే అన్నారు. మాకు తిరుపతిలో ఒకబిల్డింగ్ ఉందని, మూవీ టవర్స్‌లో రెండు కోట్ల 40 లక్షలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. ఇపుడు అది రూ.10 కోట్లకు చేరిందనానరు. డిసెంబర్ 31 వరకు అకౌంట్స్ అన్నీ ఈసీలోపాస్ అయినవే అని అన్నారు.




కేతికాశర్మ.. బాలీవుడ్ బ్యూటీ.. తెలుగులో ఇప్పటిదాకా మూడు సినిమాల్లో నటించింది.. ఆకాష్ పూరి హీరోగా తెరకెక్కిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లోకి కేతికా శర్మ అడుగు పెట్టింది.. ఆ తర్వాత నాగశౌర్యహీరోగా తెరకెక్కిన లక్ష్య మూవీలో నటించింది.. అంతేకాకుండా మెగా హీరో వైష్ణవ్‌తేజ్‌తో రంగరంగ వైభవంగా అనే సినిమాలో నటించింది.. ఇదిలా ఉంటే ఈ భామ సినిమా ల్లో కంటే బయట హాట్‌హాట్ డ్రెస్సులతో ఫొటోషూట్స్ చూస్తే సోషల్‌మీడియాలో షేర్‌చేస్తుంది. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ చాలా పెద్దగానే ఉందనే సంగతి తెలిసిందే.. ఈభామ ఇన్‌స్టాగ్రామ్‌కు 2.5 మిలియన్ యూజర్లు ఫాలో అవుతున్నారు.తన ఫాలోవర్స్‌ను ఎంటర్‌టైన్ చేయటానికి ఎప్పటి కపుడు హాట్‌ఫోజులతో అందాల విందు వడ్డిస్తోంది.. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాక్ డ్రెస్‌లో బెడ్‌రూమ్‌లో హొయలు పోతూ కన్పించింది. ఈ ఫొటోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి..

# 'పాప్‌కార్న్' సాంగ్



అవికాగోర్, సాయి రోనక్ జంటగా నటిస్తున్నచిత్రం పాప్‌కార్న్... ఎంఎస్ చలపతిరాజు సమర్పణలో ఆచార్య క్రియేషన్స్,అవికా స్క్రీన్ క్రియేషన్‌స బ్యానర్లపై భోగేంద్ర గుప్తా ఈసినిమాను నిర్మిస్తున్నారు.. హీరోయిన్‌గా అవికాగోర్ ఈచిత్రానికి సహనిర్మాతగా వ్యవహరించటం విశేషం.. మురళి గంథం దర్శకత్వం వహిస్తున్నారు..ఫిబ్రవరి 10న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది.. తాజాగా బుధవారం మది విహంగమయ్యే... అనే లిరికల్ సాంగ్‌ను ప్రముఖ హీరో నాగచైతన్య విడుదల చేశారు. సినిమా పెద్ద సక్సెస్ కావాలని అభినందనలుతెలిపారు.. పాటను గమనిస్తే.. ఓ షాపింగ్ మాల్‌లోనే పాటంతాసాగుతుంది.. చిత్ర సమర్పకుడు ఎంఎస్ చలపతిరాజుమాట్లాడుతూ, పాప్‌కార్న్ మూవీని ఫిబ్రవరి 10న విడుదలచేస్తున్నామన్నారు.. డైరెక్టర్ మురళి గంథం టేకింగ్‌ను అందరూ తప్పకుండా అప్రిషియేట్‌చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సినిమా కోప్రొడ్యూసర్ అవికా గోర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 10న పాప్‌కార్న్‌తో సందడి చేయబోతున్నామని అన్నారు. కార్యక్రమంలో హీరో సాయిరోనక్, తదితరులు మాట్లాడారు.

# 'కస్టడీ' నుంచి కృతిశెట్టి ఫస్ట్‌లుక్



ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య తెలుగు,తమిళ భాషా చిత్రం కస్టరీ.. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.. నాగచైతన్య ఫెరోషియస్ అవతార్‌లో న్యూఇయర్ గిఫ్ట్‌గా విడుదల చేసిన గ్లిమ్స్‌కు మంచి స్పందన వచ్చింది.. ఈసినిమా చివరి దశ షూటింగ్ జరుపుకుంటుంది... ఈ రోజు మేకర్స్ ఈచిత్రం నుంచి కృతిశెట్టిని రేవతిగా పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌లోకథను ముందుకి నడిపించే బలమైన పాత్ర బాగా ఆలోచన రేకెత్తించేలా కృతిశెట్టి కన్పించారు. అరవింద్‌స్వామి విలన్ పాత్రలోనటిస్తున్నారు. ప్రియమణి పవర్‌ఫుల్ రోల్‌లో కన్పించనుంది.. ఈచిత్రంలో శరత్‌కుమార్ సంపత్‌రాజ్, ప్రేమ్‌జీ, వెన్నెల కిశోర్, ప్రేమి విశ్వనాధ్‌తదితరులు నటిస్తున్నారు. ఈఏడాది మే 12న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.

# నానిచే హర్ టీజర్

చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమై కెరీర్ పరంగా విలక్షణ కథలనుఎంచుకుంటూ తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంటోంది హీరోయిన్ రుహానిశర్మ... హిట్ సినిమాలో తన టాలెంట్ బయట పెట్టి సక్సెస్ అందుకుంది. అదే బాటలో ఇపుడు హర్ అనే ఓ వైవిధ్యమన సస్పెన్స్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందకు రాబోతోంది. ఇప్పటిదాకా సాఫ్ట్‌రోల్స్ చేస్తూ ఆకట్టుకున్న ఈ భామ తొలిసారిగా ఫిమేల్ లీడ్ చేస్తూ ఓ పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్ రోల్‌చేస్తోంది.. హర్ అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాతోతనలోని మరో యాంగిల్ చూపించేందుకు రెడీ అయ్యింది.. తాజాగా ఈ సినిమా టీజర్‌ను నాచురల్‌స్టార్ నాని చేతులమీదుగా విడుదల చేశారు.. ఈ టీజర్‌లో రుహా ని శర్మ క్యారెక్టర్ హైలెట్‌గా నిలిచింది.. ఆమె ఓ ఛాలెంజింగ్ రోల్ చేసిందని వీడియోలోని సన్నివేశాలు ప్రూవ్ చేశాయి.. డ్యూటీ పరంగా 6 నెలల సస్పెన్షన్ తర్వాత ఓ హత్య కేసును చేధించటానికి తిరిగి ఖాకీ డ్రెస్ ధరించిన రుహానీశర్మ సీన్‌తో మొదలైన ఈ టీజర్ ఆద్యంతం



ఆసక్తికరంగా సాగింది. శ్రీధర్ స్వరగాన్ రూపుదిద్దన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌పై ఒక్కసారిగా అంచనాలు రెట్టింపయ్యాయి.. డబుల్ ఆఫ్ మీడియాస్ సంస్థ ఫస్ట్‌ప్రొడోన్‌గా ఈసినిమానురిలీజ్ చేయబోతున్నారు. రఘు సంకురారతి , దీపా సంకురాత్రి నిర్మించారు.. పోలీసు ఇన్వెస్టిగేషన్ నేపథ ్యంలోశ్రీధర్ స్వరాగాన్ దర్శకత్వం వహించారు.. ఈచిత్రంలో వికాస్ వశిష్ట, ప్రదీప్ రుద్ర, జీవన్ కుమార్, అభిగ్న్య, సంజయ్ స్వరూప్,బెనర్జీ, రవివర్మ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.. హర్ చాప్టర్ 1 అనే టైటిల్‌తో ఈసినిమాను విడుదల చేయనున్నారు.

విజయ్ నటించిన వారసుడు తాజాగా విడుదలైంది.. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మరియు పివిపి సినిమా పతాకాలపై

# పొంగిపోయి భావోద్వేగానికి గురయ్యా....



దిల్‌రాజు, శిరీష్, పరమ్ వి.పొట్లూరి, పెరల్ వి.పొట్లూరి నిర్మించారు. దీని గురించి దర్శకుడు వంశీ పైడిపల్లి మాట్లాడారు.. బుధవారం హైదరాబాద్‌లో ఆయనసమావేశంలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.. ఆయన మాటల్లోనే.. నేను నా జీవితంలో అతిపెద్ద రోలర్ కోస్టర్ ను అనుభవవించానని చెప్పాలి.. వారసుడు రిజల్ట్‌తో చాలా సంతోష ంగా ఉన్నాను.. నేను తమిళంలో తీసిన తొలి సినిమానే పెద్ద హిట్ అయ్యింది.. తెలుగులో ఈసినిమా అనతికాలంలోనే మాస్టర్ కలెక్షన్లను బీట్ చేయబోతోంది.. నిజం చెప్పాలంటే తెలుగులోపబ్లిసిటీ చేయటానికి మాకు సమయం సరిపోలేదు.. సంక్రాంతికి విడుదల కావటంతో హడావుడి చేయాల్సి వచ్చింది.. తమిళంలోకూడ ఒక్క ఈవెంట్ మాత్రమే చేయగలిగాం.. రిజల్ట్‌పై దిల్‌రాజుగారు చాలా హ్యాపీగా ఉన్నారు. నా విషయానికొస్తే.. బాక్సాఫీసు ఫలితంపై రాజుగారి స్పందన చూసి ప్రేక్షకుల అభిప్రాయాన్ని అంచనా వేశారు అన్పించింది.. రాజుగారికి ఈసినిమా డబ్బుతోపాటు గౌరవం తెచ్చిపెట్టింది. ఊపిరి తమిళంలోనూ తీశాం.. ప్రతిషాట్ తెలుగు, తమిళంలో విడివిడిగా చిత్రీకరించబడింది.. మరోవైపు వారసుడు చిత్రాన్ని కేవలం తమిళంలోనే మాత్రమే చిత్రీకరించి తెలుగులోకి డబ్ చేశారు. ఊపిరి అనుభవం నాకు బాగా ఉపయోగపడింది.. విజయ్‌సార్ దేశవ్యాప్తంగా ఓపెద్దస్టార్.. అతని బలాలు నాకు తెలుసు.. ఆయన అత్యంత గుర్తింపు పొందిన పాత్రల ఇమేజ్‌ను వెండితెరపైకి మళ్లీ తీసుకు రావటాఇనకి ఈచిత్రాన్ని రూపొందించాను.. 98ల్లో ఆయన సినిమాలు తెలుగులో నువ్వు వస్తావని, శుభాకాంక్షలుగా రీమేక్ అయ్యాయి.. ఆ తర్వాత మాస్ స్టార్ ఇమేజ్ సొంత చేసుకున్నాడు.. వారసుడులో ఆయన గతచిత్రాలను , ఆ తర్వాతి చిత్రాలను మిక్స్‌చేశాను.. పాటలు, డ్యాన్సులు, ఫైట్స్‌తో ప్యాకేజీగా డెలివరీచేశాం.. వారసుడుసినిమాలో తండ్రీకొడుకుల సెంటిమెంట్‌తో టచ్‌చేశాంటూ ప్రతి రోజూ నాకు కాల్స్ వస్తున్నాయి.. మా నాన్నగారు కూడ నన్ను హత్తుకున్నారు.. పొంగిపోయి భావోద్వేగానికి గురయ్యాను..కాగా 2020లో మహేష్‌బాబుగారితో సినిమా చేయాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ముందుకు వెళ్లలేకపోయాను.. నా సినిమాలన్నింటికీ, అమ్మానాన్నలే సెంట్రిక్ లైన్‌గా ఉంటుంది.. వారసుడులోతండ్రీ కొడుకులు కాంపిటీటివ్‌గా ఉండాలని కోరుకుంటారు.. తల్లి నిజం, తండ్రి నమ్మకం.,.నేను దాన్నినమ్ముతాను.. నా సినిమాలులో ఆ పాయింట్‌ని రకరకాలుగా తెలియజేస్తూ ఉంటాను. నా దృష్టిలో కథే హీరోని వెతుక్కుంటూ వెళ్తుంది అని నమ్ముతాను.. మున్నా ప్రభాస్ కోసం వెతికింది.. బృందావనం తారక్‌ను వెతికింది.. అందువలన పెద్ద స్టార్స్ అవసరమయ్యే పెద్ద కాన్వాయ్ సినిమాలు తీయాలని నేను నమ్మలేకపోతున్నాను. నాసినిమాలో ప్రతి పాత్ర ఉండటానికి ఒక జస్టిఫైడ్ రీజన్ ఉంటుంది..

# తెలుగు ప్రేక్షకులకు 'బుట్టబొమ్మ' కొత్త అనుభూతి: అర్జున్‌దాస్

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్స్ ఫోర్ సినిమాస్‌తో కలిసి నిర్మిస్తున్న ఫీల్‌గుడ్‌రూరల్ డ్రామా బుట్టబొమ్మ.. సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య నిర్మాతలు..అవిక సురేంద్రన్, సూర్య వశిష్ట, అర్జున్‌దాస్ ప్రధానపాత్రలు పోషిస్తున్న ఈచిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయంఅవుతున్నారు. జనవరి26న భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.. ఈ నేపథ్యంలోచిత్ర ప్రచార కార్యక్ర మాలు ఊపందుకున్నాయి.. తాజాగా నటుడు అర్జున్‌దాస్.. మీడియా తో మాట్లాడారు. ఆయనమాటల్లోనే.. పెరుమాళ్ తర్వాతచాలా కాలం ఎదరుచూశాను.. ఖైదీ, అంధఘారం, మాస్టర్ సినిమాల నుంచి కెరీర్ ఊపందుకుంది..ముఖ్యంగా లోకేష్‌కనగరాజ్ సినిమాల్లో భాగం కావటం సంతోషంగాఉంది.. ఆయన వల్లే ఇంత గుర్తింపు వచ్చింది. సితార వంటి సంస్థలో బుట్టబొమ్మ సినిమాచేసే అవకాశం రావటాం చాలా ఆనందంగా ఉంది.. ఒకసారి నిర్మాత వంశీగారు ఫోన్‌చేసి ఈసినిమా గురించి చెప్పారు. ఆయన నాపైఎంతోనమ్మకం ఉంచి., ఈసినిమా కచ్చితంగా మీరే చేయాలని అన్నారు.. మరుసటి రోజు దర్శకుడు వచ్చి నన్ను కలిసి కథ, పాత్ర గురించి వివరించారు.. ఆ తర్వాత నేను హైదరాబాద్‌కు వచ్చి వంశీగారిని కలిసి ఈసినిమాలో భాగం కావటం జరిగింది.. అప్పటి వరకు నేను వంశీగారిని కలవలేదు.. ఆ రోజే ఆయన్నిమొదటిసారి కలిశాను.. పిలిచి మరీ నాకు ఈ అవకాశం ఇచ్చారు. ఇందులో నా పాత్ర పేరు ఆర్‌కే . నాపాత్ర గురించి ఇంతకంటే ఎక్కువ చెప్ప లేను.. సినిమా చూశాక మీకే అర్థమవుతుంది.. కొత్త అనుభూతిని ఇస్తుంది.. తెలుగు ప్రేక్షకుల నుంచి నాకు లభిస్తున్న ఆదరణ అసలు ఊహించలేదు.. తెలుగులో నటిస్తానని ఊహించలేదు.. నాకు తెలుగు సినిమాలో నటించే అవకాశం రావటం, డబ్బింగ్ సినిమాలతో నేను తెలుగు ప్రేక్షకు లకు ఇంతలా చేరువయ్యామని తెలియటం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాకోసం మొదటిసారి తెలుగులో డబ్బింగ్ చెబుతున్నాను.. నేను ఈసినిమా ఒప్పుకునే ముందే నిర్మాత వంశీగారు సొంతంగా డబ్బింగ్ చెప్పాలని షరతుపెట్టారు. మా నిర్మాతలు సినిమాకు కావాల్సినవన్నీ సమకూర్చారు. దర్శకుడు రమేష్ మీద నమ్మకం ఉంచి, ఆయనకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చారు.





# లక్షలమంది విద్యార్థులను అభివృద్ధి దిశగా..

పిల్లల భవిష్యత్తు కోసమని శక్తికి మించి ఫీజులు కడతారు తల్లిదండ్రులు. అలా కట్టలేని వారి పరిస్థితేంటి? పోనీ.. స్కూళ్లలో నేర్పించే నైపుణ్యాలు వాళ్లకు జీవితంలో ఉపయోగపడుతున్నాయా? ఈ ప్రశ్నలే మెదిలాయి స్మిత మనసులో! అమ్మగా తన పిల్లల భవిష్యత్తు కోసం మొదలైన మథనం.. ఎడ్‌టెక్ సంస్థను రూపొందించేలా చేసింది. లక్షలమంది విద్యార్థులను అభివృద్ధి దిశగా నడిపిస్తోన్న ఆవిడ ప్రయాణమిది.

'మా పనావిడ రేయింబవళ్లూ కష్టపడిన మొత్తాన్ని ఫీజులకే ధారపోస్తుంది. అయినా వాళ్ల చదువుపై ఆమెకు బెంగే! నా పరిస్థితీ అంతే. నా ఇద్దరు పిల్లలు.. సంప్రదాయ బోధనతో సరిగా నేర్చుకోగలరా అనిపించింది. భారీగా ఫీజుల్ని కట్టి ట్యూషన్లకు పంపేవారూ ఎక్కువే. ఇవన్నీ చూశాక భయమేసింది. ఇలా కాదని.. నేనే సులభ పద్ధతులను వెతికి మా పాపకి నేర్పించడం మొదలుపెట్టా. మూడేళ్లు నిండేనాటికే ఎన్ని నేర్చేసుకుందో. అది చూశాక ఇతర పిల్లలకూ సాయపడాలనుకున్నా' అంటారు స్మిత దియోరా. ఈమెది ముంబయి. ఛార్టెడ్ అకౌంటెంట్‌గా ఎనిమిదేళ్ల అనభవం. సింగపూర్‌లో ప్రముఖ సంస్థల్లో పనిచేసి, 2010లో దేశానికి తిరిగొచ్చారు. 'మొదట స్థానిక అంగన్‌వాడీలకి వెళ్లా. అక్కడ చాలామంది టీచర్లకు సరైన శిక్షణ లేదు. ఇక పిల్లలెలా నేర్చుకుంటారు? 'స్పర్శ్' పేరుతో ఎన్‌జీఓ ప్రారంభించా. దాని ద్వారా ప్రత్యేక కరిక్యులమ్ తయారీతో పాటు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణిచ్చా. ఫలితం బాగుండటంతో మరో 16 కేంద్రాల్లోనూ మార్పు తెచ్చా. అదిచ్చిన నమ్మకంతో మావారు సుమీత్ మెహతాతో కలిసి 2012లో గుజరాత్‌లోని ఓ పల్లెలో 'లీడ్ స్కూల్' ప్రారంభించా. మొదటిరోజు 14 మంది విద్యార్థులొచ్చారు. ఆ రోజును మర్చిపోలేదను. నన్ను నేనింకా మెరుగుపరచుకోవాలి. అనుకున్నా. హార్వర్డ్ నుంచి కొన్ని కోర్సులు చేశా. దేశంలోని ప్రముఖ స్కూళ్లు, ఫిన్‌లాండ్, సింగపూర్ వంటి దేశాల్లో బోధన పద్ధతులను గనమించాం. వాటి ఆధారంగా కరిక్యులమ్‌లో మార్పులూ చేశాం. బోధనలో సాంకేతికతనూ చూపించాం. ఇక్కడా విజయం సాధించడంతో మహారాష్ట్రలోని చిన్న పట్టణాల్లో మరిన్ని స్కూళ్లను ప్రారంభించాం. అప్పుడే ఇలా ఎన్ని స్కూళ్లను ప్రారంభించగలమన్న సందేహమొచ్చింది. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య కల ఇలా సాధ్యం కాదనిపించింది. దీంతో ప్రైవేటు స్కూళ్లతో టైఅప్ చేసుకోవడం ప్రారంభించా' మంటారు స్మిత. 'లీడ్ పేరుతో నామమాత్రపు ఫీజులు తీసుకునే స్కూళ్లకు ప్రాధాన్యమిచ్చాం. ఉపాధ్యాయులకు సులభ బోధన పద్ధతుల శిక్షణ దగ్గర్నుంచి పాఠశాలలకు అవసరమైన కరిక్యులమ్, సాఫ్ట్‌వేర్లు, పరీక్ష పత్రాలు, సాధన పుస్తకాలు వంటివన్నీ అందిస్తాం. ఆనందంగా, భవిష్యత్‌కు సాయపడే అంశాలు నేర్పించడం మా ప్రాధాన్యం. అది నచ్చి 400కుపైగా పట్టణాల్లోని 3వేలకు పైగా స్కూళ్లు మాతో పనిచేస్తున్నాయి. 25వేలకు పైగా ఉపాధ్యాయులు శిక్షణ తీసుకున్నారు. 12 లక్షలమంది విద్యార్థులకు చేరువయ్యాం. ఎంతోమంది మమ్మల్ని నమ్మి పెట్టుబడులూ పెట్టారు. ఈ ఏడాది యూనికార్న్ హోదానీ (రూ.8300కోట్లు) అందుకున్నాం. అలాగని కుటుంబాన్ని అశ్రద్ధ చేయలేదు. నా పిల్లలు, 'లీడ్ బాధ్యత రెంటినీ సమానంగానే చూశా. ఉదయం, సాయంత్రాలు కుటుంబానికి, మధ్యలో లీడ్ పని' అని నవ్వేస్తారామె. ఈ ఏడాది ఫోర్బ్స్ సెల్ఫ్‌మేడ్ విమెన్ జాబితాలో చోటు దక్కించుకున్న స్మిత 'పవర్ ఆఫ్ విమెన్ అవార్డు-22' సహా ఎన్నో అవార్డులూ అందుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారు. రానున్న మూడేళ్లలో తమ సేవలను 26 కోట్ల మంది విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యమంటున్నారు.

మన ప్రతి విజయానికీ వెనుక కుటుంబం, భర్త ఎవరో ఒకరు తోడుంటే ఉత్సాహంగా, ధైర్యంగా ముందడుగు వేయగలం. దాన్ని సంపాదించండండి. అందుకు అవసరమైన నమ్మకాన్ని కలిగించండి. ముందు మీపై. మీకు నమ్మకం ఏర్పడినప్పుడే ఇవన్నీ సాధ్యం. దాన్ని పెంచుకోండి. గెలుపు ఖాయం. ❑

### చెలి చిట్కా

పిల్లల లంచ్ బాక్స్‌లను రెండు మూడు రోజులకోసారి నిమ్మ చెక్కతో రుద్ది కడిగితే దుర్వాసనలు రాకుండా ఉంటాయి.



# చిన్నారి సంకల్పం



ఈ యేడాది ఏమేం చేయాలో నిర్ణయించుకుని ఉంటారు కదూ! మరి పిల్లల గురించి ఏం ఆలోచించారు.

- మీ చిన్నారులకు న్యూ ఇయర్ రిసోల్యూషన్ పట్ల అవగాహన కలిగించండి. వాళ్ల సంకల్పం వారికే కాదు. కుటుంబసభ్యులందరికీ సంతోషానిస్తుంది.
- లక్ష్యం ఆచరణ సాధ్యంగా ఉండాలి. ముందే పది మైళ్ల పరిగెట్టాలని అనుకోకుండా చిన్న దూరంతో మొదలు పెట్టమనండి. లక్ష్యాన్ని సాధిస్తే మీరివ్వబోయే బహుమతి గురించి చెప్పండి. అది చిన్నారిలో ఉత్సాహాన్ని నింపుతుంది.
- చెప్పింది చేయలేకపోతే అమ్మా నాన్న శిక్షిస్తారనే భయం సహజం. శాయశక్తులా పనిచేయడమే మన వంతని, ఫలితం గురించి ఆలోచిస్తూ బెంగటిల్లకూడదని చెప్పండి. దాంతో లక్ష్యం నెరవేరకున్నా నిందించరనే భరోసా ఉంటుంది.
- మొబైల్‌తో కాలక్షేపం చేస్తోంటే బదులుగా ప్రముఖుల జీవిత చరిత్రలు, సైన్స్ గెలాక్సీ, డూ ఇట్ యువర్‌సెల్ఫ్ లాంటివి చదవమనండి.
- పిల్లల్లో వేళకు నిద్రపోని వాళ్లే అధికం. నిద్రలేమితో ఎన్ని అనర్థాలో చెప్పి, వీడియోలు చూపి ఈ రోజు నుంచి ఆ అలవాటు మార్చుకునేలా ప్రోత్సహించండి.
- సమయం, డబ్బు, తిండి, ప్రతి దాంట్లో ప్రాధాన్యాలు ఉంటాయని.. ఆ ప్రకారం నడుచుకుంటే సమస్యలు రావని చెప్పండి. కొత్త సంవత్సరం సందర్భంగా కొంత డబ్బు ఇచ్చి. కొన్ని అవసరాలు తీరాలంటే దేనికెలా ఖర్చుపెట్టాలి, ఎంత మిగులుస్తారో అడగండి. ఒకరోజులో ఏయే పనులు చేయొచ్చో, ఎలా వినియోగిస్తారో- లాంటి పరీక్షలు పెట్టండి. దీనివల్ల సమన్వయం, సద్వినియోగం లాంటి నైపుణ్యాలు అలవడతాయి. అప్పుడిక పరిపక్వతతో ఆలోచించి, ఆచరిస్తారు. ❑

# క్యాప్సికమ్ బజ్జీ



**కావలసినవి :** క్యాప్సికమ్-6 లేదా 8 (శుభ్రంగా కడిగిపెట్టుకుని.. నాలుగు వైపులా చాకుతో గాటు పెట్టుకోవాలి), శనగపిండి-1 కప్పు, ఉప్పు- తగినంత, కారం-1 టీస్పూన్, పసుపు -చిటికెడు, ధనియాలపొడి - అర టీ స్పూన్, వంటసోడా - కొద్దిగా, క్యారెట్ ముక్కలు, బీట్ రూట్ ముక్కలు, కొత్తిమీర తురుము, ఉల్లిపాయ ముక్కలు- రుచికి అదనంగా (అన్నీ ఒక బౌల్లో వేసుకుని.. నిమ్మరసం, ఉప్పు, కారం కలిపి పక్కన పెట్టుకోవాలి), నూనె-డీప్ ఫ్రైకి సరిపడా. **తయారీ..**

- ముందుగా ఒక బౌల్లో శనగపిండి, కారం, వంట సోడా, ఉప్పు, ధనియాల పొడి ఒకదాని తర్వాత ఒకటి వేసుకోవాలి.
- ఇందులో కొద్దికొద్దిగా నీళ్ల పోసుకుంటూ.. బాగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి.
- అనంతరం ఒక్కో క్యాప్సికమ్ తీసుకుని.. శనగపిండి మిశ్రమంలో ముంచి.. నూనెలో ఫ్రై చేసుకోవాలి.
- చల్లారాక చాకుతో ఒక వైపు కట్ చేసుకుని.. అందులో క్యారెట్ ముక్కల మిశ్రమాన్ని నింపుకుని సర్వ్ చేసుకుంటే భలే రుచిగా ఉంటాయి ఈ బజ్జీలు. ❑







# శీతకాల సోయగం

చలికాలం వచ్చిందంటే చాలు. జర్కిన్లకి, స్వెట్టర్లకి పనిచెబుతాం. కాస్త మందంగా, ఏవో కొన్ని రంగుల్లోనే దొరికే వీటి మాటున మీ ఫ్యాషన్ అభిరుచులు మరుగున పడిపోతున్నాయని బాధ పడుతున్నారా? మీకా సమస్య లేకుండా చేస్తున్నాయి క్విల్టెడ్ జాకెట్లు. కుర్తీలు, చీరలు, ఆధునిక డ్రెస్‌లపైనా నప్పేలా వీటిని తయారు చేస్తున్నారు. చూడ్డానికీ బాగుంటాయి. చలి నుంచీ రక్షణ.









# కుంకుమపువ్వు వ్యాధినిరోధకం

పండంటి బిడ్డ పుట్టాలంటూ గర్భిణులతో కుంకుమపువ్వు తినిపించడం తెలిసిందే. ఔషధగుణాలు పుష్కలంగా ఉండే ఇది శీతకాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల్నీ ఇస్తుంది. యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్ గుణాలు దీనిలో మెండు. తరచూ తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. నరాల వ్యవస్థపై ప్రభావం చూపి ఆందోళన, ఒత్తిడులను దరిచేరనీయదు. శరీరంలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపి, జీర్ణవ్యవస్థనుమెరుగుపరుస్తుంది. అధికబరువుకూ చెక్ పెట్టగలదు. జలుబు, దగ్గు వంటివీ దరికి చేరవు.

**వయసును దాచి...**

కుంకుమపువ్వు చర్మసౌందర్యాన్ని పెంచి ముఖంపై ముడతలు, ఇతర వృద్ధాప్య ఛాయలను త్వరగా రానివ్వదు. రాత్రి నిద్ర పోయే ముందు గోరువెచ్చని పాలలో కుంకుమ పువ్వు కలిపి తీసుకుంటే.. కార్టిసాల్ స్థాయులు తగ్గేలా చేసికంటి నిండా నిద్రపట్టడానికి దోహదపడుతుంది. రెండు కుంకుమపువ్వు రేకలను రాత్రంతా పావుకప్పు నీటిలో నానబెట్టి పరగడుపున తీసుకుంటే చాలు నెలసరిలో వచ్చేకడుపు నొప్పి, మూడ్ స్వింగ్స్ దూరమవుతాయి. వీటి రేకలను పాలు లేదా హెర్బల్‌టీలో కాసేపు నాననిచ్చి తాగితే, చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖంపై పిగ్మంటేషన్ మచ్చలు, గీతలు దూరమవుతాయి. సూర్య కిరణాలు దుష్ప్రభావాల నుంచి కాపాడుతుంది. చర్మానికి మృదుత్వాన్ని అందిస్తుంది. ఇలా రోజు చేస్తే పదేళ్ల వయసు తగ్గినట్లుగా ముడతల్లేకుండా ముఖం మెరుపులీనుతుంది. ❑



# సమస్యకు పరిష్కారం అన్వేషించండి..



డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్టు

**ప్రశ్న:** ఇటీవల కొందరు సైకాలజిస్టులు కలిసి నపుడు వారి మాటల్లో కొన్ని ఆసక్తికరమైన అంశాలు దొర్లాయి. ఒక సైకాలజిస్టు మాట్లాడుతూ ఊరంతా కౌన్సెలింగ్ చేయవచ్చు కానీ ఇంట్లో కౌన్సెలింగ్ చేయడం కష్టం అంటూ వ్యాఖ్యానిచ్చారు. తాను తన భార్య, పిల్లల వల్ల విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నానని తన ఆవేదనను వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన మరొక సైకాలజిస్టు మాట్లాడుతూ ఇంట్లో తలూపడం నేర్చుకున్న వారే ధన్యులు అన్నారు. అక్కడే ఉన్న ఒక మహిళా సైకాలజిస్ట్ జోక్యం చేసుకుని కుటుంబ సంబంధాలు మెరుగుపరచుకుంటే సమస్యలు తొలగిపోతాయని చెప్పారు. దానికి ఆయన సమాధానం చెపుతూ తన భార్యకు అనుమానపు రుగ్మత (ప్యారనాయిడ్ సైకోసిస్) తీవ్రంగా ఉందని చెప్పారు. అలాగే తల్లి, పిల్లల్లో ప్రవర్తనాలోపాలు ఉన్నాయని చెప్పారు. అయితే సైకియాట్రిస్టుకు చూపడమో లేదా తానే కౌన్సెలింగ్ చేయడానికో ప్రయత్నించమని ఒకరు సలహా ఇచ్చారు. వెంటనే మరొకరు కల్పించుకుని పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదని, ఎంత గొప్పవారైనప్పటికీ ఇంట్లోవారికి కౌన్సెలింగ్ చేయలేమని అన్నారు. బయటి వారి ద్వారా కౌన్సెలింగ్ చేయించడం లేదా చికిత్స చేయిస్తే మంచిదని సలహా ఇచ్చారు. బయటి వ్యక్తుల వద్దకు రావడం లేదని, అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయని బాధితసైకాలజిస్టు చెప్పారు. ఇంకా చాలా అంశాలు చర్చించుకున్నారు. అందరి మాటలు విన్న నాలో పలు సందేహాలు తలెత్తాయి. ఇంట్లో వారికి కౌన్సెలింగ్ చేయడం కష్టమా? భార్యాభర్తలు ఒకరి మాట ఒకరు ఎందుకు వినరు? కుటుంబంలో ఒకరికి మానసిక రుగ్మత ఉంటే మిగిలిన సభ్యులకు వచ్చే అవకాశం ఉందా? ఇదిలా ఉండగా చికిత్సకు సహకరించని వారిని ఒప్పించే మార్గం ఉందా? అన్నది కూడ కొందరికి ఎదురవుతున్న ప్రశ్న. స్థూలంగా చెప్పాలంటే కుటుంబ సంబంధాలకు అవరోధంగా పరిణమించే మానసిక రుగ్మతలు ఏవి, వాటికి పరిష్కార మార్గాలు ఉన్నాయాన్న విషయంపై అవగాహన కల్పించగలరు.


\- ఒక సోదరి.

**జవాబు:** అమ్మా! మీరు మంచి సమస్యను తెచ్చారు. మానసిక రుగ్మతలు, ప్రవర్తనా లోపాలు, ఉద్వేగ వైఫల్యాలు కుటుంబ సంబంధాలకు సమస్యగా పరిణమిస్తుంటాయి. అంతేకాదు వృత్తి, ఉద్యోగం, వ్యవహారాలలోను సమస్యలు సృష్టిస్తుం టాయి. అయితే మానసిక రుగ్మతలు ఉన్నవారి వల్ల అందరి కంటే కుటుంబ సభ్యులకు ఎక్కువ సమస్యలు ఎదురవుతుంటాయి. సమస్యను పరిష్కరించుకోలేక, సమర్థవంతంగా ఎదుర్కోలేక, తట్టుకోలేక ఒత్తిడిని పెంచుకుంటుంటారు. కొందరు చిన్నచిన్న సమస్య లను సర్దుకోలేక పెద్దవి చేసుకుంటుంటారు. కుటుంబ సంబంధాలు దెబ్బ తినడానికి అహంకారం, ప్రేమరాహిత్యం, అవగాహనా లోపం, అర్థం చేసుకోలేకపోవడం, సర్దుకోలేక పోవడం ప్రధాన కారణాలు. భార్యాభర్తలు నేను గొప్ప అంటే నేను గొప్ప అన్న అహంకార స్వభావం ప్రదర్శించినంత కాలం వాదనలు, ప్రతివాదనలు కొనసాగుతూనే ఉంటాయి. దంపతులు అయిన తరువాత వ్యక్తిగత హోదా, సంపాదన, కుటుంబ నేపథ్యం, చదువు తదితర అంశాలు పక్కనపెట్టడం మంచిది. ఇద్దరం కలసి, ఒకరికోసం ఒకరు అన్నట్టు ప్రవర్తించాలి. మనసున మనసై అన్నట్టు సాగిపోవాలి. పాలు, నీళ్ళులాగా కలసి పోవాలి. ఎట్టి సమయంలోను అనవసర వాదనలు, ప్రతివాదనలు చేయరాదు. కుటుంబానికి కొన్ని లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన దిశగా పయనించాలి. సమస్యలు ఎదురైనపుడు చర్చించుకుని పరిష్కార మార్గాలు అన్వేషించాలి తప్ప వాదించుకోవడం, ఒకరిని మరొకరు నిందించుకోవడం తగదు. ఇక కొన్ని కుటుంబాలలో ప్రేమ రాహిత్య సమస్యగా మారుతుంటుంది. మానసిక ఒత్తిళ్ళు, సామర్థ్య లోపాలు, మానసిక రుగ్మతలు ఇతర అంశాలు ప్రేమ రాహిత్యానికి కారణం అవుతుంటాయి. అలాంటి సమస్యలకు గుర్తించినపుడు ఒకరితో ఒకరు చర్చించుకుని మార్గం అన్వేషించాలి. లేదా నిపుణులను కలిసి కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. రోజు ఒకరి కోసం ఒకరు సమయం కేటాయించడం, సరదాగా మాట్లాడుకోవడం చేయాలి. ఒకరి పట్ల ఒకరు నమ్మకం విశ్వాసం ప్రదర్శించాలి. ఓర్పు, సహనం అలవర్చుకోవాలి. ప్రేమ, అనురాగం పంచాలి. అయితే కొన్ని మానసిక రుగ్మతలు ఉన్నవారు ఇవేవీచేయలేరు. స్కిజోఫ్రెనియా, బైపోలార్ డిజార్డర్, డిప్రెషన్, సైకోసిస్, శాడిజం, అనుమానపు రుగ్మత, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ తదితర కొన్ని రుగ్మతలు ఉన్నావారు ఎన్ని చెప్పినా వినరు. కొందరు కౌన్సెలింగ్‌కు సహకరించరు. కొందరు చికిత్సకు సమ్మతించరు. అలాంటి కుటుంబ సభ్యులను సైకాలజిస్టు అయినా, డాక్టరయినా మాటలతో మార్చలేరు. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు బలవంతంగా అయినా చికిత్స చేయించక తప్పదు. కాబట్టి ఆత్మనింద, దురదృష్టం అన్న భావాలు మీద పరిష్కారమార్గాలు అన్వేషించాలి. ఇక కుటుంబంలో ఒకరికి మానసిక రుగ్మత ఉన్నంత మాత్రాన మరొకరికి వస్తుందని భయపడవలసిన పనిలేదు. ఎక్కడో కొద్ది శాతం మందిలో జన్యులోపాల వల్ల రుగ్మతలు ఆవహించే అవకాశాలు ఉన్నాయి. అయితే సమస్యలకు పరిష్కారాలు వెదకడం మంచి మార్గం అని గుర్తించండి. ఇంట గెలవలేం, పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదు అన్నది కూడా తప్పుడు అభిప్రాయం అని గుర్తించండి. ❑



వ్యధ

# ద్వారాకామాయి నుండి ఊది



సాయిబాబాను గూర్చిన సమాచారం సేకరించటం సగటు మనిషి కూడా చేయగలినట్టిదే. అయితే ఆ సమాచారములోని సత్యాసత్యాలను గ్రహించి అసత్యాన్ని తీసివేయటం చాల కష్టమవుతుంది. ఈ విషయంలో శ్రీబి.వి. నరసింహస్వామి గారు చేసిన అభినదనీయం, ఆయనకు కోహినూర్ వజ్రం దొరికనంత సంబరం కలిగింది కుశాభావ్ అనే సాయి భక్తుని అనుభవాలను సేకరించినప్పుడు. కుశాభావ్ పూర్తి పేరు కృష్ణాజీ కాశీనాథ్ జోషి, ఈయన గురువు దత్త మహారాజ్. ఈ గురువు వద్ద అనేక విద్యలను నేర్చుకున్నాడు కుశాభావ్-మారణం, ఉచ్చాటనం, వశీకరణం మొదవలైనవి. మంత్రాన్ని చదివితే మిఠాయిలు వచ్చి పడేవి చేతిలో, ఈయనకు రక్షగా ఒక ఇనుప కడియాన్ని ధరించేవాడు. ఆ శక్తులను కుశాభావ్ స్వార్థానికి వాడుకోలేదు. దత్త మహారాజ్ కాశీకి పోతూ తన జేష్ట సోదరుడైన సాయిబాబా వద్దకు వెళ్లమన్నాడు కుశాభావ్‌ని. గురువాజ్ఞ ప్రకారం సాయి నాథుని దర్శించి ఆయన ఆనతి మేరకు మంత్ర, తంత్రాలను, చేతి ఇనుప కడియమును త్యజించాడు కుశాభావ్. అప్పుడు అతను అనాథ, షిరిడీలో ఆయనకు నివాసం లేదు. పగలు మశీదులో దాస బోధను పఠించుచు రాత్రులందు ఎక్కడ చోటు లభిస్తే అక్కడ నిద్రించే వాడు ఆయన సాయిని గూర్చి అనేక విషయాలు చెప్పాడు. ఒక ఏకాదశి నాడు సాయిబాబా 'ఇవిగో ఉల్లిపాయలు, తింటావా?' అన్నారు. మీరు తింటే నేను తింటాను అన్నా కుశాభావ్. వెంటనే సాయి ఉల్లిని తిన్నాడు. కుశాభావ్ కేడా తిన్నాడు. సాయి అప్పుడు అందరిని పిలిచి 'చూడండి, ఈ బ్రాహ్మణుడు ఏకాదశినాడు ఉల్లిపాయలను తిన్నాడు' అన్నారు. 'బాబా తింటే నేనూ తిన్నాను' అని అన్నాడు కుశాభావ్. నేను తిన్నది చలగడ దుంపలు చూడండి అని సాయి మనము చేసి చూపించారు. కుశ్శాభావ్ వెంటనే ఆ ఉచ్ఛిష్ఠాన్ని మహా ప్రసాదంగా తిన్నాడు. దానితోసాయి హృదయం ద్రవించింది. ఇదిగో! నీవు నన్ను తలచుకోగానే ఈ క్షణం నుండి ధునిలోని ఊది నీ చేతిలోకి వస్తుంది. కోరిన వారికి ఉచితంగా ఇవ్వు అన్నారు. ఈ విషమయాన్నే శ్రీ బి.వి.నరసింహ స్వామి గారు నిరూపించమనగా కుశాభావ్ కనులు మేసుకొని దోసిలి పట్టగానే ఊదితో దోసిలి నిండిపోయింది. ఈ లీలను శ్రీ బి.వి. నరకసింహస్వామితో పాటు అవస్తే గారు కూడా చూసి ధన్యత చెందారు. కుశాభాన్ ఫిబ్రవరి 19, 1944 మహా సమాధి చెందాడు. సాయి ఊదిని విశ్వవ్యాప్తం చేసి కుశాభావ్ ధన్యుడు.

\- యం.పి.సాయినాథ్



ఆధ్యాత్మికం

ఆట

# కివీస్‌పై టీమిండియా విజయం

## 12 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపు

**హైదరాబాద్, జనవరి 18:** న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా న్యూజిలాండ్, టీమిండియా జట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో టీమిండియాకు అనూహ్య విజయం లభించింది. నరాలు తెగే ఉత్కంఠతో సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 349



పరుగులు సాధించి 350 పరుగుల టార్గెట్‌ను ఫిక్స్ చేసింది. 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆరంభంలోనే తడబడింది. 70 పరుగులకే ఓపెనర్లు కాన్వే(10), అలెన్(40) వికెట్లను కోల్పోయారు. ఆ తర్వాత హెన్రీ నికోలస్(18), మిచెల్(9), కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్(24), గ్లెన్ ఫిలిప్స్(11) ఔట్ కావడంతో కివీస్ 131 పరుగులకే ఆరు కీలక వికెట్లను కోల్పోయింది. దాంతో, కివీస్ జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్, శాంటర్న్ బీభత్సంగా ఆడారు. గెలుపుపై ఆశలు వదిలేసుకున్న కివీస్ అభిమానుల్లో తిరిగి ఆశలు రేకెత్తించారు. బ్రేస్‌వెల్, శాంటర్న్ కలిసి 162 పరుగులు చేశారు. శాంటర్న్ 57 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద సిరాజ్ బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత కూడా బ్రేస్‌వెల్ దూకుడుగానే ఆడాడు. సిక్సులతో చెలరేగాడు. 78 బంతుల్లో 12 ఫోర్లు, 10 సిక్సులతో సెంచరీ పూర్తి చేసి 140 పరుగులకు ఔటయ్యాడు. కివీస్ 337 పరుగులకు ఆలౌట్ అయింది. దాంతో, టీమిండియాకు మొదటి వన్డేలో విజయం దక్కింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టులో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ పరుగుల వరద పారించాడు. 145 బంతుల్లోనే గిల్ డబుల్ సెంచరీ సాధించాడు. దాంతో, వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన ఐదో భారత బ్యాటర్‌గా



రికార్డులకెక్కాడు. కోహ్లి(8), ఇషాన్ కిషన్(5) పరుగులకే ఔటయి నిరాశపరిచారు. రోహిత్‌శర్మ(34), సూర్యకుమార్ యాదవ్(31), హార్దిక్ పాండ్యా(28), వాషింగ్టన్ సుందర్(12), శార్దూల్ ఠాకూర్(3) పరుగులు చేశారు. కుల్దీప్ యాదవ్(5), షమి(2) నాటౌట్‌గా నిలిచారు.

కివీస్ బౌలర్లలో షిప్లే, దారిల్ మిచెల్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఫెర్గూసన్, టిక్నర్, శాంటర్న్ ఒక్కోవికెట్ తీశారు. భారతబౌలర్లలో మహమ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు, కుల్‌దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. షమి, హార్దిక్ ఒక్కో వికెట్ తీశారు.



# గిల్ డబుల్ సెంచరీ

**హైదరాబాద్:** యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ద్విశతకంతో సత్తా చాటిన వేళ.. న్యూజిలాండ్‌తో జరుగుతోన్న తొలి వన్డేలో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ప్రత్యర్థి ముందు 350 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ శుభారంభం ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 60 పరుగులు జోడించారు. మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలవడంలో రోహిత్ శర్మ మరోసారి విఫలమయ్యాడు. కానీ యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వన్డేల్లో వరుసగా రెండో శతకాన్ని నమోదు చేశాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయినప్పటికీ ఆఖరి ఓవర్ వరకు గిల్ క్రీజులో పాతుకుపోయాడు. విరాట్ కోహ్లి, ఇషాన్ కిషన్ త్వరగా పెవిలియన్ చేరడంతో భారత్ 110 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. కానీ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జోడించిన గిల్ హార్దిక్ పాండ్యతో కలిసి అయిదో వికెట్‌కు 74 పరుగులు జోడించాడు. 88 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న గిల్ ఆ తర్వాత దూకుడు పెంచాడు. 47 ఓవర్లు ముగిసే సమయానికి 169 పరుగులు చేసిన గిల్ తర్వాత సిక్సర్ల మోత మోగించాడు. 48వ ఓవర్లో రెండు సిక్సులు బాదిన గిల్ 49వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సులు బాది 145 బంతుల్లో డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. తద్వారా వన్డేల్లో ద్విశతకం నమోదు చేసిన అయిదో భారత క్రికెటర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. చివరి ఓవర్లో భారీ షాట్‌కు యత్నించిన గిల్ ఫిలిప్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో గిల్ 19 ఫోర్లు, 9 సిక్సులు బాదగా బౌండరీల రూపంలోనే అతడు 128 పరుగులు రాబట్టడం విశేషం. గిల్ దూకుడుతో భారత్ 349/8తో ఇన్నింగ్స్ ముగించింది. న్యూజిలాండ్‌పై వన్డేల్లో భారత్‌కు ఇది అయిదో అత్యధిక స్కోరు కావడం గమనార్హం. 19 ఇన్నింగ్స్‌లో 1000 పరుగులు చేసిన గిల్ వేగంగా వెయ్యి పరుగుల మైలురాయిన చేరుకున్న భారత క్రికెటర్‌గా నిలిచాడు. సెంచరీల విషయానికి వస్తే భారత క్రికెటర్లలో శిఖర్ ధావన్ మాత్రమే గిల్ కంటే తక్కువ ఇన్నింగ్స్‌ల్లో మూడు సెంచరీలు చేశాడు. న్యూజిలాండ్ బౌలర్లలో డారెల్‌మిచెల్, హెన్రీ షిప్లే తలో రెండు వికెట్లు తీయగా ఫెర్గ్యుసన్, టిక్నర్, శాంట్నర్‌కు తలో వికెట్ దక్కింది.

## అంపైర్ తప్పుడు నిర్ణయానికి బలైన పాండ్యా



**హైదరాబాద్:** భారత్, న్యూజిలాండ్ మధ్య ఉప్పల్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో థర్డ్ అంపైర్ ఘోర తప్పిదం చేశాడు. అంపైర్ తప్పిదానికి టీమిండియా వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బలయ్యాడు. థర్డ్ అంపైర్ అనంత పద్మనాభన్ తీసుకున్న ఈ నిర్ణయం క్రికెట్ అభిమానులందరిని ఆశ్చర్యపరిచింది. మాజీ క్రికెటర్లు సైతం ఈ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. ప్రస్తుతం ఈ థర్డ్ అంపైర్ నిర్ణయం చర్చనీయాంశమైంది. ఈ వికెట్‌కు సంబంధించిన వీడియోలు, ఫోటోలను షేర్ చేస్తూ, థర్డ్ అంపైర్‌పై ఫ్యాన్స్ మండిపడుతున్నారు. డారిల్ మిచెల్ వేసిన భారత ఇన్నింగ్స్ 40వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మిచెల్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి అనూహ్యంగా బౌన్స్ అయి కీపర్ టామ్ లాథమ్ చేతిలో పడింది. అయితే వికెట్ బెయిల్స్ పడటంతో న్యూజిలాండ్ ఆటగాళ్లు అప్పీల్ చేయగా ఫీల్డ్ అంపైర్లు సమీక్ష కోరారు. థర్డ్ అంపైర్ పలు కోణాల్లో రీప్లేలు పరిశీలించాడు. బంతి బ్యాట్‌కు తాకిందో లేదోనని అల్ట్రా ఎడ్జ్‌లో చెక్ చేసాడు. బంతి బ్యాట్‌కు తాకలేదని నిర్ధారణకు వచ్చాక వికెట్ కీపర్ గ్లోవ్స్ తాకిందా? అనే కోణంలో పరిశీలించాడు. వికెట్ కీపర్ గ్లోవ్స్ బెయిల్స్‌కు దగ్గరగా ఉన్నా తాకినట్లు ఆధారాలు లభించలేదు. అలాగే బంతి వికెట్లను తాకినట్లు కూడా ఆధారం లేదు. కీపర్ చేతిలో బంతి పడిన తర్వాత బెయిల్స్ లైట్ వెలిగి కిందపడ్డాయి. దాంతో నాటౌట్ అని అంతా అనుకున్నారు. కానీ థర్డ్ అంపైర్ మాత్రం ఔట్ ప్రకటించాడు. దాంతో అంతా విస్మయపోయారు. హార్దిక్ పాండ్యా అయితే నిరాశగా పెవిలియన్ చేరాడు. గట్టిగా అరుస్తూ అంపైర్‌పై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. బ్రాస్‌వెల్ వేసిన మరుసటి ఓవర్‌లో శుభమన్ గిల్ ఆడేటప్పుడు కూడా ఇలానే బెయిల్స్ కిందపడ్డాయి. కానీ రిప్లేలో కీపర్ గ్లోవ్స్ తాకినట్లు కనిపించింది. ఈ ఘటనతో హార్దిక్ విషయంలో కూడా ఇదే జరగవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. థర్డ్ అంపైర్‌కు స్పష్టత లేనప్పుడు బెనిఫిట్ ఆఫ్ బ్యాట్స్‌మన్ రూల్ కింద నాటౌట్ ఇవ్వాల్సిందిగా ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.

# స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం నాదల్‌కు అతిపెద్ద షాక్!



**న్యూఢిల్లీ:** ఈ సీజన్ మొదటి గ్రాండ్ స్లామ్ టోర్నీ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పెద్ద సంచలనం నమోదయింది. ఈ టోర్నీలో స్పెయిన్ టెన్నిస్ దిగ్గజం రఫెల్ నాదల్‌కు చుక్కెదురైంది. టాప్ సీడ్, డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన నాదల్ రెండో రౌండ్‌లో ఇంటిదారి పట్టాడు. బుధవారం ఉదయం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో అమెరికాకు చెందిన మెకెంజీ డెక్ డొనాల్డ్ 6,4 6,4, 7,5తో వరుస సెట్లలో నాద్‌ల్‌కు షాకిచ్చి మూడో రౌండ్ చేరుకున్నారు. 65వ ర్యాంకర్‌తో మ్యాచ్‌లో నాదల్ తీవ్రంగా నిరాశ పరిచాడు. ఆరంభం నుంచే కోర్టులో ఇబ్బందిగా కదిలాడు. తుంటి గాయంతో ఇబ్బంది పడ్డ నాదల్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. మధ్యలో మెడికల్ టైమ్ ఔట్ తీసుకున్నప్పటికీ లయ అందుకోలేకపోయాడు. దాంతో, తీవ్ర నిరాశతో టోర్నీ నుంచి వైదొలిగాడు. నాదల్ ఓటమిని తట్టుకోలేకపోయిన అతని భార్య మరియా పెరెలో కన్నీళ్లు పెట్టుకుంది. మ్యాచ్ తర్వాత మాట్లాడిన నాదల్ తాను మానసికంగా ఇబ్బందికి గురయ్యానని చెప్పాడు. తన కెరీర్ గురించి తదుపరి నిర్ణయం తీసుకునే వయసు తనకుందని వ్యాఖ్యానించారు.

## వాణిజ్యం

# అత్యంత విలువైన కంపెనీగా అమెజాన్

**వాషింగ్టన్, జనవరి 18:** ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా మళ్లీ అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది ఆపిల్ తొలి స్థానంలో ఉండగా, ఈ యేడాది అమెజాన్ తిరిగి తన స్థానాన్ని కైవసం చేసుకుంది. గతేడాదితో పోలిస్తే కంపెనీ విలువ దాదాపు 15శాతం మేర పడి పోయినప్పటికీ, అమెజాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ మేరకు 'గ్లోబల్ 500 2023' పేరిట బ్రాండ్ ఫైనాన్స్ తన నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 299.3 బిలియన్ డాలర్లతో అమెజాన్ అగ్రస్థానంలో నిలిచింది. కంపెనీ రేటింగ్ కూడా ఎఎఎప్లస్ నుంచి ఎఎఎకి తగ్గడం విశేషం. అమెజాన్ సేవల పట్ల వినియోగదారుల దృక్పథం మారిందని, డెలివరీ సమయం కూడా పెరిగిందని ఈ సందర్భంగా బ్రాండ్ ఫైనాన్స్ తన నివేదికలో పేర్కొంది. విలువైన కంపెనీల జాబితాలో ఆపిల్ రెండో స్థానంలో



నిలిచింది. గతేడాది 355 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ కంపెనీ విలువ 16 శాతం క్షీణించి 297.5 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో అమెజాన్ తర్వాత రెండో అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. సరఫరా గొలుసులో అవరోధాలు ఆపిల్ విలువ పతనానికి కారణమైందని నివేదిక విశ్లేషించింది. 2022 లో టాప్-50లో నిలిచిన స్నాప్‌చాట్, ట్విట్టర్ టాప్-50 జాబితాలో స్థానాన్ని కోల్పోయానని నివేదిక తెలిపింది. ఇవే కాకుండా శాంసంగ్, అలీబాబా, ఫేస్‌బుక్, వియ్ చాట్ వంటి అంతర్జాతీయ కంపెనీలు తమ విలువను పెంచుకున్నాయి. ఈవీలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో టెస్లా, బివైడి కంపెనీలు వృద్ధి చెందాయని నివేదిక తెలిపింది.

## మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు ఉద్వాసన!

**వాషింగ్టన్, జనవరి 18:** ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కొత్త యేడాదిలోనూ కొనసాగుతోంది. తాజాగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వేలాది మంది ఉద్యోగుల్ని తొలగించేందుకు సిద్ధమైంది. మొత్తం సిబ్బంది లో ఐదు శాతానికి సమానమైన 11వేల మంది ఉద్యో గుల్ని తొలగించడానికి సన్నాహాలు చేసుకున్నట్లు సమా చారం. ఇప్పటికే ట్విట్టర్, అమెజాన్, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా వంటి బడా టెక్ సంస్థలు భారీ ఎత్తున ఉద్యోగులను తగ్గించుకున్న విషయం విదితమే. బుధ వారం నుంచే మైక్రోసాఫ్ట్‌లో తొలగింపు ప్రక్రియ ప్రారంభ మయ్యే అవకాశం ఉందని సమాచారం. మానవ వనరులు, ఇంజినీరింగ్ విభాగాల్లో



అధికంగా తొలగింపులు ఉంటాయని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అస్థిరతలు, మాంద్యం భయాలు బలపడుతున్న నేపథ్యంలో కంపెనీలన్నీ వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్న విషయం విదితమే. వచ్చే రెండేళ్లపాటు కంప్యూటర్ పరిశ్రమ తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కోబోతున్నట్లు ఇటీవలే మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదేళ్ల హెచ్చరించిన విషయం విదితమే. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న పరిణామాలకు మైక్రోసాఫ్ట్ సైతం అతీతమేమీ కాదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో డిజిటల్ సంస్థల్లో సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాల్సిన అసవరం ఉందంటూ పరోక్షంగా తొలగింపులపై సంకేతాలిచ్చారు. వ్యక్తిగత కంప్యూటర్ల పరిశ్రమలో కొన్ని త్రైమాసికాల నుంచి నిర్లిప్తత నెలకొన్న విషయం విదితమే. ఇది విండోస్ సహా మైక్రోసాఫ్ట్ ఉత్పత్తుల విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరోవైపు క్లౌడ్ వ్యాపారమైన అజూర్‌తో కంపెనీ వృద్ధిని కొనసాగించడం కష్టతరంగా మారింది. గత యేడాది జులైలోనే కొంతమంది ఉద్యోగుల్ని మైక్రోసాఫ్ట్ ఇంటికి పంపింది. అక్టోబరులోనూ సుమారు వెయ్యి మందికి ఉద్వాసన పలికింది.

## రుణగ్రహీతలకు ఆర్‌బిఐ ఊరట!

**ముంబై, జనవరి 18:** గడచిన కొన్ని నెలలుగా భారతీయ రిజర్వ్ బ్యాంకు తన వడ్డీరేట్లను పెంచుతూ పోతోంది. మార్కెట్లో లిక్విడిటీని తగ్గించడానికి తద్వారా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కేంద్రంతో కలిసి రిజర్వ్ బ్యాంకు రెపో రేట్ల పెంపులో దూకుడును ప్రదర్శించింది. ఈ క్రమంలో ఫిబ్రవరిలో ద్రవ్య పరపతి సమావేశం ఉండడం ఎన్నికలకు ముందు కేంద్ర వార్షిక బడ్జెట్ రావడం చాలా కీలకంగా మారాయి. రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరులో యేడాది కనిష్టస్థాయి అయిన 5.72శాతానికి తగ్గింది. దాదాపు 20 మంది ఆర్థికవేత్తలు మింట్ నిర్వహించిన పోల్‌లో ద్రవ్యోల్బణం 5.9శాతంగా అంచనా వేశారు. అయితే ఇప్పుడు పరిస్థితులు అదుపులో ఉన్నందున రిజర్వ్ బ్యాంకు తన



దూకుడుకు కళ్లెం వేయవచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఒకవేళ అలా జరగకపోతే మార్కెట్లో డిమాండ్ మరింతగా ప్రభావితం అవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రధాన ద్రవ్యోల్బణం ముఖ్యంగా ఆహారం, ఇంధనం కూడా కొంతమేర తగ్గడం ఆర్థికంగా పుంజుకోవడానికి దోహదపడుతోంది. అయితే ఇవి సెంట్రల్ బ్యాంకు రానున్న సమావేశం నిర్ణయాల్లో ప్రతిధ్వనించవచ్చని తెలుస్తోంది. మే 2022 నుంచి గత డిసెంబర్‌లో జరిగిన సమావేశం వరకు రిజర్వ్ బ్యాంకు రెపో రేటును దశలవారీగా 225 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఇదే క్రమంలో యుఎస్ ఫెడరల్ రిజర్వ్ కూడా వడ్డీరేట్లను భారీగా 425 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. అక్టోబరు-డిసెంబర్ కాలానికి భారతదేశ ప్రధాన ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ అంచనా కంటే తక్కువగా ఉండడంతో, సెంట్రల్ బ్యాంకు తన వ్యూహాన్ని మార్చుకోవచ్చని ఆర్థికవేత్త అంకితా పాఠక్ తెలిపారు. ఈ యేడాది భారత వృద్ధిరేటు 7శాతంగా ఉంటుందని భారత ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. సెంట్రల్ బ్యాంకు మాత్రం ఇది 6.8శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. మొత్తానికి చాలా మంది ఆర్థిక నిపుణులు భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం వృద్ధిబాటలోనే ముందుకు సాగుతుందని భావిస్తున్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిన భారత్ పరిస్థితి చాలా మెరుగైన స్థాయిలో ఉందని వారు అంటున్నారు.

## మారుతీ సుజుకీ కార్ల రీకాల్

**న్యూఢిల్లీ, జనవరి 17:** మారుతీ సుజుకీ ఇండియా 17,362 కార్లను రీకాల్ చేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఆల్టో కె10 బ్రెజ్జా, బ్యాలెనో, ఎస్-ప్రెసో, ఈకో, గ్రాండ్ విటారా మోడళ్లలో కొన్నింటిలో ఎయిర్‌బ్యాగ్ కంట్రోలర్‌లో లోపం ఉండే అవకాశం ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. లోపం ఉన్న కార్లలో తగు మార్పులు చేసి తిరిగి కస్టమర్లకు అప్పగిస్తామని పేర్కొంది. 2022 డిసెంబరు 8 నుంచి 2023 జనవరి 12 మధ్య తయారైన కార్ల ఎయిర్‌బ్యాగ్ కంట్రోలర్‌లలో లోపం ఉండే అవకాశం ఉందని గుర్తించినట్లు మారుతీ సుజుకి బుధవారం ప్రకటించింది. ఎలాంటి రుసుములు తీసుకోకుండానే తనిఖీ, మరమ్మతు ప్రక్రియను పూర్తిచేస్తామని తెలిపింది. ఒకవేళ ఈ లోపాన్ని సవరించకపోతే ప్రమాదం జరిగినప్పుడు అరుదుగా ఎయిర్‌బ్యాగ్‌లు, సీట్‌బెల్ట్‌లు పనిచేయకపోవచ్చునని పేర్కొంది. ఈ నేపథ్యంలో పైన తెలిపిన




తేదీల మధ్య తయారైన కార్లను కొనుగోలు చేసిన వారికి కంపెనీ నుంచి పిలుపు వస్తుందని తెలిపింది. తనిఖీ చేసి లోపం ఉంటే, వాటిని సవరించే వరకు కార్లను నడపొద్దని తెలిపింది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సానుకూలంగా కొనసాగిన సూచీలు ఒక దశలో 400 పాయింట్లకుపైగా లాభపడ్డాయి. చివరికి




సెన్సెక్స్ 390 పాయింట్లు పెరిగి 61,045 పాయింట్ల స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ కూడా 110 పాయింట్లు పెరిగి 18,164 పాయింట్ల వద్ద నిలిచింది. దీంతో సెన్సెక్స్ మళ్లీ 61వేల పాయింట్ల స్థాయికి, నిఫ్టీ 18,150 ఎగువకు చేరాయి. ఐటి, మెటల్ షేర్లు సూచీలు దన్నుగా నిలిచాయి. హిండాల్కో, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, యుపిఎల్, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లులాభాల్లో ముగిసాయి. టాటామోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, నెస్లేఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బిపిసిఎల్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఇక పోతే డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.81.24 వద్ద స్థిరపడింది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో తమ కార్యకలాపాల ఆదాయంలో 41.29 శాతం వృద్ధి నమోదైనట్లు ల్యాండ్‌మార్క్ కార్స్ వెల్లడించింది. దీంతో కంపెనీ షేరు ఇంట్రాడేలో 7శాతానికిపైగా పెరిగి రూ.598.60 వద్ద సరికొత్త గరిష్టానికి చేరింది. చివరికి 5.02 శాతం పుంజుకొని రూ.586.50 వద్ద నిలిచింది. ఐసిఐసిఐ లాంబార్డ్ షేరు చివరికి 4.18శాతం నష్టపోయి 1,197.50 రూపాయల వద్ద నిలిచింది.

## రెండు ఫార్మా ఐపిఒలకు సెబి గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, జనవరి 18:** ఇన్నోవా క్యాప్‌టాబ్, బ్లూజెట్ హెల్త్‌కేర్ కంపెనీల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌కు సెబి నుంచి ఆమోదం లభించింది. దీంతో ఈ రెండు సంస్థలు ఐపిఒ రూపంలో ప్రజల నుంచి నిధులు సమీకరించుకునేందుకు మార్గం సుగమం అయింది. ఈ రెండు సంస్థలు గతేడాది జూన్-సెప్టెంబర్ మధ్య ఐపిఒ అనుమతి కోరుతూ సెబి వద్ద పత్రాలు దాఖలు చేశాయి. తాజాగా ఈ రెండింటి ఐపిఒలకు సెబి అనుమతి తెలియచేసింది. ఇన్నోవా క్యాప్‌టాబ్ తాజా ఈక్విటీ జారీ రూపంలో




రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. కంపెనీలో ఇప్పటికే వాటాలు కలిగిన ప్రమోటర్లు, ఇతర వాటాదారులు 96 లక్షల ఈక్విటీ షేర్లను ఐపిఒలో భాగంగా విక్రయించనున్నారు. అంటే ఈ మొత్తం ఆయా వాటాదారులకే వెళుతుంది. తాజా షేర్ల జారీరూపంలో వచ్చే నిధుల నుంచి 180 కోట్ల రూపాయలను కంపెనీ రుణాలు తీర్చివేసేందుకు వినియోగించనుంది. 90 కోట్ల రూపాయలను మూలధన అవసరాలకు ఉపయోగిస్తుంది. ఇన్నోవా క్యాప్‌టాబ్ ఫార్మా రంగంలో పరిశోధన, అభివృద్ధి, తయారీ, పంపిణీ, మార్కెటింగ్, ఎగుమతి సేవలను అందిస్తోంది. ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియంట్స్‌ను తయారు చేసే బ్లూజెట్ హెల్త్‌కేర్ ఐపిఒలో భాగంగా 2,16,83,178 షేర్లను విక్రయించనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.